ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 97 పేజీలు: 12 వెల: 6.50

ఆపరేషన్ 'సిందూర్'కు గంగాహారతి

ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాం: రాజ్‌నాథ్ 9లో



గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# అమరావతే రాజధాని

## ఎపి పునర్విభజన చట్టంలో సవరణకు కేంద్రాన్ని కోరిన కేబినెట్

### 'ఆపరేషన్ సిందూర్'ను సక్సెస్ చేసిన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీకి అభినందనలు తెలిపిన మంత్రిమండలి

### కేబినెట్ భేటీలో పలు తీర్మానాలకు ఆమోదం

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ విభజిత రాష్ట్ర రాజధాని పేరును 'అమరావతి'గా నిర్ణయిస్తూ గతంలోని ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 యొక్క సెక్షన్ 5 అనుబంధ సబ్ సెక్షన్ (2) మరియు సెక్షన్ 5కు వివరణలో చట్ట సవరణ కోసం చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేరుస్తూ చట్ట సవరణ చేసేందుకు కేబినెట్‌లో ఆమోదం తెలిపారు. 2014 పునర్విభజన చట్టంలో రాజధాని అమరాతి అని లేదని.. ఒకసారి పునర్విభజన చట్టంలో రాజధాని అమరావతి అని నిర్ణయిస్తే రాజధానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుందని పలువురు న్యాయనిపుణులతో పాటు ఇటీవల సిఎం చంద్రబాబును కలిసిన రైతులు కూడా సూచించారు. ఈ క్రమంలో రాజధాని అమరావతిగా నిర్ణయించి కేబినెట్ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించారు. 2014 పునర్విభజన చట్టాన్ని కేంద్రంలో ఉన్న ఉభయ సభలు ఆమోదించాయి. అందువల్ల వాటికి చట్ట సవరణ చేయాలి అంటే రాజ్యసభ, లోక్‌సభ చేయాల్సి ఉండటంతో ఎపి రాజధాని అమరావతి అని పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని తీర్మానంలో కేంద్రాన్ని అభ్యర్థించారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌కు ఎపి కేబినెట్ అభినందనలు తెలియజేసింది. ప్రధాని, భారత >>2

# ఇద్దరు మావోయిస్టుల మృతి



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

## దూమకొండ అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్

### భారీగా ఆయుధాలు స్వాధీనం

**పాడేరు, మే 8, ప్రభాతవార్త:** విశ్వసనీయమైన సమాచారం మేరకు అల్లూరిసీతారా మరాజు జిల్లా ఎస్పీ సూచనలతో అడిషినల్ ఎస్పి (అడ్మిన్) పర్యవేక్షణనలో, వై. రామవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వున్న యార్లగడ్డ పంచాయతీ శేషరాయి గ్రామానికి ఉత్తర దిక్కుగా 2 కిలో మీటర్ల లో గల దూమకొండ మరియు గంగకొండ మద్య అటవీ ప్రాంతంలో పోలీసు పార్టీలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ నెల 7 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం సుమారు 02.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మావోయిస్టులు, పోలీసు పార్టీల మీదకి కాల్పులు జరిపగా వెంటనే పోలీసు బలగాలు తమ ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపగా ఈ ఘటనలో సిపిఐ మావోయిస్ట్ పార్టీకి చెందిన ఇద్దరు పురుషులు మృతి చెందారు. ఈ కాల్పుల్లో చనిపోయిన కాకూరి పండన్న అలియాస్ జగన్,ఆంద్రూ,పొసన్న, బిరుసు, భీమన్న, మటియ (ఎస్‌జెడ్‌సిఎం) వాగపొడియామి అలియాస్ రమేష్ నాగన్న (డిసిఎం) గా గుర్తించడం జరిగిందనీ ఎస్పీ అమిత్ బార్డర్ తెలిపారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా లో ఇప్పటి వరకు మావోయిస్ట్ >>2

# పాక్‌కు చావుదెబ్బ

## సమర 'సిందూర'ం



బిఎస్ఎఫ్ అదుపులో పాక్ పైలట్ 2లో

- దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లిన సరిహద్దులు
- దాయాది కుట్రలను సమర్థంగా తిప్పికొట్టిన భారత్
- 5 పాక్ యుద్ధ విమానాలు, 8 మిస్సైళ్ల కూల్చివేత
- సూసైడ్ డ్రోన్లను విఫలం చేసిన ఎస్- 400
- లాహోర్, సియాల్‌కోట్ ముష్కర స్థావరాలపైనా దాడులు
- ధర్మశాల ఐపిఎల్ మ్యాచ్‌ల నిలిపివేత
- జమ్ముపైకి పాక్ ప్రయోగించిన రాకెట్లు ధ్వంసం

**న్యూఢిల్లీ, మే 8:** కయ్యానికి కాలు దువ్వుతున్న పాకిస్తాన్‌కు భారత్ గట్టిగా బుద్ధిచెపుతోంది. దాయాదిరాజధాని ఇస్లామాబాద్, పంజాబ్‌ప్రావిన్స్‌లోని సియాల్‌కోట్, రావల్పిండి, లాహోర్ నగరాలపై డ్రోన్లు, క్షిపణులతో భారత్ విరుచుకుపడింది. పాక్‌కు ఊపిరాడని విధంగా భారత్ దాడులు నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింతగా పాకిస్తాన్ భారత్‌పై దాడులకు ఉపక్రమించడంతో మన రక్షణరంగం కదనరంంలోకి దిగింది. తాజాగా జమ్ము ఎయిర్‌పోర్టుపై రాకెట్ దాడికి దిగడంతో రష్యా తయారీ ఎస్ 400 సుదర్శనతో నిర్వీర్యంచేసింది. సరిహద్దురాష్ట్రాలను లక్ష్యంగాచేసుకుని పాకిస్థాన్ దాడులకు దిగుతోంది. దీనితో భారత్ మొత్తం సరిహద్దు రాష్ట్రాలయిన జమ్ముకాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్‌ల్లోని తీరప్రాంతాలు, సరిహద్దుల్లో విద్యుత్‌సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. జమ్ముయూనివర్సిటీ, జమ్ము ఎయిర్‌పోర్టుపై జరిపిన పాక్ రాకెట్‌దాడులను ఎస్ 400 క్షిపణులతోనే తిప్పికొట్టింది. >>2



ఐసి-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి 2లో

పాక్ ఒటిటిలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లపై నిషేధం

# ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ ఎపి

## పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రాన్ని మార్చుతున్నాం

### ఎల్జీ యూనిట్ భూమి పూజలో మంత్రి లోకేష్



గురువారం శ్రీసిటిలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ యూనిట్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

**శ్రీసిటీ(తిరుపతి),మే 8ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు ఐదువేల కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులతో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ప్రపంచస్థాయి తీసుకు రావడమేగాక ఏపిని పెట్టుబడులకు గమ్యస్థానంగా తయారుచేస్తున్నామని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రంలో సృష్టించబడే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్ పవర్ హౌస్‌గా మార్చేందుకు బాటలువేస్తున్నామని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు కొత్తపునాదులు వేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీలో అంతర్జాతీయ స్థాయి గృహోపకరణాల తయారీ సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శ్రీసిటీలో గురువారం ఉదయం మంత్రి నారాలోకేశ్ భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ యూనిట్ ఒక నిర్మాణ ప్రాజెక్టు ప్రారంభం కంటే పెద్దదన్నారు. ఇది మన రాష్ట్రంతోడాటు భారతదేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒకమైలురాయిగా అభివర్ణించారు. మేడ్‌ఇన్ ఆంధ్రనుండి మేడ్ ఫర్ ది వరల్డ్ వరకు కూటమి ప్రభుత్వం జైత్రయాత్ర కొనసాగుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో వేగం,బలమైన మౌలిక సదుపాయాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుపై చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడతుందన్నారు. శ్రీసిటీలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ అత్యాధునిక తయారీ కర్మాగారానికి శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా ఇక్కడకు రావడం గౌరవంగా భావిస్తున్నాన్నారు. ఎల్‌జిసంస్థ దాని భాగస్వాములు కలసి భారత దేశంలో ఎఐ ఆధారిత తయారీ, స్మార్ట్ ఉత్పత్తి ప్రక్రియలు, ఎనర్జీ ఎఫిషియంట్ విధానాలు, అత్యాధునిక సాంకేతికతలను తీసుకువస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీకి ప్రపంచస్థాయి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలనే ఆశయాన్ని ఎల్‌జి సంస్థ ముందుకు తీసుకెళుతోందని మంత్రి లోకేష్ >>2

# నేడు ఉరవకొండకు సిఎం చంద్రబాబు

## హంద్రీనీవా విస్తరణ పనుల పరిశీలన

**అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో :** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం, వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామం వద్ద హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ప్రధాన కాలువ విస్తరణపనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిశీలించేందుకు శుక్రవారం వస్తున్నారు. కాలువ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో పనులను సమీక్షించి రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఛాయాపురం గ్రామం వద్ద నిర్వహించనున్నారు. సాయంత్రం బెంగుళూరులో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొని హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణం కానున్నారు.

సిఎం చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటనకు హంద్రీనీవా ఆయకట్టు రైతుల్లో గంపెడుఆశలు నెలకొన్నాయి. హంద్రీనీవా ప్రధాన కాలువను మాల్యాల వద్ద నుంచి జీడిపల్లి రిజర్వాయర్ వరకు 3850 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరణ పనులు కాలువ కింది భాగంలో లైనింగ్ పనులను చేపడుతున్నారు. 3850 క్యూసెక్కులకు బదులు 10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పనులను చేపట్టాలని, ఆ దిశలో రాష్ట్ర >>2

# ముగ్గురు లిక్కర్ కేసు నిందితులకు ఎదురు దెబ్బ

## బెయిలుకు సుప్రీం నిరాకరణ

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కృష్ణ మోహనరెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పకు ముందస్తు బెయిలు ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వాదనల సందర్భంగా, హైకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడే నిందితులు సుప్రీం కోర్టులో మధ్యంతర బెయిలు పిటీషన్ దాఖలు చేశారని ఎపి ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఆ పిటీషన్ ఇప్పుడు విచారణార్హం కాదని పేర్కొన్నారు. హైకోర్టు తాజాగా ముందస్తు బెయిలు నిరాకరించినందున నిందితులు గతంలో దాఖలు చేసిన పిటీషన్‌ను సవరించాలని,లేదా కొత్త పిటీషన్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను ధర్మాసనం పనిగణనలోకి తీసుకుంది.

ఈ క్రమంలో కొత్తగా మరోసారి పిటీషన్ దాఖలు చేయడానికి అనుమతివ్వాలని ధర్మాసనాన్ని నిందితులు కోరగా,జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం అనుమతించింది. మరోవైపు ఈ నెల 13వ తేదీ వరకైనా మధ్యంతర రక్షణ కల్పించాలని నిందితుల తరపు న్యాయవాదులు అభ్యర్థించారు. మధ్యంతర రక్షణ ఇవ్వడం కుదరదని ధర్మాసనం తేల్చి చెప్పింది. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 13కు వాయిదా వేసింది. >>2

# 'నకిలీ' మందులపై గట్టి నిఘా



## ఆయుర్వేదంపై అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలకు 13 మంది ఆయుష్ వైద్యులకు అధికారం

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆయుర్వేద వంటి భారతీయ సంప్రదాయ మందుల వినియోగానికి సంబంధించి తప్పుడు ప్రకటనలపై చట్ట ప్రకారం తగు చర్యల్ని తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 13 మంది ప్రభుత్వ ఆయుష్ వైద్యులకు అధికారాల్ని కట్టబెట్టింది. డ్రగ్స్ అండ్ మేజికల్ రెమెడీస్ (అబ్జెక్షనబుల్ అడ్వర్టయిజ్‌మెంట్స్) చట్టం, 1954 కింద ఉమ్మడి 13 జిల్లాల్లో తగు చర్యలు తీసుకునేందుకు వీరికి రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తగు అధికారాల్ని కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసారు.

ఎపి రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ ఈ అంశంపై ఒక ప్రకటన విడుదల చేసింది.అల్లోపతిక్ మందులతో పాటు భారతీయ సంప్రదాయ మందుల ప్రయోజనాలపై అసత్యపు ప్రచారంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆయుష్‌కు సంబంధించి నిఘా విభాగాన్ని పటిష్టం చేయడానికి మంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు ఆయుష్ మందులకు సంబంధించిన అసత్యపు ప్రచారంపై చర్యలు తీసుకునేందుకు కేవలం ఒక్క అధికారి మాత్రమే విధులు నిర్వహించేవారు.

ఈ యంత్రాంగాన్ని అవసరాల మేరకు మరింత విస్తృతం చేయాలని సుప్రీం కోర్టు ఇటీవల అన్ని రాష్ట్రాలకు సూచించింది. అల్లోపతిక్ మందులకు సంబంధించి అటువంటి ప్రకటనలపై చర్యలు తీసుకునేందుకు గతంలోనే డ్రగ్ ఇన్స్‌పెక్టర్లందరికీ అధికారాలు సంక్రమించబడ్డాయి. ఆయా మందులకు సంబంధించి తప్పుడు ప్రకటనలు సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశమున్నందున వాటిని నిషేధించాలని 1954నాటి చట్టం స్పష్టం చేసింది. అయినా...అప్పట్నించీ భారతీయ సంప్రదాయ మందులపై అసత్యపు ప్రకటనల పట్ల తగు స్థాయిలో చర్యలు తీసుకోబడలేదని సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. 1954 చట్టం ప్రకారం.. మందుల వాస్తవ గుణాలకు విరుద్ధంగా తప్పుడు సమాచారం చేసి, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం, కొన్ని వ్యాధులకు అద్భుత పరిష్కారాలు( మేజికల్ రెమెడీస్) లభిస్తాయని ప్రచారం చేయడం నేరంగా పరిగణించబడుతుంది. అటువంటి ప్రచారాన్ని ఏ రీతిలోనైనా చేయడాన్ని చట్టం నిషేధించింది.

గర్భధారణ, గర్భస్రావ నివారణ, రుతు చక్ర లోపాల నివారణ, లైంగిక శక్తి ఇనుమడింపు వంటి వాటికి కొన్ని మందులు పనిచేస్తాయంటూ చేసే ప్రచారాన్ని చట్టం నిషేధించింది. మరికొన్ని ఇతర వ్యాధులకు ఇతర వైద్య విధానాల ద్వారా వీలు కాని అద్భుత పరిష్కారాలు (మేజికల్ రెమెడీస్) దొరుకుతాయంటూ చేసే ప్రకటనలపై కూడా చర్యలు చేపట్టేందుకు చట్టం వీలు కల్పించింది. 1954చట్టం కింద శిక్ష.. 1954 చట్టం ప్రకారం అసత్యపు ప్రకటనలతో నేరం చేసిన వారికి 6 నెలల >>2

దేశవ్యాప్తంగా పెండింగ్‌లో 7 లక్షల క్రిమినల్ ఫైళ్లు 5లో

# జంట హత్యల కేసు 11 మందికి యావజ్జీవం

## ఐదుగురు నిర్దోషులుగా తీర్పు

### వైఎస్సార్సీ నేత నారాయణ రెడ్డి హత్యకేసు

### తీర్పు నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత



హత్యకు గురైన నారాయణ రెడ్డి (ఫైల్)

**కర్నూలు, మే 8, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లాలో జరిగిన జంట హత్యల కేసులో11 మందికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. ఫ్యాక్షన్ నేపథ్యంలో జరిగిన ఈ జంట హత్యల కేసులో మొత్తం 19 మంది నిధులు కాగా.. 11 మందికి జీవిత ఖైదు విదిస్తూ... ఐదు మందిని నిర్దోషులుగా ప్రకటించింది. ముగ్గురు ఇప్పటికే మరణిం చారు. 2017 జరిగిన ఈ ఫ్యాక్షన్‌లో రెండు రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉండడం గమనార్హం. కాగా సదరు హత్య కేసులో నిందితులుగా ఉన్న ప్రముఖులను అప్పుడే తప్పించారని ప్రత్యర్థులు ఆరోపణలు చేస్తున్నారు. అదే క్రమంలో హత్య చేసిన వర్గానికి చెందినవారు అప్పుడే గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. వారి ఆస్తులను ప్రత్య ర్థులు అనుభవిస్తున్నారు. వారిని తిరిగి గ్రామంలోచేర్చాలని ప్రభుత్వాలు, పోలీసులు ఎంతగా ప్రయత్నిం చినా సత్ఫలితాలు రాలేదు. జంట హత్యలలో ఒకరు పత్తికొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణరెడ్డి మరొకరు ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మద్దికుంట వెంకటరెడ్డి వాదనలు వినిపించారు. 2017 మే 21న రామకృష్ణాపురంలో వివాహానికి హాజరై వస్తుండగా కృష్ణగిరి సబ్ స్టేషన్ దగ్గర.. నారాయణరెడ్డి దారుణ >>2

09-05pg2exHMNWJQE.qxd:09-05pg2exHMNWJQE.qxd 09/05/25 1:52 AM Page 1





గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఆల్‌పార్టీ సమావేశానికి హాజరైన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ తదితరులు

# పాక్‌కు చావుదెబ్బ

>> పాక్ డ్రోన్లు, క్షిపణులను ఎక్కడికక్కడ కూల్చివేసింది. దాయాది మొత్తం 15 నగరాలపై ఫోకస్ పెట్టిందన్న సమాచారం రావడంతో ముందు పాక్‌వైపు ఉన్న రాడార్ వ్యవస్థలను నిర్వీర్యంచేసిన భారత్ వెనువెంటనే దాడులకు ఉపక్రమించింది. ఇజ్రాయిల్ టెక్నాలజీతో తయారుచేసిన హారోప్ డ్రోన్లను దాడులకు ఉపయోగించింది. యుద్ధం అన్న పదం మాత్రమే వినపడటంలేదుకాని దాదాపు యుద్ధం మాదిరిగానే జరుగుతుండటంతో ఇరుదేశాల్లోని సరిహద్దుగ్రామాలప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా భారత్‌లోని 15 నగరాలను టార్గెట్‌చేసినా పాక్ ఆటలను ఎక్కడా సాగనీయలేదు. రష్యా తయారీ సుదర్శన్ చక్రతో మొత్తం అన్నింటిని భారత్ నేలకూలుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన దీర్ఘశ్రేణి వాయురక్షణ వ్యవస్థల్లో సుదర్శన్‌చక్రొకటి. రాత్రి ఎనిమిది గంటలు దాటినతర్వాత దాడులు ముమ్మరం అయ్యాయి. పాక్ క్షిపణులను ఎక్కడికక్కడ కూల్చివేసింది. భారత గగనతలంలోకి ప్రవేశించిన నాలుగు పాక్ ఎఫ్ 16 యుద్ధవిమానాలనుభారత్ ఈ సుదర్శన చక్రతోనే కూల్చివేసింది. దీనితో ఇక భారత్‌కూడా పాక్ నగరాలపై దాడులకు ఉపక్రమించింది. పాక్‌లోని తొమ్మిది నగరాల్లో సైనికస్థావరాలపై డ్రోన్ దాడులతో భారత్ ఉగ్రరూపం చూపించింది. మన రక్షణ వ్యవస్థ దెబ్బకు పాక్ బెంబేలెత్తిపోతోంది. లాహోర్ ఎయిర్‌పోర్టు, లాహోర్ సైనిక కేంద్రం, రావల్పిండి, సియాల్‌కోట్‌ప్రాంతాల్లోని సైనిక, ఆయుధ, వైమానిక స్థావరాలే టార్గెట్‌గా భారత్ దాడులుచేస్తోంది. 400 కిలోమీటర్ల దూరంవరకూ శత్రువులు ప్రయోగించే వైమానిక దాడులనుసమర్థవంతంగా తిప్పికొడుతోంది. స్టీల్త్ ఎయిర్‌క్రాఫ్ట్, ఫైటర్ జెట్స్, డ్రోన్లు, క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ క్షిపణుల్ని ట్రాక్‌చేసి మార్గమధ్యలోనే కూల్చివేస్తున్నాయి. పంజాబ్‌లోని సరిహద్దుజిల్లాల్లో పాక్ దాడులకు ఉపక్రమించడంతో పఠాన్‌కోట్‌వైపు రాకుండా భారత్ అడ్డుకోగలిగింది. అక్కడితో ఆగకుండా పాక్ భూభాగంలోనే ఏడు డ్రోన్లు, యుద్ధవిమానాలను విజయవంతంగా కూల్చివేసింది. భారత్ రక్షణరంగం సత్తా ఏమిటో ఈ దాడులతో ప్రపంచానికి తెలిసిపోయింది. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోబాల్ ప్రధాని నరేంద్రమోడీతో అత్యవసర భేటీ అయ్యారు. మరోపక్క త్రివిధ దళాలఅధిపతులు, సిడిఎస్‌లతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమావేశం అయ్యారు. ఇదిలా ఉండగా హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరిగే ఐపిఎల్ మ్యాచ్‌ను నిలిపివేసారు. పాకిస్తాన్ టార్గెట్‌లో ఉండొచ్చన్న సమాచారంతో మ్యాచ్‌ను నిలిపివేస్తున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. పాకిస్తాన్‌పై దాడులకు ఎస్400 సుదర్శన చక్రతోపాటు ఎల్70 డిఫెన్స్ సిస్టమ్‌లను కూడా సిద్ధంచేసింది. జమ్ములో రాకెట్‌దాడులు చేయడం, భారత్ వాటిని విజయవంతంగా కూల్చివేసిన తర్వాత జమ్ముల్లో బ్లాకౌట్‌ను ఎత్తివేస్తున్నట్లు ఆర్మీ ప్రకటించింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఎయిర్‌వార్నింగ్ వ్యవస్థలనుకూడా భారత్ ధ్వంసంచేసింది. ఉదయమే లాహోర్ రక్షణ వ్యవస్థలను ధ్వంసంచేసిన భారత్ తాజాగా సియాల్‌కోట్‌పైనా దాడులుచేసి సైనిక,వైమానిక రక్షణరంగ వ్యవస్థలపై డ్రోన్‌దాడులు కురిపించింది.

## బిఎస్‌ఎఫ్ అదుపులో పాక్ పైలట్

**న్యూఢిల్లీ, మే 8:** భారత్‌లోని నగరాలను టార్గెట్‌చేస్తున్న పాకిస్తాన్ డ్రోన్లను ఎక్కడికక్కడ కూల్చివేయడంతోపాటు పాక్‌కు చెందిన జెఎఫ్17 విమానాన్ని భారత్ సుదర్శన చక్ర కూల్చివేసింది. రష్యా తయారీ శక్తివంతమైన ఎస్ 400ను సుదర్శన చక్ర అని పేరుపెట్టింది. ఇదిలా ఉంటే రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో దాడికి ప్రయత్నించిన పాక్ యుద్ధవిమానం పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరిహద్దుభద్రతా దళం క్విక్ రెస్పాన్స్ టీమ్ పాక్ పైలట్‌ను అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించినట్లు తెలుస్తోంది. పాక్‌క్షిపణులను కూల్చివేయడంలో ఎస్ 400 కీలకభూమిక పోషిస్తోంది. ఉదయం లాహోర్ డిఫెన్స్ వ్యవస్థను ధ్వంసంచేసిన భారత్ ఇపుడు ఇస్లామాబాద్, సియాల్‌కోట్, పివోకే, లాహోర్; రావల్పిండి, కరాచి వంటి నగరాలపై డ్రోన్లు, క్షిపణుల వర్షం కురిపిస్తోంది. అయితే పట్టుబడిన పైలట్‌నుంచి పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## ఐసి-814 హైజాక్ సూత్రధారి అబ్దుల్ రవూఫ్ మృతి

**ఇస్లామాబాద్, మే 8:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ విజయవంతంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది దేశం పాక్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేపట్టిన ఈ దాడులతో జైషే మహ్మద్ ఉగ్ర సంస్థ చీఫ్ మౌలానా మసూద్ అజార్‌కు కోలుకోలేని దెబ్బతగిలింది. ఇప్పటికే అజార్‌కుటుంబం మొత్తం హతమైన విషయం తెలిసిందే. తాజాగా ఆయన సోదరుడు, ప్రస్తుతం జైషే నంబరు-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సైతం ప్రాణాలు కోల్పోయారు. భారత్ దాడుల్లో బహావల్‌పూర్‌లోని జైష్ మహ్మద్ ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఈ దాడిలో 10 మంది మసూద్ కుటుంబసభ్యులు, నలుగురు సహాయకులు ప్రాణాలు కోల్పోయారు. జైషే చీఫ్ ప్రాణాలతోనే ఉన్నట్లు తెలిసింది. భారత్ జరిపిన దాడిలో తన కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయినట్లు మసూదే స్వయంగా వెల్లడించారు. తాజాగా అతడి సోదరుడు రవూఫ్ అస్గర్ కూడా మరణించారు. రవూఫ్ అస్గర్ పలు ఉగ్రదాడుల్లో కీలక నిందితుడు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసి-814 హైజాక్ సూత్రధారి. అతడి మాస్టర్‌మైండ్స్‌తో ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్‌చేసి కాందహార్‌కు తరలించారు. అనంతరం భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. ఇక్కడి జైళ్లలో ఉన్న ఉగ్రనాయకులు మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్‌ను విడిపించుకొని తీసుకెళ్లారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్ట్ డేనియల్ పెర్ల్ హత్యలో కూడా ఇతడి పాత్ర ఉంది.

## పాక్ ఒటిటిలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లపై నిషేధం

### కేంద్రసమాచారశాఖ ఉత్తర్వులు జారీ

**న్యూఢిల్లీ మే 8:** పాకిస్థాన్‌లో రూపొందిన మీడియా కంటెంట్ ప్రసారంపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. ఒటీటీ, ఇతర మీడియా ప్లాట్‌ఫామ్స్ కోసం తయారైన వెబ్‌సిరీస్‌లు, సినిమా పాటలు, పాడ్‌కాస్ట్‌లను నిషేధించింది. జాతీయ భద్రత దృష్ట్యా నిషేధం తక్షణం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడికి ప్రతీకారంగా, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు దాడులు చేశాయి. దీనితో ఇరుదేశాల మధ్య మరింతగా ఉద్రిక్తతలు . ఈ నేపథ్యంలో సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. "జాతీయ భద్రత దృష్ట్యా, భారతదేశంలో పనిచేస్తున్న అన్ని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, మీడియా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఇంటర్మీడియరీస్ పాకిస్థాన్‌కు చెందిన వెబ్ సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు సహా ఇతర మీడియా కంటెంట్‌ను నిలిపివేయాలి. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని కేంద్రసమాచార శాఖ ఆదేశాలు జారీచేసింది.

## నేడు ఉరవకొండకు సిఎం చంద్రబాబు

>> ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు, మేధావులు, రాజకీయ పార్టీలు కోరుతున్నాయి. అదే విధంగా హంద్రీనీవా కాలువ విస్తరణపనులు లైనింగ్ పనులకు మాత్రమే టెండర్లు పిలిచారు, పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా హంద్రీనీవా కాలువ వెంట డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి పంట పొలాలకు నీళ్లు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశలో జిల్లా పర్యటనలో సీఎం చంద్రబాబునాయుడు తగిన ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద శ్రీశైలం జలాశయం లోతట్టు ప్రాంతమైన మాల్యాల వద్ద నుంచి జీడిపల్లి జలాశయం వరకు 800 కోట్లతో హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో గుత్తేదారులు ప్రస్తుతం చేపడుతున్నారు. పనులు వేగంగా జరుగుతున్నాయి. మెగా ఇంజినీరింగ్ సంస్థ, విపిఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలకు పనులను అప్పగించారు. ఆ సంస్థలు కాలువ విస్తరణ పనులను చురుగ్గా చేపడుతున్నాయి. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి ప్రధాన కాలువ వెడల్పు పనులు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశించడంతో పనులను గుత్తేదారులు చురుగ్గా చేపడుతున్నారు. ఇదే విధంగా జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వరకు 216.3 కిలోమీటర్ల నుంచి 400 కిలోమీటర్ల వరకు హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు 936 కోట్లతో పనులు చేపడుతున్నారు. ఈ పనులను ఐదు రీచ్‌లుగా విభజించి లైనింగ్ పనులకు టెండర్లు పిలవడంతో మూడు రీచ్‌లను ఆర్‌విఆర్ విశాఖ పట్నం సంస్థ, రెండు రీచ్‌లను బిఎస్ఆర్, బెంగుళూరు సంస్థ కాంట్రాక్టు పనులను చేజిక్కించుకున్నాయి. అదే విధంగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కింద 0 నుంచి 75 కిలోమీటర్ల వరకు రూ.266 కోట్లతో ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ సంస్థ పనులు చేజిక్కించుకుంది. పుంగనూరు బ్రాంచ్‌కెనాల్ కింద రెండు రీచ్‌లకు టెండర్లు పిలువగా రెండు రీచ్‌లను ఎస్ఆర్‌సి ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ చేజిక్కించుకుని కాలువ లైనింగ్ పనులను వేగంగా నిర్వహిస్తోంది.

## నయనానంద భరితం.. సత్యదేవుని దివ్య కళ్యాణం..

**అన్నవరం, మే 8, (ప్రభాత వార్త ).** రత్నగిరి వాసుడు శ్రీసత్యదేవుని దివ్య కళ్యాణ మహోత్సవం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. రత్నగిరిపై రామాలయం ప్రక్కన గల వార్షిక కళ్యాణ వేదికను, కనులు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో, వివిధరకాల పరిమళ పుష్పజాతులతో రమణీయంగా ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్దారు.

### వారం - వర్జ్యం

తేది : 09-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి మ.2.57
హస్త రా12.09
వర్జ్యం ఉ.9.11-ఉ.10.59
దు.8.14-9.05 2) మ.12.31-మ.1.22
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. చర్చలు సఫలం. పుణ్యక్షేత్రాల సందర్శిస్తారు.

**వృషభం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త ఆశలు చిగురిస్తాయి. వస్తు, వస్త్రాల కొనుగోలు చేస్తారు.

**మిథునం:** పనులలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**సింహం:** ఇంటా బయటా సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. ఉద్యోగ యత్నాలు నత్తనడకన సాగుతాయి.

**కన్య :** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు.

**వృశ్చికం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. శ్రమ పెరుగుతుంది. ఇంటాబయటా అనుకూలం.

**ధనుస్సు:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**మకరం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**మీనం :** ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం సచివాలయంలో జరిగిన ఆర్ అండ్ బి సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

# దేశంలోనే నంబర్ వన్‌గా రాష్ట్రంలో రహదారుల నిర్మాణం

### ప్రతి రహదారి పనులకు డెడ్‌లైన్ తప్పనిసరి: సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రహదారులను అత్యుత్తమ నాణ్యతనిర్వహణ కలిగి ఉండేలా తీర్చిదిద్దాలని... అలాగే తలపెట్టిన అన్ని రహదారుల పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రతీ రహదారి పనులకు డెడ్‌లైన్ నిర్దేశించి, అనుకున్న సమయానికల్లా కార్యరూపం దాల్చేలా చూడాలని స్పష్టం చేశారు. వర్షాకాల రాకముందే రోడ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. 8,744 కి.మీ వరకు రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర, జాతీయ రహదారులు జాతీయ స్థాయిలోనే నెంబర్‌వన్‌గా ఉండాలని సూచించారు. మరోవైపు, రాష్ట్రంలో పూర్తిగా పాడైన 2,683 కి.మీ. రహదారులను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... పలు అంశాలపై అధికారులకు మార్గదర్శకం చేశారు. ఆర్ అండ్ బీలో ఉన్న 304 ఎఇ పోస్టుల ఖాళీల్లో గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేస్తున్న సివిల్ ఇంజినీరింగ్ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

**రాష్ట్రంలో 97 శాతం మరమ్మతులు పూర్తి**

రాష్ట్రంలో రూ.860 కోట్లతో 20,060 కి.మీ. పొడవునా గుంతలు లేకుండా చేపట్టిన మరమ్మతుల పనులు 97 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌హెచ్ఏఐ, మార్త్‌కి సంబంధించి రూ.78,295 కోట్లతో 3,510 కి.మీ. పొడవైన.. 146 పనులు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. 2024 25లో ఎన్‌హెచ్ఏఐ, మార్త్‌కి సంబంధించి రూ.11,682 కోట్లతో 546 కి.మీ. పొడవైన.. 22 పనులు పూర్తి చేశామని చెప్పారు. 202526లో ఎన్‌హెచ్ఏఐ, మార్త్, ఆర్ అండ్ బీకి సంబంధించి రూ.47,788 కోట్లతో 1,186 కి.మీ. పొడవైన... 46 పనులు పూర్తి చేస్తామని అన్నారు.

## ఇద్దరు మావోయిస్టుల మృతి

>> కాకూరి పండన్న అలియాస్ జగన్ పైన సుమారు 100కు పైగా కేసులు ఉన్నాయని, ఇరవై లక్షల రూపాయలు రివార్డులు ఉందన్నారు. అలాగే వాగ పొడియామి అలియాస్ రమేష్ పైన సుమారు 30 కు పైగా కేసులు ఉన్నాయని ఈయనపై ఐదులక్షల రివార్డు ఉందన్నారు. మావోయిస్టులు మృతి చెందిన సదరు సంఘటనా స్థలంలో ఈ క్రింది తెలిపిన వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఎ కె 47 02,0.303 01,4 మ్యాగజైన్లు 3,ఎకె ఒక 0.303 మ్యాగజైన్, మ్యాగజైన్ పౌచ్లు, మెడిసిన్, చిన్న కత్తి, 2 లక్షల98 వేలు నగదు, కిట్ బ్యాగులు, కళ్ళ అద్దాలు 03 జతలు, మావోయిస్ట్ సాహిత్యం, పుస్తకాలు, ఆలీవ్ గ్రీన్ యూనీఫారం, ఇతర వస్తువులు పై సంఘటనలో లభ్యం అయ్యాయన్నారు. అడ్డతీగల సర్కిల్ వై రామవరం పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసారన్నారు. ఇంకా ఎవరైనా మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోవాలని అనుకుంటే అల్లూరి జిల్లా పోలీసు వారు అందుకు సిద్ధంగా ఉన్నారన్నారనీ ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు.

## లిక్కర్ కేసు నిందితులకు ఎదురు దెబ్బ

>> వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో ...నాటి సిఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి,జగన్ ఓఎస్డీ కృష్ణమోహనరెడ్డి,భారతి సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఇప్పటి వరకు 30 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ముడుపుల వసూళ్ళకు వీలుగా మద్యం విధానాన్ని సిద్దం చేయాలనే కుట్ర రూపకల్పన,ముడుపుల వసూళ్ళ నెట్‌వర్క్ నిర్వహణలో అప్పటి ప్రభుత్వ పెద్దల తరపున కీలక పాత్ర పోషించిన ప్రధాన నిందితుడు(ఎ1) రాజ్ కెసిరెడ్డివైకాపా ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి,ఆ పార్టీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి తదితరులతో కలిసి ఈ ముగ్గురు కుంభకోణంలో అన్ని స్థాయిల్లోనూ భాగస్వాములయ్యారని,మద్యం సింటికేట్‌లో వీరిదీ ప్రధాన పాత్రేనని సిట్ ఇప్పటికే గుర్తించింది.

విజయవాడలోని వెటర్నరీ కాలనీలో సిట్ అధికారులు సోదాలు చేపట్టారు. జగన్‌కు అప్పటి కార్యదర్శి ధనుంజయరెడ్డి,ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి,వ్యక్తిగత కార్యదర్శి కెఎన్ఆర్ నివాసాల్లో తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో పలు డాక్యుమెంట్లును స్వాధీనం చేసుకున్నట్లు కీలక సమాచారం.

## 'నకిలీ' మందులపై గట్టి నిఘా

>> జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటినీ విధించవచ్చు. తదనంతర నేరాలకు ఏడాది పాటు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండింటినీ విధించవచ్చు. ప్రకటనల్ని జారీ చేసే వారే కాక వాటిని రూపొందించడంలో పాల్గొనే వారు కూడా శిక్షార్హులే. అధీకృతులు చేయబడిన 13 మంది ఆయుష్ అధికారులు ఆయా జిల్లా పరిధుల్లో అసత్యపు ప్రకటనల నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసు యంత్రాంగం వాటిని నమోదు చేయాలి.

సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు తప్పుడు ప్రకటనల తీవ్ర ప్రభావాల దృష్ట్యా ప్రజల్ని చైతన్యపర్చేందుకు, పోలీస్ యంత్రాంగంలో తగు అవగాహన కల్పించేందుకు వెంటనే చర్యలకు ఉపక్రమించాలని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఫిర్యాదుల పరిష్కారానికి అడిషనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో తగు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని, జాతీయ స్థాయిలో తగు సమన్వయంతో సమర్థవంతమైన చర్యల్ని తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలని..ఈ దిశగా తీసుకునే చర్యలపై ఈ ఏడాది జూన్ నెలలోగా తమకు నివేదించాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది.

**అల్లోపతిక్ మందుల ప్రకటనలపై నిఘా..**

అల్లోపతిక్ మందులకు సంబంధించి ప్రకటనలపై నిఘాఉంచి తగు చర్యల్ని తీసుకునేందుకు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్ ఇన్‌స్పెక్టర్లందరికీ అధికారాలిచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 49 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు విధులునిర్వహిస్తున్నారు. గత పదేళ్లలో ఈరంగంలో 118అసత్యపు ప్రకటనలపైచర్యలు తీసుకున్నారు.

## 11 మందికి యావజ్జీవం

>> హత్యకు గురయ్యారు. ప్రత్యర్థులు కాపుగాసి అతి కిరాతకంగా హత్య చేశారు. ఈ సంఘటనలో నారాయణరెడ్డితో పాటు ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు కూడా హత్యకు గురయ్యారు. ఆ ఘటనపై కృష్ణగిరి పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 46/2017 కేసు నమోదు చేశారు. అందులో ఐపిసి147,148,302,109 సెక్షన్‌లతో ఈ ఎస్ యాక్ట్‌తో పాటు మరికొన్ని సెక్షన్ మేరకు అభియోగాలు నమోదు చేశారు. ఈ జంట హత్యల కేసులో 17 మంది నిందితులు కాగా ఒకరు మృతి చెందారు. ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు కూడా గతంలో నిందితుడిగా ఉండేవారు. అయితే అప్పట్లోనే ఆయన పేరును కోర్టు తొలగించింది. చెరుకులపాడు నారాయణ రెడ్డి, బోయ సాంబ శివుడు డబల్ మర్డర్ కేసులో కర్నూల్ ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ కోర్టు గురువారం తుది తీర్పును వెలువరించింది. తుది తీర్పు కావడంతో 16.మంది ముద్దాయిలు కోర్టుకు హాజరు అయినారు. నిందితుల జాబితా ఇలా ఉంది. ఎ వన్ రామాంజనేయులు ఎటు బోయ రామానాయుడు ఏ.1 రామాంజనేయులు, ఏ.2 బోయ రామనాయుడు, ఏ3 కురువ రామకృష్ణ , ఏ5 మబోయ బాలుడు, ఏ6 బోయ చిన్న ఏలప్ప, ఏ7 బోయ పెద్ద ఎల్లప్ప , ఏ8 బోయ వెంకటరాముడు, ఏ9 బోయ గంటల శ్రీను, ఏ10 చాకలి నారాయణ, ఏ11 రామాంజనేయులు, ఏ12 రామాంజనేయులు, ఏ13 పెద్ద బీషన్న , ఏ16 కురువ పెదయ్య , ఏ17 బోయ గిడ్డయ్య, ఏ18 బోయ గోపాల్, ఏ 19 చిన్న వెంకట్. సుదీర్ఘకాలం విచారణ అనంతరం 11 మందికి శిక్ష విధించింది కోర్టు.. సాక్షాధారాలు రుజువు కాకపోవడంతో ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఇందులో ఏ 1, ఏ 3, ఏ 5, ఏ 9, ఏ 11, ఏ 13 లకు ఐపిసి 302 సెక్షన్ ప్రకారం జీవిత ఖైదు విధించడంతోపాటు.. ఐపీసీ 148 సెక్షన్ మేరకు ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు... రూ.1000 జరిమానా విధించడం జరిగింది. ఏ 10, ఏ 16, ఏ 17, ఏ 18, ఏ 19 లను నిర్దోషులుగా కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 11 మంది దోషులను జైలుకు తరలిస్తున్నారు. తీర్పు అనంతరం చెరుకులపాడులో తొగట్చేడులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.. ఈ నేపథ్యంలో పోలీసులను భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పుపై.. కర్నూలు జిల్లా కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పట్ల దివంగత నారాయణరెడ్డి భార్య పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పందించారు. కోర్టు తీర్పుతో న్యాయస్థానాల పట్ల మరింత నమ్మకం పెరిగిందని చెప్పారు. కోర్టు ఇచ్చిన ఈ సంచలన తీర్పుతోనైనా తనలాంటి మరో మహిళకు అన్యాయం జరగకూడదని భావిస్తున్నట్లు తెలిపారు.

# ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్ ఎపి

>> అన్నారు. ఎల్‌జి యూనిట్ నిర్మాణానికి పూర్తిసహాయ సహకారాలం దిస్తామని, ఇక్కడ అనుబంధ యూనిట్లతోబాటు ఎల్‌జి సిటీ నిర్మించాలని కోరారు. శ్రీసిటీకి తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంతో డైరెక్ట్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. ఒక ప్రతిష్టాత్మకమైన యూనిట్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ కు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. ఎల్‌జిప్రధాన యూనిట్ ద్వారా దాదాపు 1,500 ప్రత్యక్ష ఉద్యోగాలను సృష్టిస్తుందన్నారు. ఎల్‌జిముఖ్యవిక్రేతలు అదనంగా 839కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టడం ద్వారా మరో 690కిపైగా ఉపాధి అదకాశాలను కల్పిస్తారని తెలిపారు. ఇది స్థానికఆర్థిక వ్యవస్థపై గణనీయమైన భారీప్రభావాన్ని చూపుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ యువతకు కొత్తకలల సాకారంగా మారింద న్నారు. వాణిజ్యానికి ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్ గేట్లు తెరిచే ఉంటాయని మంత్రి ఉద్ఘాటించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ హాంగ్ జి జియోన్, ఎల్‌జి విక్రేత సంస్థల నాయకత్వ బృందాలు, భాగస్వాములు ,భారత్‌లో కొరియన్ రిపబ్లిక్ రాయబారి లీ సియాంగ్ హో, ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ హోం సొల్యూషన్స్ సిఇఒ జేచియోల్‌లియు, ఎకో సోల్యూషన్స్ సిఇఒ జే సంగ్ లి, సిడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ జి.శ్రీనివాసులు, తిరుపతి జిల్లా ఎమ్మెల్యేలు పులివర్తినాని, కోనేటి ఆదిమూలం, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఏపి ఐటి ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి కాటంనేని భాస్కర్, తిరుపతి జిల్లా కలెక్టర్‌డాక్టర్ వెంకటేశ్వర్, ఎపిఐఐసి ఉపాధ్యక్షుడు అభిషిక్త్‌కిశోర్, ఎపి,తెలంగాణ కాన్సులేట్ జనరల్ చుక్కపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతే రాజధాని

>> సైన్యానికి అండగా ఉండాలని నిర్ణయించింది. అదే విధంగా ఆపరేషన్ సింధూర్ నిర్వహించిన భారత ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీలకు కేబినెట్ అభినందనలు తెలిపింది. అలాగే ఎపి రాజధాని అమరావతిగా కేబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపాలని నిర్ణయించింది. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కేబినెట్ కోరింది. పునర్విభజన చట్టంలో రాజధానిగా అమరావతి అని పెట్టాలని మంత్రి మండలి కోరింది. దీని వలన అమరావతికి చట్టబద్ధత కల్పించినట్టు అవుతుందని కేబినెట్ పేర్కొంది. క్యాపిటల్ అమరావతిని ఫ్రీ జోన్‌గా చేసుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం రూ. 10,000 నుంచి 20,000కు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే మత్స్యకారులకు ఈ నిధులు ప్రభుత్వం పంపిణీ చేసింది. రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చించి, ఆమోదించారు. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. వైఎస్సార్సీపీ హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న మూడు బిల్లులను వెనక్కి తీసుకునేలా కేబినెట్ లో ఆమోదం తెలిపారు. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ చట్ట సవరణ బిల్లు 2019, కార్మిక చట్ట సవరణ బిల్లు 2019, ఫ్యాక్టరీస్ సవరణ బిల్లు 2019 లను వెనక్కు తీసుకోవాలని కేబినెట్‌లో ప్రతిపాదించారు.

అమరావతి రీ స్టార్ట్ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని మోడీకి కేబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదించారు. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై కేబినెట్ ఆమోదించింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై కేబినెట్‌లో చర్చించారు. దేశ సరిహద్దులో యుద్ధ వాతావరణంపైనా మంత్రులతో సీఎం చంద్రబాబు చర్చించారు. తీర ప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమలు, ఇతర కీలకమైన ఇన్స్టలేషన్‌ల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై కూడా మంత్రులతో చర్చించినట్లు తెలుస్తోంది. సీఆర్డీఏ 47వ అథారిటీ సమావేశంలో రాజధానిలో భూ కేటాయింపులపై తీసుకున్న నిర్ణయాలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.రూ.514 కోట్లతో గెజిటెడ్ అధికారుల నివాస భవనాల నిర్మాణం చేపట్టనుంది. అక్కడ అదనపు మౌలిక సదుపాయాలు కల్పన కోసం 194 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ అనుమతి ఇచ్చింది. 9 టవర్‌ల నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు 517 కోట్లతో టెండర్‌లకు అనుమతి ఇచ్చింది. మొత్తంగా 1732.31 కోట్లకు అనుమతి ఇచ్చారు. అమృత్ 2.0 కింద రాష్ట్ర జల కార్యాచరణ ప్రణాళిక మొదటి రెండవ విడతలో గతంలో చేసిన సవరణల అనుగుణంగా రాష్ట్రంలోని అన్ని పురపాలక సంస్థల్లో 281 పనులను ఎస్ఎన్ఏ స్పాష్ ప్లాట్‌ఫాం ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపట్టడానికి చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. ఈ పనులకు సంబందించి ప్రతిపాదించిన 12 రకాల నిబంధనలకు కూడా ఆమోదం తెల్పింది. 2025-26 సంవత్సరానికి పెద్ద, మధ్యమ మరియు చిన్న నీటిపారుదల వనరులకు సంబంధించి రూ.345.39 కోట్లతో 7174 ఆపరేషన్ మరియు నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం కోసం మరియు నీటి వినియోగదారుల సంఘాలు అందుబాటులో లేని 7 రోజులలోపు రూ.10.00 లక్షల విలువ కంటే పైబడిన పనులకు స్వల్పకాలిక టెండర్ నోటీసును ఆహ్వానించడానికి అనుమతించేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది.

**అమరావతి నిర్మాణంపైన, ప్రభుత్వ పథకాలపైన విస్తృత ప్రచారం ఇవ్వండి**

మంత్రులు ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో పర్యటనలు పెంచాలని, ప్రతి నియోజక వర్గానికి వెళ్లాలని, మూడు పార్టీల నాయకులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. కె.అచ్చెన్నాయుడు,ఎన్ఎండీ ఫరూక్,కందుల దుర్గేష్,టిజి భరత్,గుమ్మడి సంధ్యారాణిలతో సమావేశమయ్యారు. వారి శాఖలు,నియోజక వర్గం, ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో వారి పనితీరుపై తన దగ్గరున్న నివేదికలు, సర్వేల్లోని విషయాలపై మాట్లాడారు. దస్త్రాల పరిష్కారంలో ఎవరు ఏ స్థానంలో ఉన్నారు,సామాజిక మాధ్యమాల్లో ఎంత చురుగ్గా ఉన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులుగా జిల్లాల్లో ఎన్నిసార్లు పర్యటించారు. డీఆర్‌సి సమావేశాలు ఎన్ని నిర్వహించారు వంటి అంశాల ఆధారంగా వారి పనితీరు గురించి సిఎం మాట్లాడినట్లు తెలిసింది. బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసిస్తూనే ఇంకా మెరుగు పర్చుకోవాల్సిన వారికి తగుసూచనలు చేసినట్లు సమాచారం. మంత్రులు ఇన్చార్జిలుగా ఉన్న జిల్లాలకు వెళ్లినపుడు మూడు పార్టీల నాయకులతో వీలైనంత తరచుగా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. టిడిపి నాయకుల మధ్య గాని,టిడిపి,జనసేన నాయకుల మధ్య గానీ ఏమైనా విభేధాలుంటే ఇన్‌ఛార్జి మంత్రులే భాధ్యత తీసుకొని పరిష్కరించాలని స్పష్టం చేశారు. కూటమిలోని మూడు పార్టీల నాయకుల మధ్య ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా,ఎన్నికల నాటి స్పూర్తి ఎప్పటికీ కొనసాగేలా చూడాలని చంద్రబాబు వారికి దిశా నిర్దేశం చేశారు.

3ongqxd:09-05Pg3exHMNWJQEKTVCR.qxd 09/05/25 12:30 AM Page 1



# కలెక్టర్లకు 'రెడ్‌క్రాస్' అవార్డులు

## పేదరోగులకు ఉచితంగా రక్తం అందచేస్తున్న సంస్థ: గవర్నర్ అబ్దుల్ నజీర్



విజయవాడలోని రాజ్‌భవన్‌లో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి అవార్డు అందిస్తున్న గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, మే 8.ప్రభాతవార్తప్రతినిధి:** రెడ్ క్రాస్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేద రోగులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నట్టు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖాధ్యక్షులు.గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ తెలిపారు. గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన వరల్డ్ రెడ్ క్రాస్, ఇంటర్నేషనల్ థలసీమియా డే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ 20 బ్లడ్ సెంటర్లను నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం 65,000 పైబడి రక్త యూనిట్లను సేకరిస్తోందని, లక్షకు పైగా యూనిట్లను అవసరమైన నిరుపేదలకు జారీ చేస్తోందని తెలిపారు. వీటిలో మూడొంతులు ప్రభుత్వ ఆసుపత్రులకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ ఉద్యమం కోసం విశేష సేవలు అందించి గరిష్టంగా విరాళాలు సమీకరించిన జిల్లా కలెక్టర్లకు గవర్నర్ అవార్డులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ అవార్డు తన ఒక్కరి సొంతం కాదని, వరద బాధితుల సహాయార్థం, సహాయం చేసిన ప్రతి ఒక్కరి కృషికి ఇది గుర్తింపు అన్నారు. అవార్డుతో తన బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో కూడా జిల్లా ప్రజల కోసం పూర్తిస్థాయిలో, అంకితభావంతో పనిచేస్తానన్నారు. దూరదృష్టి, అపారమైన అనుభవంతో జిల్లా యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహించిన ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేసారు. తూర్పు గోదావరి కలెక్టర్ పి. ప్రశాంతి, కృష్ణా కలెక్టర్ డి.కే. బాలాజీ, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు కలెక్టర్ ఓ. ఆనంద్, నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారి, కాకినాడ కలెక్టర్ సాగిలి షాన్ మోహన్, కర్నూలు కలెక్టర్ పి. రంజిత్ బాషా, బాపట్ల కలెక్టర్ జె. వెంకట మురళి లకు పతకాలు అందుకున్న వారిలో ఉన్నారు. తొలుత గవర్నర్ రాజ్‌భవన్ నుండి వర్చువల్ విధానంలో శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో స్థాపించిన రెడ్ క్రాస్ థలసీమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కీలక రక్త మార్పిడి చికిత్స అవసరమున్న పిల్లలు, వ్యక్తులకు మద్దతుగా ఈ పథకం చేపట్టారు. గవర్నర్ మాట్లాడుతూ ఇక రక్త కణ విభజన ఉన్న అన్ని బ్లడ్ సెంటర్లలో ట్రాన్స్‌ఫ్యూషన్ సేవలను విస్తరించాలన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ చైల్డ్ కేర్, మహిళా సంక్షేమం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొలిమహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు, సీఈఓ ఏ.కె. పరీడా, వివిధ జిల్లా శాఖల చైర్మన్లు, రాజ్‌భవన్ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.



## అంతరిక్షంలో నిఘా నేత్రం

### - ఆర్ఐ శాట్-1బి ప్రయోగానికి ఇస్రో సిద్ధం

**శ్రీహరికోట (తడ), మే 8 ప్రభాతవార్త** అంతరిక్షం నుంచి నిఘానేత్రంలా పనిచేసే ఆర్ఐ శాట్-1బి ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. సరిహద్దుల్లో ఉగ్రవాద కదలికలను పసిగట్టడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుందని నమ్ముతున్నారు. ఇఓఎస్-09 పేరుతో ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్‌ను ఇస్రో రూపొందించింది. ఈ నెల 18న ఉదయం 6.59 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి పిఎస్ఎల్వి-సి61 రాకెట్ ద్వారా దీన్ని ప్రయోగించనున్నారు. ఈ స్పై శాటిలైట్ హై రిజల్యూషన్ రాడార్ ఇమేజ్‌తో శక్తివంతమైనదిగా రూపొందించారు. ప్రస్తుతం చోటుచేసుకున్న తీవ్ర పరిణామాల నేపథ్యంలో ఇటువంటి ఉపగ్రహాలు భారత్‌కి అవసరంగా ఉన్నాయని దేశ ప్రజలు కూడా ఎదురు చూస్తున్నారు. గతంలోను రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాలను అలవోకగా అంతరిక్షంలోకి చేర్చి అక్కడి నుంచి నిఘా వ్యవస్థను పటిష్టం చేసుకున్న ఘనత ఇస్రోది. రీ శాట్-1ఎ పేరుతోను గతంలో ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించి ఉంది. ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో భూ పరిశీలన ఉపగ్రహ అవసరాలను ఇస్రో గుర్తించి శ్రీహరికోట నుంచి ప్రయోగించడానికి సిద్ధమయింది. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో ఏర్పాట్లు జోరందుకున్నాయి. కౌంట్‌డౌన్ తేదీలను ప్రకటించాల్సి ఉంది. ఇఓఎస్-09 ప్రయోగం తర్వాత భారతీయ శాస్త్రవేత్తలు ఇటువంటి శక్తివంతమైన మరిన్ని ఉపగ్రహాలకు రూపకల్పన చేసి ప్రయోగించనున్నారు.

# హైకోర్టునే దారి మళ్లించిన పిఎస్సార్!

### గ్రూప్ - 1 మెయిన్స్ జవాబు పత్రాలు మూల్యాంకనం చేయించలేదని అభియోగం - క్యామ్‌సైన్ మీడియా సంస్థను పెట్టుకుని అక్రమాలు - పమిడికాల్వ మధుసూధన్ రిమాండ్ రిపోర్టులో ప్రస్తావన

**విజయవాడ,మే 8,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ హయంలో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు ఏకంగా హైకోరునే పక్కదోవపట్టించినట్లు అభియోగాన్ని తాజాగా ఎదుర్కొంటున్నారు. 2018లో విడుదలైన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి మెయిన్స్ జవాబు పత్రాల డిజిటల్ మూల్యాంకనాన్ని రద్దు చేసి, మాన్యువల్ మూల్యాంకనం జరిపించాలని హైకోర్టు ఆదేశించగా వాటిని ఆయన పట్టించుకోలేదన్నది ఆరోపణ,కోర్టు చెప్పినట్లు చేయకుండానే చేసినట్లు...న్యాయస్థానాన్ని నమ్మించేందుకు హాయ్‌ల్యాండ్ వేదికగా ఓ మొక్కుబడి తంతు నడిపించారంటూ పోలీసులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేసారు.ఆ రిపోర్టును అనుసరించి డిజిటల్ మూల్యాంకనంలో అభ్యర్థులకు వచ్చిన మార్కులనే మాన్యువల్ మూల్యాంకనం పేరిట మరోసారి నమోదు చేయించారు. దీని కోసం క్యామ్‌సైన్ మీడియా అనే ప్రైవేటు సంస్థను ముందుపెట్టారు. పోలీసు దర్యాప్తులో ఈ కుట్ర మొత్తం బయటపడింది. ఈ కేసులో రెండో నిందితుడైన క్యామ్‌సైన్ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు బుధవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఆయనకు ఈ నెల 21 వరకు రిమాండును విధిస్తూ న్యాయాధికారి దేవకి ఆదేశాలిచ్చారు. పోలీసులు ఈ కుంభకోణంలో పీఎస్ఆర్ ఆంజనేఏయులు,మధుసూధన్‌ల పాత్ర గురించి రిమాండు రిపోర్టులో వివరించారు. 169 గ్రూపు-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ 2020లో నిర్వహించిన మెయిన్ పరీక్షలకు 6,807 మంది హాజరయ్యారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్నదానికి విరుద్ధంగా సమాధాన పత్రాల్ని డిజిటల్ మూల్యాంకనం చేయించి 2021 ఏప్రిల్ 28న ఫలితాలు ప్రకటించేసింది. అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాలని ఆదేశించింది. అప్పట్లో ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉంటూ సర్వం తానై వ్యవహరించిన ఆంజనేయులు న్యాయస్థానాన్ని మభ్యపెడుతూ మాన్యువల్ మూల్యాంకనం చేయకుండానే చేసినట్లు సృష్టించేందుకు తతంగం నడిపించారు. ఒక రోజున ఏపీపీఎస్సీ అదనపు కార్యదర్శి డి.విశాల,సంయుక్త కార్యదర్శి కెవి ప్రసాద్,ఉప కార్యదర్శి ఐ.నర్సింహమూర్తి,సహాయ కార్యదర్శి బి.వెంకట సుబ్బయ్య,అధికారిణి వెంకటలక్ష్మిని తన ఛాంబర్‌కు పిలిపించారు.


## ఎల్‌జీకి స్వాగతం - సిఎం చంద్రబాబు ట్వీట్

**విజయవాడ మే8, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు. ఎల్‌జీకి ఆంధ్రప్రదేశ్ ఆహ్వానం పలుకుతోందంటూ ట్వీట్ చేశారు. శ్రీసిటీలో రూ.5800 కోట్లకు పైగా పెట్టుబడులతో ప్రత్యక్షంగా పరోక్షంగా 2500 పైగా ఉద్యోగాలతో ఈ సంస్థ ఏపీని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక కమిటీ కింద ఈ సంస్థ 100శాతం ప్రోత్సాహకాలు పొందిందని సీఎం తెలిపారు. ఇది మన రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధికి ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయనానికి నాంది పలికిందని పేర్కొంటూ శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేసిన అనంతరం దిగిన ఫోటోను సీఎం షేర్ చేశారు.

# కొండపై హోటళ్లలో చైనీస్ వంటకాలు నిషేధం

### - భక్తులకు సాంప్రదాయ వంటకాలు అందించాలి - టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** దేశంనలుమూలల నుండి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వస్తున్న భక్తులకు కొండపై హోటళ్ళలో చైనీస్ వంటకాలు పూర్తిగా నిషేధిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రకటించారు. ఈ ఆహారపదార్థాలు భక్తుల ఆరోగ్యానికి హానికరంగా మారాయని అన్నారు. తిరుమలలోని అన్ని హోటళ్ళ యాజమాన్యం భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలోఉంచుకుని సాంప్రదాయ వంటకాలు తయారుచేసి పూర్తిగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పుణ్యక్షేత్రం తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, పనిచేస్తున్న సిబ్బంది కూడా సాంప్రదాయ వస్త్రధారణ ధరించి భక్తులకు సేవలందించాలని ,ముఖ్యంగా తెలుగుసాంప్రదాయంఉట్టిపడాలని చెప్పారు. గురువారం మధ్యాహ్నం తిరుమలలోని ఆస్థానమండపంలో హోటళ్ళ నిర్వాహకులు, సిబ్బందితో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్రకుమార్, ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు,



విఎస్ఒలు సదాలక్ష్మి, సురేంద్ర,క్యాటరింగ్ అధికారి శాస్త్రితో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ మాట్లాడుతూ దేశ:ంలోని ఇతర రాష్ట్రాల నుండి విదేశాల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు సాంప్రదాయ వంటకాలను అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా హోటళ్ళలో పరిశుభ్రత ,నిర్వహణ చక్కగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారపదార్థాలను అందించాలన్నారు. తిరుమలయాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కల్పించాలన్నారు. హోటళ్ళ నిర్వాహకులు చేసే చిన్నచిన్న పొరబాట్ల వల్ల భక్తులు చాలా అసంతృప్తితో వెళుతున్నారని చెప్పారు. హోటళ్ళ నిర్వాహకులు చట్టబద్ధమైన నియమ నిబంధనలు పాటించాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. టిటిడి ఆరోగ్యవిభాగం ప్రతి రోజూ చేయాల్సిన పనులతో చెక్‌లిస్ట్ అందిస్తుందని, దాన్ని తప్పకుండా ఆచరించాలన్నారు. టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు హోటళ్ళ నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు చేస్తారన్నారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంతోబాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో 33 అన్నప్రసాద కౌంటర్లలో టిటిడి నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. భగవంతుని సన్నిధిలోని హోటళ్ళలో కూడా అదే స్ఫూర్తితో భక్తులకు నాణ్యమైన, రుచికరమైన శుచిగా సాంప్రదాయ ఆహారపదార్థాలు అందించాలని చౌదరి సూచించారు.

## మద్యం కుంభకోణం కేసు: ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి అరెస్టులో నిబంధనలు పాటించాం

### - హైకోర్టుకు నివేదించిన అడ్వకేట్ జనరల్

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కెసిరెడ్డి అరెస్ట్ విషయంలో సిఐడి అధికారులు నిబంధనలు పాటించారని, అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు తెలిపారు. అరెస్ట్‌కు కారణాలను తెలియచేసామన్నారు. అరెస్ట్ అనంతరం సంబంధిత అథారిటీ నునండి అనుమతి రాగానే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)సెక్షన్లను చేర్చామన్నారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే కోర్టు కెసిరెడ్డికి రిమాండ్ విధించిందన్నారు. ఇరువైపు వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు,జస్టిస్ కె.మన్మథరావులతో కూడిన ధర్మాసనం బుధవారం ప్రకటించింది. తన కుమారుడు కెసిరెడ్డిని రిమాండ్‌కు పిటీషన్ వేశారు. సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపిస్తూ, పిటీషనర్‌ను అరెస్ట్ చేసిన 24 గంటల తర్వాత నిందితుడిగా చేర్చారని తెలిపారు.

అరెస్ట్‌కు కారణాలను పేర్కొంటూ అందచేసిన నోటీసులో సీపీ యాక్ట్ క్రింద సెక్షన్లు నమోదు చేసినట్లు వెల్లడించలేదని చెప్పారు. రిమాండు రిపోర్టులో మాత్రం ఆ సెక్షన్లను చేర్చారన్నారు. అరెస్ట్ విషయంలో అధికారులు నిబంధనలను పాటించలేదన్నారు.

రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు.

## ఐపిఎస్‌లు బిందుమాధవ్, అమిత్ బర్దార్‌పై క్రమశిక్షణ చర్యలు నిలిపివేత

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** ఇద్దరు ఊపీఎస్ అధికారులపై తదుపరి క్రమశిక్షణా చర్యలను నిలిపివేసూప్త ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో హింసాతమ్మ ఘటనలు చోటు చేసుకోవడంతో పల్నాడు జిల్లా అప్పటి ఎస్పీ బిందుమాధవ్,అనంతపురం జిల్లా అప్పటి ఎస్పీ అమిత్ బర్ధార్‌పై ఈసీ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. అయితే,ఈ ఘటనకు సంబంధించి ఇరువురు అధికారుల నుండి వివరణ తీసుకున్న ప్రభుత్వం వారిపై తదుపరి క్రమశిక్షణా చర్యలను నిలిపివేసింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపికి సిఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేసారు.

## కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### - బైక్‌ను ఢీకొన్న కంటైనర్ ముగ్గురు మృతి

**పెండ్లిమర్రి, మే 8, ప్రభాతవార్త:** పెండ్లిమర్రి మండలం కొత్తూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైకుపై ప్రయాణిస్తున్న వారిని కంటైనర్ ఢీకొనడంతో ఇద్దరు ఇక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతులు వేంపల్లె శ్రీరామ్‌నగర్ గుటన్టకు చెందిన బాలయ్య, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మల్లికార్జున, మదనపల్లికి చెందిన మల్లికార్జునలుగా గుర్తించారు. ఘటనా స్థలం వద్దకు స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు మృతితో వారి కుటుంబాల్లో విషాధచాయలు అలుముకున్నాయి. పూర్తి సమాచారం పోలీసుల విచారణలో తేలియాల్సి ఉంది.

## ప్రైవేటు బడుల్లో ఆర్టీఇ ప్రవేశాలకు రేటింగ్ ఆధారంగా ఫీజులు

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యా హక్కు చట్టం క్రింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా కల్పించే ప్రవేశాలకు ఫీజులు నిర్ణయించడంపై పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది.ప్రతి ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం 25 శాతం సీట్లలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తోంది.ఈ అంశంలో న్యాయస్ధానం ఉత్తర్వులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరే విద్యార్ధులకు ఫీజులను నిర్ణయించేందుకు ప్రభుత్వం ఇటీవల వేసిన కమిటీ సమావేశమైంది. సదుపాయాల ఆధారంగా ప్రైవేటు పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,953 ప్రైవేటు పాఠశాలలు ఉండగా,వీటిల్లో ఒక స్టార్ ఉన్నవి 95,రెండు స్టార్లు ఉన్నవి 3,240,మూడు స్టార్లు 5,730,నాలుగు స్టార్లు ఉన్నవి 708 ఉన్నాయి. ఐదు స్టార్ల రేటింగ్ పొందిన ప్రైవేటు పాఠశాల రాష్ట్రంలో ఒక్కటీ లేదు. ఈ రేటింగ్ ఆధారంగా ఫీజులను ప్రతిపాదించారు. ఒక స్టార్ ఉన్న బడులకు సగటున 8 వేలు,రెండు స్టార్లు ఉన్న వాటికి రూ.9వేలు,మూడు స్టార్లు ఉంటే రూ.10 వేలు,నాలుగు స్టార్లు ఉన్న వాటికి రూ.12 వేలు,ఐదు స్టార్లు ఉంటే రూ.15 వేలు ఇవ్వాలని సమావేశంలో అధికారులు ప్రతిపాదించారు.



## రాయచోటి కేంద్రంగా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటు చేయండి

### - సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**విజయవాడ,మే8,ప్రభాతవార్తప్రతినిధి:** అన్నమయ్య జిల్లాలో రాయచోటి కేంద్రంగా నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడువినతి పత్రం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అందజేసారు.అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని మరింత అభివృద్ధి చేయడానికి జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల ఏర్పాటు అత్యవసరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిఅభిప్రాయపడ్డారు.. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. నూతన కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాన్ని రాయచోటిలో త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా, శ్రీనివాసపురం వద్ద నిర్మాణంలో ఉన్న రిజర్వాయర్ పనులు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.290 కోట్ల నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే రాయచోటి నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు రాయచోటి నియోజకవర్గంలో మిగిలిన మున్సిపాలిటీల్లో నెలకొన్న సాగునీటి సమస్యలపై కూడా మంత్రి చంద్రబాబు నాయుడికి వివరించి, తక్షణ పరిష్కారం కోసం నిధుల కేటాయింపు జరగాలని కోరారు.

# తిరుమల సమాచారం



## గరుడవాహనంపై మలయప్ప

### - కన్నులపండువగా ముగిసిన పద్మావతి పరిణయం

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీమహావిష్ణువు కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించిన తొలిరోజుల్లో నారాయణవనంలోని ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహమాడిన ఘట్టం నేటికీ తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు నిర్వహిస్తున్నారు. మూడురోజులుపాటు జరిగే ఈ పరిణయోత్సవాలు గురువారం సాయంత్రం కన్నులపండువగా ముగిశాయి. చివరిరోజు సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి గరుడవాహనం అధిరోహించగా, శ్రీదేవిభూదేవి పల్లకీపై మరోవైపు నారాయణగిరి ఉద్యానవనంలోని కల్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల,పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామిఅమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదుర్కోలు, పూలబంతులాట, నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధులయ్యారు. అన్నమాచార్యకళాకారులు అలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పరిణయోత్సవాలు ముగిశాయి. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రకాల రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి, శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు దంపతులు, టిటిడి ఇఒ శ్యామలరావు దంపతులు, టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, విఎస్ఒలు సదాలక్ష్మి,సురేంద్ర, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు పాల్గొన్నారు. స్వామివారి పరిణయోత్సవం వేళ శేషాచలం కొండల్లో చిరుజల్లులతో వరుణదేవుడు ఆశీర్వదించారు. చల్లటి వాతావరణంలో స్వామివారి పరిణయోత్సవం అత్యంత ఆహ్లాదకరంలో వేడుకగా ముగిసింది.

## తెలుగు ప్రజలకు శ్రీవారి ఆశీస్సులుండాలి

### - హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు రాష్ట్రహైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఉదయం ప్రోటోకాల్ విఐపి బ్రేక్‌లో ఆయన కుటుంబంతో కలసి



శ్రీవారినిదర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మొదటిఘాట్‌లో రైలింగ్‌ను ఢీకొన్న కారు

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళుతున్న భక్తుల కారు మొదటిఘాట్‌లో చివరన కారుటైరు పేలడంతో ప్రమాదానికి గురైంది. తిరుపతికి వెళ్ళేసమయంలో జరిగిన ఈ సంఘటనతో కారు పిట్టగోడ రైలింగ్‌ను ఢీకొంది.

ఈ ప్రమాదంలో కారులో ఉన్న తమిళనాడు భక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదంతో ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న అలిపిరి విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని వాహనాన్ని తప్పించారు.

## ఎండల్లో వాన.. తిరుమలలో మోస్తరు వర్షం

**తిరుమల,మే 8ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిలో మండే ఎండలకు భక్తులు అల్లాడి పోతున్నారు. దీంతో గత రెండు రోజులుగా పూర్తిగా వాతావరణం మారింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై తిరుమలలోమోస్తరగూ వర్షం కురుస్తోంది. గత రెండురోజులుగా వాతావరణంలో మార్పుతో చల్లటిగాలులు వీయడంతో సాయంత్రం చిరుజల్లులతో మొదలైన వర్షం



అర్ధగంటపాటు మోస్తరుగాకురిసింది. తొలుత వాన చిరుజల్లులతో మొదలైంది. ఈ వర్షానికి భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. తిరుమలలో కురిసిన వర్షంతో కాస్త వేడి చల్లబడింది. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకున్నారు. ఈ వానకు భక్తులు ఆనందంగా పరవశించారు.

## ఆంధ్ర తెలంగాణ రైల్వే సరిహద్దుల్లో రూ.426 కోట్లతో రైల్వే డబ్లింగ్ పనులు

**రాజంపేట అర్బన్, మే8 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ఆంధ్ర తెలంగాణ సరిహద్దుల్లో మరో కొత్త రైల్వే డబుల్ లైన్ నిర్మాణానికి కేంద్ర రైల్వే బోర్డు 426 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే 28.50 కిలోమీటర్ల దూరం కొత్త రైల్వే డబుల్ లైన్ నిర్మాణంతోపాటు ఇతరు పనులు చేపట్టేందుకు గురువారంటెండర్లనుఆహ్వానించింది.రేవూరురామాపురంసంత్ సేవాలాల్ మహారాజు రైల్వే స్టేషన్ మధ్య(36.60 కిలోమీటర్ నుంచి 65.10 కిలోమీటర్ల చైనేజ్ వరకు కొత్త రైల్వే డబుల్ లైన్ పనులు చేపడతారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని మోటుమర్రి విష్ణుపురం మధ్య రైల్వే లైన్ సిగ్నలింగ్, ఎలక్ట్రిఫికేషన్ పనులు కూడా చేపడతారు. రెండేళ్ల లోగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అదేవిధంగా రాష్ట్రంలో గుంటూరు నంబూరు రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ గేట్ 03 వద్ద నాలుగు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులను చేపడతారు. అలాగే నల్లపాడు బండారుపల్లె వద్ద లెవెల్ క్రాసింగ్ 06 వద్ద రెండు లైన్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపడతారు. ఇందుకు కేంద్ర రైల్వే బోర్డు 106.65 కోట్ల నిధులు కేటాయించింది. పెడన మచిలీపట్నం లెవెల్ క్రాసింగ్ 38 వద్ద , మాజెల్ల గుడ్లవల్లూరు లెవెల్ క్రాసింగ్ 12 వద్ద రెండు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు 108.03 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా రామవరప్పాడు నిడమనూరు రైల్వే స్టేషన్ల మధ్య జాతీయ రహదారి 16న కలుపుతూ కేసరి పల్లె వద్ద లెవెల్ క్రాసింగ్ 20 వద్ద 108.19 కోట్లతో రెండు లైన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు చేపడతారు.

## పాస్టర్ ప్రవీణ్‌కేసులో రూ.5 లక్షలు కట్టాలి: కెఎపాల్‌కు హైకోర్టు సూచన

**విజయవాడ.మే8,ప్రభాతవార్తప్రతినిధి:** పాస్టర్ ప్రవీణ్ మృతి కేసు విషయంలో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్ కు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన పిల్ ను హైకోర్టు విచారించింది. ఆ కేసును సిబిఐతో విచారణ జరిపించాలని పిల్ లో కెఏపాల్ కోరారు. ఆ వ్యాజ్యాన్ని ఆయన సదుద్దేశంతోనే దాఖలు చేశారన్న రుజువు కోసం కోర్టు రిజిస్ట్రీ వద్ద రూ. 5లక్షలు కట్టాలని సూచించింది. ఆ సొమ్ము చెల్లించిన తర్వాతే విచారణ ప్రారంభిస్తామని స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం. 04/2025-26, తేది: 05.05.2025
కార్యపాలక ఇంజనీరు. పి.ఆర్.ఐ. డివిజన్, కందుకూరు పరిధిలో 1 పనికి అంచనా విలువ : రూ.15.00 లక్షలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్-ఫాం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లు లభ్యమగు తేది: 12.05.2025, సా.5.00గం. నుండి లభ్యమగును. పూర్తి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in, https://www.eprocurement.gov.inలో చూడగలరు.
సం/-. కార్యపాలక ఇంజనీరు, పి.ఆర్.ఐ.డివిజన్, కందుకూరు.
DIPR.NO. 16327/CL/ADVT/1/1/2022-23 తేది: 08.05.2025

వార్త

కొంత మందిని ఎల్లకాలం, అందరినీ కొంతకాలం మోసం చేయగలరేమో కాని ఎల్లకాలం అందరినీ మోసం చేయాలనుకోవడం అసాధ్యం.

-అబ్రహాం లింకన్

# సూత్రధారులే మూలం

ఎన్ని చట్టాలు చేసినా, మరెంతమంది అధికారులను నియమించినా, మరెన్ని సార్లు హెచ్చరించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అరుదైన ఎర్రచందనం వృక్ష సంపద తరలిపోతూనే ఉన్నది. పట్టుబడిన స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తూనేఉన్నారు. జైళ్లకు పంపుతున్నారు. కొన్ని సందర్భాల్లో కాల్పులకూడా వెనుకాడడం లేదు. అయినా ఇవేమీ ఈ స్మగ్లింగ్‌ను ఆపలేకపోతున్నాయి. గత నెలలో కోట్లాది రూపాయల విలువైన ఎర్రచందనం దుంగలు స్మగ్లర్లతోసహా పట్టుబడ్డాయి. గత నెలే కాదు అంతకుముందు కూడా ఈ ఎర్రచందనం తరలింపు నిరాటంకంగానే కొనసాగింది. ఈ అరుదైన ఎర్రచందనం వృక్షసంపదను కాపాడేందుకు ప్రత్యేకటాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని హంగులను కల్పించారు. ప్రాణాలకు తెగించి సిబ్బంది శక్తిమేరకు కృషి చేస్తున్నారు. ఏకంగా పదుల సంఖ్యలో స్మగ్లర్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేతిలో మరణించినా ఏ మాత్రం వెరవడం లేదు. కొన్ని సందర్భాల్లో సిబ్బందిపై దాడులకు, చివరకు చంపడానికి కూడా స్మగ్లర్లు వెనుకాడడం లేదు. ఇందుకు వారు వాడుతున్న తుపాకులు, మారణాయుధాలే సజీవ సాక్ష్యం. గత యేడాది ఎర్రచందనం తరలిస్తున్న ఒక కారును కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయడంతో తొక్కించుకుంటూ స్మగ్లర్లు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మరణించాడు. అయితే తమ సహచర ఉద్యోగిని ఢీకొట్టి పారిపోతున్న వాహనాన్ని మిగిలిన సిబ్బంది వెంబడించి కొంతదూరం వెళ్లిన తర్వాత పట్టుకోగలిగారు. వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా అత్యంత విలువైన వృక్షసంపద తరలిపోతూనే ఉన్నది. ప్రతిసారి కూలి కోసం వచ్చి, చెట్లను కూలగొడుతున్న కూలీలే పట్టుబడుతున్నారు తప్ప వారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగుచూడడం లేదు. ఆ ప్రాంతంలో ఎవరిని అడిగినా ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరిది ఉందో కథలు కథలుగా చెప్తారు. అయినా పాలకపెద్దలు ఆ వైపు దృష్టిసారించకుండా మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ప్రయత్నం చేయడం ప్రయోజనం లేకుండాపోతున్నది. ఆంధ్రప్రదేశ్, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మాత్రమే ఈ ఎర్రచందనం వృక్షాలు విస్తరించి ఉన్నాయి. వీటిని 1973లో అరుదైన వృక్షజాతులజాబితా సైడ్స్‌లోకి చేర్చారు. దీంతో ఎర్రచందనం దుంగల ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. వాస్తవంగా చూస్తే ఈ ఎర్రచందనానికి మనదేశంలో పెద్ద గిరాకీ లేదు. మార్కెట్ కూడా లేదని చెప్పొచ్చు. జపాన్, చైనా దేశాల్లో ఊహించని రీతిలో డిమాండ్ ఉంది. అవి అంతకంతకు పెరుగుతుండడంతో కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడం స్మగ్లర్లు ఈ దుంగలను విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్ర మార్గాల ద్వారా దేశ సరిహద్దులు దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలు అనుసరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే వ్యవసాయోత్పత్తుల పేరుతో బోగస్ అనుమతులు పొంది తరలింపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చెన్నై, ముంబయి, కొచ్చి తదితర రేవుల నుండి ఓడల ద్వారా తరలిపోతున్నాయి. రోడ్డు మార్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండీగఢ్‌లోని గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాల్‌కు తరలిస్తున్నారు. అక్కడి నుంచి చైనాకు రవాణా అవుతున్నది. అదేకాదు, మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా యధేచ్ఛగారవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈ చెట్లకు ఎందుకు ఇంత విలువ వస్తున్నది? ఎందుకు ఉపయోగిస్తున్నారనే విషయాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదనే ప్రచారం జరిగినా అది తప్పు అని తేలిపోయింది. అణు ఇంధనం తయారీలోనూ, శృంగార సామర్థ్యం పెంచేమందుల్లో వీటిని వాడుతున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. మరొకపక్క అటు జపాన్ కానీ, ఇటు చైనా కానీ వాటిని తాము ఎందుకు కొంటున్నారు, ఎందుకు ఉపయోగిస్తున్నామనే విషయం ఏమాత్రం బయటపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వీటి ధర మాత్రం యేడాది యేడాదికి పెరిగిపోతున్నది. అంతర్జాతీయ బయో డైవర్సిటీ సంస్థ అధ్యయనం ప్రకారం ఒక టన్ను ఎర్రచందనానికి ఆరేడు కోట్లు పలుకుతుందని చెబుతారు. అందుకే రాయల సీమలోని కొన్ని మాఫియా ముఠాలు, కొందరు ఫ్యాక్షన్ నేతలు, మరికొందరు రాజకీయ నాయకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. దీనికి తోడు అటవీ శాఖ సిబ్బంది అధికారులు కొందరు వారితో చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. చట్టాల్లోని లొసుగులు కూడా స్మగ్లర్ల పాలిట వరాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా మిగులుతున్నాయనేందుకు వీగిపోతున్న కేసులను పరిశీలిస్తే అర్థమవుతుంది. దీంతో పట్టుబడుతున్నది, జైళ్లల్లో మగ్గుతున్నది కేవలం పొట్టకూటి కోసం రోజువారీ కూలికి వస్తున్న తమిళనాడుకు చెందిన నిరుపేదలే. ఇలా పట్టుబడిన వారు కూడా శిక్షలు అనుభవించి మళ్లీ అదే వ్యాపకంలో మునిగిపోతున్నారు. డబ్బు ఆశ చూపి కొందరు పెద్దలు అమాయక కూలీలను ఇందులోకి దించుతున్నారు. వీరి వెనుక ఉన్న సూత్రధారులు బయటకు రావడం లేదు. ఆ సూత్రధారులను బయటకు తీసి మూలాలపై చర్యలు తీసుకుంటేనే ఈ వృక్ష సంపదను కాపాడగలుగుతారు.

జీవితంలో ప్రతి నిముషాన్ని వ్యర్థం చేయక ఉపయోగించుకో, లేకుంటే నీవు వృథా చేసినట్టి కాలం భవిష్యత్తులో నీ అదృష్టాన్ని తారుమారు చేయగలదు.



నెపోలియన్

అవసరానికి ఆదుకొనే మిత్రులున్న వ్యక్తి అదృష్టవంతుడు. కానీ మిత్రుల సహాయాన్ని స్వీకరించాల్సిన అవసరం రాని వ్యక్తి ఇంకా అదృష్టవంతుడు.



వార్విక్

# ప్రజావాక్కు



## శత్రువుకి బలమైన సందేశం

భారతదేశం తలపెట్టి, ముప్పావు గంటలోనే ముగించిన, సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ అభినందనీయం. రెండు వారాల క్రితంకాశ్మీరులోని పహెల్గాంలో అమాయక పర్యాటకులపై దాడికి తెగబడ్డ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల మూలాల్ని అంతంచేసే తలంపుతో తలపెట్టిన ఈ సైనిక చర్య భారత్ శక్తియుక్తులను తెలిపేది. తీవ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు తాజా హెచ్చరిక లాంటిది. భారత దేశానికి వ్యతిరేకంగా తీవ్రవాదాన్ని ప్రోత్సహించడంపాకిస్థాన్‌కు కొత్తకాదు. 1947నుండి ఇప్పటికి నాలుగు సార్లు యుద్ధానికి తెగబడినా, లెక్కకు మిక్కిలి సార్లు భారత్‌పైకి ఉగ్రవాదుల్ని ఉసిగొల్పినా భారత్ సంయమనం కోల్పోలేదు. ఆ సందేశం అర్థంచేసుకుని ఉగ్రవాదుల్ని వదులుకోవడమా, లేదా భారత్‌తో తలపడి సర్వనాశనాన్ని కొని తెచ్చుకోవడమాఅన్నది ఆదేశపువిజ్ఞతపై ఆధారపడి ఉంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## గురుకుల ఇంటర్ సమ్మర్ క్యాంపులు

ఇటీవలప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు నిర్వహించడం చాలా సంతోషకరం. ఒక సంవత్సర కాలంపాటు చదివిన విద్యార్థులుఫెయిల్ అయారు. కానీ కేవలం 20రోజులలో సమ్మర్ క్యాంపులు నిర్వహించి తప్పనిసరిగా అన్ని సబ్జెక్టులు పాస్ కావాలని లేనిచోమెమొలు జారీ చేయడం సరికాదు. ఇలా అయితే విద్యార్థులు లెక్చరర్స్ భవిష్యత్తులో వచ్చే క్యాంపుకు ఆసక్తి చూపుతున్నారు. ఉన్న 10 రోజులలో అందరు విద్యార్థులు హాజరయ్యే విధంగా ప్రిన్సిపాల్ కృషి చేయాలి. వేసవి సెలవులలో సమ్మర్ క్యాంపుకు వచ్చిన లెక్చరర్స్‌కు అదనపు వేతనాలు ఇవ్వాలి.

-రాపాక రవీందర్, జనగాం

## దడ పుట్టిస్తున్న సుంకాలు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు ప్రపంచ దేశాలకు దడ పుట్టిస్తున్నాయి. చిన్న చిన్న కారణాలు చూపి వీసాలు, వగైరా రద్దు చేయడానికి వెనుకాడడం లేదు. వ్యాపారులు, విద్యార్థులు ఉద్యోగులపై ఆంక్షల పంజా విసురుతున్నారు. అక్కడ మనవారి పరిస్థితి గందరగోళంగా ఉంది. ట్రంప్ 2.0 హయాంలో కనీవినీ ఎరుగని రీతిలో వాణిజ్య యుద్ధానికి తెరతీసింది.

-ఆర్. వెంకటేష్, బెంగళూరు

## తూకాలలో మోసాలు ఆగేదెలా?

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని కూరగాయల మార్కెట్లు, రోడ్ల వెంబడి అమ్మే కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, చికెన్, మటన్ విక్రయించే షాపులలో తూకంలలో భారీ మోసాలు జరుగుతున్నాయి. దీని వల్ల వినియోగదారులు తీవ్రంగా మోసపోతున్నారు. ఒక కిలో కూరగాయలు కొన్న ఎనిమిది వందల గ్రాములు వస్తున్నాయి. వారు పెట్టె తూకం బాట్లు కిలో వుండడం లేదు. ఎలెక్ట్రానిక్స్ కాంటాలో కూడా మోసం చేయడం జరుగుతుంది. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పడి వారిమీద చర్యలు తీసుకోవడం లేదు. పండ్ల మార్కెట్‌లో కూడా మోసాలు జరుగుతున్నాయి. ఇకనయినా తూనికలు కొలతలశాఖ అధికారులు స్పందించి నిఘావేసి పట్టుకుని కేసులు నమోదు చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## మెరుపుదాడులు న్యాయమే

భారత్ జరిపిన మెరుపు దాడులు న్యాయమైన డిమాండును ఒకింత న్యాయం చేసినట్టే. ఎందుకంటే 28 మంది పౌరుల ప్రాణాలను పొట్టన పెట్టుకొని పైశాచిక ఆనందం పొందిన ఉగ్రవాదులను చావుదెబ్బ కొట్టినట్టు అయ్యింది. అంత మాత్రమే కాదు ఉగ్రవాద స్థావరాలను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి సమాధానము ఇచ్చినట్టు అయ్యింది భారత్ వల్ల పాకిస్థాన్ లోని ఆర్మీ కానీ సాదారణ పౌరులు కానీ నష్టపోలేదని గుర్తించాలి అంత మాత్రమే కాదు ప్రపంచ దేశాల సమ్మతితో భారత్ ఈ పని చేయడంతో పాకిస్థాన్ ఒంటరిగా మారింది. మొత్తం మీద ఈ దాడులు చేయడం ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని సమగ్రతను కాపాడడమే ధ్యేయం

-భారత అవినాష్, జనగామ

## అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలోఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయకక్ష్యలు, కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆ రాజకీయకక్ష్యలు, కార్పణ్యాలు గత ప్రభుత్వం నాటినచెట్లు, మొక్కలపైకూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనేభేదం లేకుండా ప్రభుత్వంపై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి. పని.

-పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అకాల వర్షంతో అన్నదాతకు అపార నష్టం!

**అకాల వర్షం వల్ల కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుంది. కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసిన ధాన్యం కూడా వర్షానికి తడిసి ముద్దయిపోయింది. అకాల వర్షం వల్ల రైతులు ఆరుగాలం కష్టం వృథాగా పోతుంది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తల్లాడిపోయారు. ఎప్పుడు వర్షం పడుతుందో ఎప్పుడు ధాన్యం తడుస్తుందో అన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తేమ శాతం చూడకుండానే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పగటిపూట ఎండ కొడుతూ రాత్రిపూట వర్షం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు.**



డాక్టర్
మోటె చిరంజీవి

ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చింది. పలు జిల్లాల్లో పంట నష్టం వాటిల్లగా, రహదారులు, ధాన్యం కేంద్రాల వద్ద అన్నదాతలు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అన్నదాతపై ప్రకృతి పగబట్టింది. గతంలో కొంత వానకు పడిపోగా, గత కొద్ది రోజులుగా కురిస్తున్న వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. అరబెట్టిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతలు ఉరుకులు పరుగులు పెట్టారు. వరితోపాటు మామిడి, మొక్క జొన్న, ఉద్యానం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కురిసిన అకాల వర్షాలు, గాలివానతో రైతులకు నష్టం కలిగింది. ధాన్యాలు తడిసి రైతులు మార్కెట్లలో అవస్థలుఎదుర్కొన్నారు. పలు జిల్లాల్లో గత కొన్ని రోజులుగా కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులు రైతులను నట్టేట ముంచాయి. నల్గొండ, ఖమ్మం, జనగామ, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో గాలివానకు పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాలు, మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల సుమారు రెండు గంటలకు పైగా వీచిన బలమైన గాలులకు జనం భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్లు, రైస్ మిల్లుల పైకప్పు రేకులు ఎగిరిపోగా, షెడ్లు, గోడలు కూలిపోయాయి. హన్మకొండ జిల్లా భీమదేవరపల్లిలో అత్యధికంగా 4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో వాతావరణం వేడిగా ఉండగా సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. భారీ వర్షంతో రోడ్లు మునిగిపోయాయి. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు పడిపోయాయి. జిల్లాలో వైరా కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ, ఖమ్మం రూరల్ తదితర మండలాల్లోనూ భారీగా వర్షం కురిసింది.



కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిచిపోయింది. వైరాలో చెట్లు నేలకూలాయి. కురిసిన భారీ వర్షానికి ఎదులాబాద్ కొనుగోలు కేంద్రంలోని ధాన్యమంతా పక్కనే ఉన్న కాలువలోకి కొట్టుకుపోయింది. తూకమేసిన ధాన్యం బస్తాలుసైతం తడిసిపోయాయి. ఉదయం రైతులు కాలువలో నుంచి ధాన్యాన్ని తీసి ఆరబెట్టుకున్నారు. ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అధికారులు లారీలను ఏర్పాటు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఎదులాబాద్, మాధారం కేంద్రాల్లో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోందని తెలిపారు. కాగా, కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, ములుగు, భూపాలపల్లి, పెద్దపల్లి, యాదాద్రి, జనగామ, మంచిర్యాల, ఆసిఫాబాద్, నల్గొండ, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కొన్నిచోట్ల ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని తెలిపింది. వ్యవసాయ మార్కెట్ యార్డులలో, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కురిసిన అకాల వర్షానికి ధాన్యం రాశులు తడిసిపోయాయి. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు అల్లాడిపోయారు. సీసీ కల్లంపై పోసిన రాశుల కిందకు వర్షపు నీరు చేరడంతో ధాన్యం తడిసింది. మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఎక్కువగా ఉందంటూ వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు మార్కెట్ గేటును మూసివేశారు. దీంతో అధికారులు రైతులను సముదాయించి, వ్యాపారులను పిలిపించి, వారు ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారు. మిగతా గ్రామాల రైతుల ధాన్యం తడిసిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ధాన్యం కుప్పలు తడిసిపోవడంతో, రైతులు తమ పంటను కాపాడుకోవడానికి ప్లాస్టిక్ కవర్లు టార్పాలిన్ కవర్లు వంటి వాటిని ఉపయోగించి దానిని కప్పి వర్షం నుంచి కాపాడుతున్నారు. అకాల వర్షం వల్ల కల్లాల్లో ఆరపెట్టిన ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం నాణ్యత తగ్గి నష్టం వాటిల్లుతుంది. కొనుగోలు కేంద్రాలలో నిల్వచేసిన ధాన్యం కూడా వర్షానికి తడిసి ముద్దయిపోయింది. అకాల వర్షం వల్ల రైతులు ఆరుగాలం కష్టం వృథాగా పోతుంది. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. రైతులు తమ వరి ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. తూకాలకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తల్లాడిపోయారు. ఎప్పుడు వర్షం పడుతుందో ఎప్పుడు ధాన్యం తడుస్తుందో అన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తేమశాతం చూడకుండానే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పగటిపూట ఎండ కొడుతూ రాత్రిపూట వర్షం పడుతుందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుకుంటున్నారు. ●

# హోదా పెరిగినా ప్రాధాన్యత ఏది?

అంకం నరేష్

ప్రాథమిక విద్యావ్యవస్థలో వారు సీనియర్ ప్రధానోపాధ్యాయులు. కానీ హోదా పెరిగినా వారి ప్రాధాన్యత పెరగడం లేదు. రావలసిన హక్కులు ఇవ్వవలసిన బాధ్యతలు ఇవ్వడం లేదు. సరైన జాబ్ చార్ట్ లేక ఏళ్లుగా అన్నింటిలో వివక్ష ఎదుర్కొంటున్నారు. పాఠశాల సముదాయ సమావేశాలను కార్యదర్శి హోదాలో నడిపించాల్సిన పిఎస్ హెచ్‌ఎంలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల పొందవలసిన హోదా పొందడం లేదు. అలాగే ఉన్నత పాఠశాలల్లో బోధించే స్కూల్ అసిస్టెంట్లతో సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు పరీక్ష విధులు, ఎన్నికల విధులలో వారితో సమాన హక్కులు దక్కడం లేదు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 5500 మంది వరకు ప్రాథమిక పాఠశాలలో పిఎస్ హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వు నెంబర్ 6225 ప్రకారం ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులకు జరిగే పాఠశాల సముదాయ సమావేశంలో కన్వీనర్ అయిన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఆ పాఠశాల సముదాయంలో పనిచేస్తున్న సీనియర్ పిఎస్ హెచ్‌ఎంకు కార్యదర్శి హోదా ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు కార్యదర్శి హోదాలో ఎస్‌జిటి ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించాలి. కానీ ఆదేశాలు ఉన్నా కొందరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల కార్యదర్శి హోదాను పొందలేకపోతున్నారు. అలాగే కాంప్లెక్స్ పాఠశాలకు వచ్చే నిధుల ఖర్చు విషయంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పిఎస్ హెచ్‌ఎంతో కలిపి సంయుక్తంగా బ్యాంకు ఖాతా తెరిచి నిధులను ఖర్చుపెట్టాలి. కానీ చాలాచోట్ల అలా జరగడం లేదు. ఇటీవల జరిగిన పిఎస్ హెచ్‌ఎం పదోన్నతులలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలలకు కాకుండా మంజూరి పోస్టు ఉండి తక్కువ విద్యార్థులు ఉన్నా కూడా అక్కడ పిఎస్ హెచ్‌ఎం పోస్టులను ఇచ్చారు. దీనివల్ల హోదా పెరిగినా ప్రాధాన్యత పెరగని పరిస్థితి నెలకొంది. అలాగే హేతుబద్దీకరణ నిబంధనలలో పిఎస్ హెచ్‌ఎం పోస్టులను సీనియర్ ఎస్జీటీగా




పరిగణలోకి తీసుకోవడం వల్ల చాలామంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీలలో తీవ్రంగా నష్టపోతున్నారు. పిఎస్ హెచ్‌ఎం పోస్ట్ అనేది స్కూల్ అసిస్టెంట్స్ పోస్ట్‌తో సమానహోదా కలిగిన పోస్ట్ కానీ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఇతర విధులలో కూడా వివక్ష ఎదుర్కొంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక కులసర్వేలో హోదాకు తగిన సూపర్వైజర్ బాధ్యతలు ఇవ్వకుండా ఎన్యుమరేటర్‌గా చాలా జిల్లాల్లో ఎంపిక చేశారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు ఇతర ఎన్నికలలో ఎన్నికల సిబ్బంది ఎంపికలో భాగంగా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు ఇస్తున్న అదే సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు ఆ బాధ్యతలు కేటాయించడం లేదు. రేషనలైజేషన్ నిబంధనలో భాగంగా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను వేరుగా లెక్క కట్టినట్లు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను లెక్కకట్టాలి. అలాగే విద్యార్థులతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఒక పిఎస్ హెచ్‌ఎంను ఇవ్వాలి. ప్రాథమిక పాఠశాలలకు సంబం ధించిన బోధన అభ్యసన ప్రక్రియ బోధన పద్ధతులపై ఏళ్ల గా పనిచేస్తున్న పిఎస్ హెచ్‌ఎంలకు అనుభవం ఉంది. కావున ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ పోస్టు అయిన మండలం నోడల్ అధికారి పోస్టును అన్ని అర్హతలు ఉన్న సీనియర్ పిఎస్ హెచ్‌ఎంలకు ఇస్తే క్షేత్రస్థాయిలో ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ పటిష్టమవుతుంది. అలాగే పిఎస్ హెచ్‌ఎంలకు సంబంధించిన జాబు చార్ట్‌ను రూపొందించి వారి బాధ్యతలను విధులను పొందుపరచాలి. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి పిఎస్ హెచ్‌ఎంకు గెజిటెడ్ హోదా ఇవ్వాలి. మొత్తంగా ప్రభుత్వం చిన్నబడుల పెద్ద సార్ల సమస్యలను పరిష్కరించాలి. ఉన్నత పాఠశాలల్లో బోధించే స్కూల్ అసిస్టెంట్లతో సమాన హోదా కలిగిన పిఎస్ హెచ్‌ఎంలకు పరీక్ష విధులు, ఎన్ని కల విధులలో వారితో సమాన హక్కులు కల్పించాలి. పాఠశాల విద్యలో పునాది అయినా ప్రాథమిక విద్య బాగుపడితేనే ఉన్నత విద్య పటిష్టమవుతుంది. ●

# సముద్ర శక్తిగా రాంబిల్లి స్థావరం

యేచన్ చంద్ర శేఖర్

ఆధునిక జలాంతర్గాములు (సబ్ మెరైన్) సాంప్రదాయ అణ్వాయుధాల ద్వారా సముద్రం, భూమిపై దాడి చేయగలవు. యుద్ధ అవసరాలతో పాటు జలాంతర్గాములను, ప్రత్యేకదళాల కార్యకలాపాలు నిఘాకు సైతం ఉపయోగించవచ్చు. ప్రపంచంలోని ఆధునిక నావికాదళాలు జలాంతర్గాములను ప్రధానంగా ప్రాదేశిక జలాల్లో శత్రు మూకలను నిరోధించేందుకు ఉపయోగిస్తాయి. గ్లోబల్ ఫైర్‌పవర్ ర్యాంకింగ్స్ ప్రకారం ప్రపంచంలో శక్తివంతమైన జలాంతర్గాములు గల దేశాల జాబితాలో వరుసగా అమెరికా, రష్యా, చైనా, ఇరాన్, జపాన్, దక్షిణ కొరియా భారత్ ఏడవ స్థానంలో ఉంది. సెప్టెంబర్ 2024నాటికి ప్రపంచ వ్యాప్తంగా అమెరికా, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, చైనా భారతదేశం మాత్రమే అణుశక్తితో నడిచే జలాంతర్గాములను కలిగి ఉన్నాయి. అయితే హిందూ మహాసముద్రంలో విస్తరిస్తున్న చైనా ప్రభావాన్ని ఎదుర్కోవాలనే ఉద్దేశంతో భారతదేశం ఒక కొత్త అత్యాధునిక నావికా స్థావరాన్ని ఆవిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని రాంబిల్లి గ్రామాన్ని ఎంచుకుంది. ఈ స్థావరం, భారతదేశ యుద్ధనౌకలు అణుశక్తితో నడిచే జలాంతర్గాములకు కేంద్రంగా పనిచేస్తుంది. దక్షిణాసియా భద్రతా వ్యవహారాల అంశాల నిపుణులు, కింగ్స్ కాలేజ్ లండన్‌లో సీనియర్ అంతర్జాతీయ సంబంధాల లెక్చరర్ వాల్టర్ లాడ్విగ్ ప్రకారం, కొత్త ఐఎన్‌ఎస్ అరిధమాన్‌తో సహా భారతదేశ అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాముల సముదాయానికి ఈ కేంద్రం మద్దతు ఇస్తుంది. "ప్రాజెక్ట్ వర్ష" కింద రాంబిల్లి స్థావరం మొదటి దశ దాదాపు పూర్తయింది. 2026లో ప్రారంభించబడిన తర్వాత, దీనిని ప్రాజెక్ట్ సీబర్డ్ కింద కార్వార్ స్థావరంలో జరుగుతున్నట్లుగా దశలవారీగా విస్తరించే అవకాశం ఉంది. ఇది భారత నావికాదళం సామర్థ్యాన్ని మెరుగుపరచడంతోపాటు అణు జలాంతర్గాముల కార్యాచరణ గోప్యతను నిర్ధారిస్తుంది. ఈ సంవత్సరాంతంలో రాంబిల్లి వద్దఏర్పడబోయే ఈ స్థావరంలో అణుశక్తితో నడిచే మూడవ జలాంతర్గామి అయిన ఐఎన్‌ఎస్ అరిధమాన్‌ను ప్రవేశపెట్టనుంది. 7,000టన్నుల బరువుతో అణు బాలిస్టిక్ క్షిపణులతో అమర్చబడిన ఈ నౌక గతంలో ప్రవేశపెట్టబడిన ఈ శ్రేణికి చెందిన ఐఎన్‌ఎస్ అరిహంత్ ఐఎన్‌ఎస్ అరిఘాత్ కంటే పెద్దది. ఈ అణు జలాంతర్గాములు ప్రస్తుతం సముద్రంలో భారతదేశం అణు నిరోధక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. హిందూ మహాసముద్రం విస్తృత ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక ఆధిపత్యం కోసం భారత్‌చైనాల మధ్య పెరుగుతున్న పోటీ నేపథ్యంలో ఇది అత్యంత కీలకమైన పరిణామం. ఇప్పటివరకు, ప్రపంచంలో కేవలం రష్యా, చైనాలు మాత్రమే స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. భారతదేశం విశాఖపట్నంలోని తూర్పు నేవల్ కమాండ్ నుండి 50 కిమీ (31 మైళ్లు) దూరంలో వ్యూహాత్మకంగా నిర్మిస్తున్న రాంబిల్లి స్థావరంలో ఏకంగా 12 జలాంతర్గాములను, ప్రత్యేకించి అణు జలాంతర్గాములను లంగరు వేసుకోవచ్చు. చైనా హైనాన్ ద్వీపంలో గల అణు జలాంతర్గామి స్థావరం లాగానే రాంబిల్లిలో కూడా సముద్రపు నీటిలోతు ఎక్కువగా ఉండడంతో జలాంతర్గాములు ఉపగ్రహాల నిఘా పరిధిలోకి వచ్చే



అవకాశాలు ఉండకపోవడమే కాకుండా సునాయాసంగా సంచరించగలవు. జలాంతర్గాములు సముద్రంలోని సొరంగ మార్గాల ద్వారా హబ్‌కు చేరుకునేలా నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లకుపైగా పట్టింది. 2004లో ప్రారంభించబడిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టులో భాగంగా స్ట్రాటజిక్ స్ట్రయిక్ న్యూక్లియర్ సబ్‌మెరైన్స్ (ఎస్‌ఎస్బిఎన్) పేరుతో నాలుగు అణుజలాంతర్గాముల నిర్మాణానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసల్ (ఏటీవీ) ప్రాజెక్టును 2004లో ప్రారంభించారు. రష్యా సహకారంతో మొట్టమొదట ప్రారంభమైన ఐఎన్‌ఎస్ అరిహంత్‌ను అనేక ట్రయల్స్ అనంతరం ఆగస్టు 2016లో నేవీకి అప్పగించారు. రెండవ జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిఘాత్‌ను 2024 ఆగస్టు 29న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా జాతికి అంకితం చేశారు. వీటిని అరిహంత్ క్లాస్ అణు జలాంతర్గాములుగా పరిగణిస్తారు. ఈ ప్రాజెక్ట్‌లో వస్తున్న మూడో అణు జలాంతర్గామి ఐఎన్‌ఎస్ అరిధమాన్ గతేడాది అక్టోబరులోనే ట్రయల్స్‌కు వెళ్లింది. దీన్ని త్వరలోనే కమిషనింగ్ చేసినేవీకి అప్పగించనున్నారు. 7వేల టన్నుల సామర్థ్యంతో 3,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల ఈ అణు జలాంతర్గామి మరిన్ని కే4 క్షిపణులను మోసుకెళ్తుంది. రాంబిల్లిలోని "ప్రాజెక్ట్ వర్ష తూర్పు తీరంలో పహారా కాస్తుంది. కార్వార్ నౌకాదళ స్థావరంలో పలు మౌలిక ప్రాజెక్టుల ప్రారంభంతో 32నౌకలు, జలాంతర్గాములతోపాటు మరికొన్ని నౌకలు అందుబాటులోకి రానున్నాయి. అత్యధిక కాలంపాటు నీటి అడుగున ఉండేందుకు, ఖండాంతర క్షిపణులను గుట్టుగా మోసుకెళ్లేందుకు అణు జలాంతర్గాములకు లోతైన సముద్ర జలాలు అత్యంత అనువైన ప్రాంతం. అంతేకాదు రూ.90 వేల కోట్ల వ్యయంతో రహస్యంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెసెల్ (ఏటివి) ప్రాజెక్ట్‌లో భాగంగా నాల్గవ ఎస్‌ఎస్బిఎన్ ఇప్పటికే నిర్మాణంలో ఉంది. ఇదిదాదాపు రెట్టింపు సామర్థ్యం అనగా 13,500టన్నులతో ప్రస్తుత 83 మెగావాట్ల డిజైన్ కన్నా మరింత అధునాతనమైన 190 మెగావాట్ల ప్రెషరైజ్డ్ లైట్‌వాటర్ సాంకేతికతతో అందుబాటులోకి రానుంది. ఇవే కాకుండా సంప్రదాయ యుద్ధాలకోసం రూపొందించిన ఆరు అణుశక్తితో నడిచే దాడి జలాంతర్గాముల (ఎస్‌ఎస్‌ఎన్)కోసం గత సంవత్సరం అక్టోబర్‌లో, భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ రూ.40 వేల కోట్ల బడ్జెట్‌తో దాదాపు 9,800 టన్నుల బరువున్న మొదటి రెండు జలాంతర్గాముల నిర్మాణానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. రాంబిల్లి భారతదేశ తూర్పు పార్శ్వాన్ని సురక్షితం చేసే బాధ్యతను చేపడుతుండగా, పశ్చిమ తీరాన్ని కూడా ఏమాత్రం విస్మరించడంలేదు. భారత ప్రభుత్వం ఇటీవల కార్వార్‌లో ప్రాజెక్ట్ సీబర్డ్ కింద రూ.2 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో కొత్త కార్యాచరణ, మరమ్మత్తు లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను ప్రారంభించింది. ఈ నవీకరణ పనులు పాకిస్థాన్ దుందుడుకు చర్యలను ధీటుగా తిప్పికొట్టేందుకు భారత నావికాదళానికి కీలకమైన వ్యూహాత్మక మద్దతును అందిస్తాయి. ప్రాజెక్ట్ ఎస్4 గా పిలవబడే నాల్గవ అణు జలాంతర్గామి కూడా ప్రస్తుతం ట్రయల్స్‌లో ఉంది. ఇది ప్రాజెక్ట్ సీబర్డ్"లో భాగంగా కర్ణాటకలోని కార్వార్ స్థావరం పశ్చిమ తీరాన్ని కాపాడుతోంది. "ప్రాజెక్ట్ సీబర్డ్"దశఐఐఎ కార్వార్లో 32యుద్ధనౌకలను మోహరించేందుకు వీలు కల్పిస్తుంది. లోపలి నౌకాశ్రయం ఇప్పటికే సిద్ధం కాగా అవసరమైన బ్రేక్ వాటర్స్ జెట్టీలతో బాహ్యనౌకాశ్రయం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దశ ఐఐబి పూర్త యిన తర్వాత, 25 కి.మీ. పొడవైన స్థావరం 50 యుద్ధ నౌకలు, జలాంతర్గాములు 40 సహాయక నౌకలను మోహ రించేందుకు అనువుగాఉంటుంది. భారతదేశ ప్రాదేశిక జలాల పరిరక్షణలో భాగంగా వ్యూహాత్మక నిరోధకతను స్థాపించడంలో భారత నావికాదళం పాత్ర ఎంతో కీలకమైనది. ముఖ్యంగా హిందూ మహా సముద్రప్రాంతంలో చైనా ప్రభావంపెరు గుతున్న సందర్భంలో, సంభావ్య ప్రత్యర్థులను అరికట్టడాని కి, నావికాశక్తిని ప్రదర్శించాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్వదేశీ విమాన వాహకాలు జలాంతర్గాములు వంటి అధునాతన నావికాదళ ఆస్తుల అభివృద్ధితో, పటిష్టమైన సముద్ర శక్తిగా మారడానికి రాంబిల్లి స్థావరం ఒక గొప్ప మైలురాయి. ●








## సాయిబాబా జయంతి ప్రభుత్వ పండుగ అవుతుందా

### - హేతువాద సంఘం సూటి ప్రశ్న

**ఒంగోలు టౌన్, మే 8, ప్రభాతవార్త**



పుట్టపర్తి సాయిబాబా శత జయంతి ప్రభుత్వ పండుగ ఎలా అవుతుందని భారత హేతువాద సంఘం అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య సూటిగా ప్రశ్నించారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చిన న్న చిన్న మ్యాజిక్‌లను మహత్యాలుగా చెప్పుకుని ప్రజలను మాయ చేసి సొమ్ము గడించిన పుట్టపర్తి బాబా శత జయంతిని ప్రభుత్వ పండుగగా ప్రకటించడం శోచనీయమని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు పారద్రోలేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి తప్ప దొంగ బాబాలు, దొంగ స్వాములకు ఊతం ఇచ్చేలా కాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని సంఘ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎంకె బేగ్, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, పౌర సమాజం కన్వీనర్ జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## లెక్చరర్స్‌కు ఓరియంటేషన్ ప్రోగ్రాం

**ఒంగోలు టౌన్, మే 8, ప్రభాతవార్త**



ఇంటర్ బోర్డు డైరెక్టర్ ఆదేశాల మేరకు జూనియర్ కళాశాలల అధ్యాపకులకు జిల్లా కేంద్రాలలో పున:శ్చరణ తరగతులు జరుగుతున్న విషయం విదితమే. గత రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ, సివిక్స్, ఎకనామిక్స్ అధ్యాపకులకు డిఐఇఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పున:శ్చరణ తరగతులు జరిగాయి. పరిశీలకులుగా ప్రిన్సిపాల్స్ తారక్‌నాథ్, రంగనాయకులు, సౌజన్య, ఎస్‌కె బాబు వ్యవహరించారు.

## రాష్ట్ర జట్టుకు కాంస్య పతకం

**ఒంగోలు టౌన్, మే 8, ప్రభాతవార్త**



పాట్నాలో జరిగిన ఖేలో ఇండియా సెపక్‌తక్రా పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు టీమ్ ఈవెంట్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. రాష్ట్ర జట్టు గెలుపులో ముఖ్య పాత్ర పోషించిన జిల్లా క్రీడాకారులను సెపక్‌తక్రా జిల్లా గౌరవ ఛైర్మన్ డాక్టర్ కృష్ణసాయి, అధ్యక్ష, కార్యదర్శులు యనమల సురేష్, డి.రవిప్రసాద్, శిక్షకులు శ్రీనివాసులు అభినందించారు.

## వర్చ్యూసా పూల్ క్యాంపస్ డ్రైవ్

**ఒంగోలు టౌన్, మే 8, ప్రభాతవార్త**

రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 9న వర్చ్యూసా పూల్ క్యాంపస్ డ్రైవ్ జరుగుతుందని కళాశాల కార్యదర్శి శిద్ధా హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. అపిత టీమ్, వర్చ్యూసా హెచ్‌ఆర్ టీమ్ విచ్చేసి ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు శుక్రవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ఆధార్, పాన్‌కార్డు, మార్క్స్ మెమోతో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

## సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగిస్తాం

**ఒంగోలు టౌన్, మే 8, ప్రభాతవార్త**



సమస్యలు పరిష్కరించాలంటూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ చేపట్టిన సమ్మె పదవ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ప్లకార్డులతో సిహెచ్‌ఓలు ఉద్యమ స్ఫూర్తిని చాటారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఏడేళ్లుగా సేవలు అందిస్తున్న సిహెచ్‌ఓలపై ప్రభుత్వం కనికరం లేకుండా వ్యవహరిస్తోందని, సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షులు జీవన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ఆపుకోవడం అమ్ముకోవడం

**కొత్తపట్నం, మే 8 ప్రభాతవార్త**



కొత్తపట్నం గ్రామంలోప్రభుత్వ భూములను ఆక్రమించి ఇల్లు కట్టి వాటిని అమ్మకాలకు పెడుతున్న వారిపై గురువారం ఎమ్మార్వో ఉక్కు పాదం మోపారు. కొత్తపట్నంలో నివాసముంటున్న సైకం వెంకటేశ్వరమ్మ, గంగపట్నం లక్ష్మీ, బొమ్మిడి తిరుపతమ్మ, వీరికి గతంలో ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చినప్పటికీ, వాటిని ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అమ్మకాలు జరిపారు. మరల కొత్తపట్నం హై స్కూల్ సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించి వాటిని అమ్మకానికి సిద్ధమవుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మార్వో, వెంటనే ఆర్ఐ, స్థానిక వీఆర్వోలను ఫీల్డ్ మీదకి పంపించి వారిని కాళీ చేయాలని ఆదేశించారు.

## డీఎస్సీ దివ్యాంగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగ అభ్యర్థులకు (దృష్టి లోపం, వినికిడి లోపం, అంగవైకల్యం) క్రాష్ కోర్స్ ప్రత్యేక బోధన పద్దతిలో శిక్షణను ఉచితంగా విజయవాడలో నిర్వహించనున్నారు. దరఖాస్తులు ఈనెల 11వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో ఎండీఎఫ్‌సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్‌లో స్వీకరించబడునని, కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండవలెను, ఎంపిక ప్రక్రియ టెట్ పరీక్ష మార్కులు ఆధారిత తీస్కోబడును. శిక్షణ సమయంలో స్టడీ మెటీరియల్, భోజనం వసతి, ఉచితంగా కల్పించబడును, కావున ప్రకాశం, బాపట్ల జిల్లాలోని డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న దివ్యాంగులు సదరు అవకాశాన్ని వినియోగించుకోవాలని సహాయ సంచాలకులు జి.అర్చన ఒక ప్రకటనలో కోరారు.

## ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో నర్సెస్ డే సందర్భంగా వాక్ థాన్

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఇంటర్నేషనల్ నర్సెస్ డేను పురస్కరించుకుని, నర్సుల అమూల్య సేవలను గుర్తించి వారికి ధన్యవాదాలు చెప్పే ఉద్దేశ్యంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్ థాన్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ ఆవరణ నుండి దాదాపు 5 కిలోమీటర్లు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నల్లూరి నితిన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ నర్సింగ్ సిబ్బంది మద్దతు లేకుండా రోగుల ఆరోగ్య సంరక్షణ పూర్తిగా సాధ్యం కాదని రోగుల శ్రేయస్సు కోసం నర్సులు తమ సేవలను మరింత అంకితంగా కొనసాగించాలని కోరుతూ నర్సింగ్ సిబ్బందికి తమ అభినందనలు తెలిపారు. డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ రోజంగా అంకితభావంతో సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకం రోజుకూలి పెరిగేలా చర్యలు తీసుకోవాలి







### - కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు, మే 8, ప్రభాతవార్త**

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు పటిష్టంగా చేపట్టడంతో పాటు యావరేజ్ కూలీ రేట్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం టంగుటూరు మండలం జయవరం గ్రామపంచాయతీ ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామా పథకం ద్వారా జయవరం గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులను పరిశీలన చేసి పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల దగ్గరకు జిల్లా కలెక్టర్ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలు వారి పని చేసిన దానికి సకాలంలో వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి లేనిది ఆరా తీశారు. అదే విధంగా కూలీల హాజరు పట్టిక పని ప్రదేశంలో తాగునీరు, నీడ షెడ్ తదితర మౌలిక సదుపాయల కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించార.ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పనిచేసుకోవాలన్నారు.ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఉపాధి హామీ పథకం సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీ మేడపల్లి అంజమ్మ నాకు విడో పెన్షన్ రావడం లేదని, పెన్షన్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే పెన్షన్ బంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి నా భర్తకు ఆరోగ్యం భాగాలేక మంచంలోనే ఉన్నారని,నా కుమారుడు కూడా మరణించడం జరిగిందని, పెన్షన్ మంజూరు చేయాలని గ్రామస్తురాలు యరజర్ల భారతమ్మ జిల్లా కలెక్టర్‌ను కోరగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ పెన్షన్‌మంజూరుకు చర్యలు తసీఉకోవాలని ఎంపీడీఓను ఆదేశించడం జరిగింది. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిర్మించిన పశువుల నీటితొట్టెను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. మూడ జీవాల దాహాన్ని తీర్చే ఉద్దేశంతో ఈ పశువుల నీటి తొట్టె నిర్మాణాన్ని ఉపాధి హామీ పథకం కింద రూ.35.783ల ఖర్చుతో నిర్మించడం జరిగింది. అనంతరం గ్రామంలో యల్లవరపు వెంకట సుబ్బారెడ్డి ఇంటిపై సీఎం సూర్యఘర్ పథకం కింద నిర్మించుకున్న సోలార్ ప్యానెల్ నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలన చేశారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్,తహశీల్దార్ ఆంజనేయులు, సర్పంచ్ పేరమ్మ, ఈఈ శ్రీహరిబాబు, ఎంపీడీఓ డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రోత్ సెంటర్లో వరసిద్ది వినాయక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

**మద్దిపాడు, మే 8, ప్రభాతవార్త**



మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి ధ్వజ, యంత్ర, గుడి శేఖర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి గ్రోత్ సెంటర్లోనే పారిశ్రామిక యజమానులు సహకారంతో నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవ కార్యక్రమం పిఠాపురం వాస్తవ్యులు వేదమూర్తులైన ఇంజమూరి అచ్యుతానంద శర్మ అవధానిచే గణపతి పూజ, పుణ్యాహావచనం, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన, గోపూజ గత మూడు రోజుల నుంచి నిర్వహించారు. సోమవారం నాడు గణపతి పూజా పుణ్యహ వచనం, గర్త న్యానం, నవరత్న న్యాసం నిర్వహించారు. మంగళవారం, బుధవారం నాడు వాహనం, అంగ హోమములు యాగశాల, బలిహారము కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం నాడు యంత్ర, ధ్వజ, శిఖర, వరసిద్ది వినాయక స్వామి దివ్య ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం మహా పూర్ణాహుతి, గోదిష్టి, కుంభం పోయుట, అనంతరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, 20 సూత్రాల కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, మహా న్యూస్ టీవీ ఛైర్మన్ మారెళ్ళ వంశీ, మండల పార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వహణ కమిటీ తరుపున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మండవ రంగారావు, మండవ గోపిచంద్, పోకూరి శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చెరుకూరి వాసు, ముళ్ళూరి మురళి, రావి నరసింహారావు, పారా నరసింహారావు, తుమ్మల సుధాకర్, ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, రావి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యం

### - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**



పొగాకు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఒంగోలులోని త్రోవగుంటలో గల పొగాకు వేలం కేంద్రంను సందర్శించి జరుగుతున్న వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతుల వద్ద నుండి పొగాకు కొనుగోలు విధానాన్ని పరిశీలించి పొగాకు బోర్డు ఆర్ఎం, వేలం నిర్వహణ అధికారుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాల్లో పొగాకు పంట వేశారు, ఎకరాకు ఎంత దిగుబడి వచ్చింది, కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత




సంవత్సరం కంటే ఈ సంవత్సరం కౌలు, కూలీ రేట్లు పెరగడం జరిగిందని, గిట్టుబాటు ధరలు లేక పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్నారని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని, పొగాకు మంచి డిమాండ్ ఉన్నప్పటికి రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని, రైతులు తెచ్చిన బేళ్లను నోబిడ్ చేయకుండా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని పొగాకు రైతులు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తసీఉకువచ్చారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు కలగకుండా పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రావాలనేది ప్రభుత్వ లక్ష్యమని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట పొగాకు బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు, వేలం నిర్వహణ అధికారి తులసి, ఒంగోలు రూరల్ తహశీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గౌరవం లేదు.. వేతనం రాదు..జడ్పీటీసీ, ఎంపీటీసీల ఆవేదన

### - రెండేళ్ల నుంచి నిరీక్షణ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రభుత్వాలు స్థానిక ప్రజా ప్రతినిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన స్థానిక సంస్థల్లో ప్రజా ప్రతినిధులుగా ఉంటున్న వారికి సరైన గుర్తింపు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రతిపక్ష పార్టీల ప్రతినిధుల నిర్లక్ష్యానికి గురవుతున్నారని తెలుస్తోంది. జిల్లాలో జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం అందలేదు. ఆర్థికంగా, బలంగా ఉన్న ప్రజాప్రతినిధులకు ఇబ్బంది లేకపోయిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుపేదలు మాత్రం అవస్థలు పడుతున్నారు. ఒక ఏడాది బడ్జెట్ కేటాయింపు జరక్క ఇప్పటికి బిల్లులు అందలేదు. మరో ఏడాది అసలు బడ్జెట్ కేటాయింపులే జరగలేదని తెలిసింది. ఇది చిన్న విషయంగా కనిపిస్తున్నా నిరుపేద ప్రజాప్రతినిధులను ఆర్థిక కష్టాల్లో పడేస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి జడ్పీటీసీ ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాప్రతినిధులకు ప్రతి నెల గౌరవం వేతనం అందిస్తుంది. అలవెన్స్‌లు ఇస్తుంది. ఎంపీ, ఎమ్మెల్యేలకు భారీగా గౌరవ వేతనం ఉంది. మండలాల్లో, గ్రామాల్లో ప్రజలకు దగ్గరగా జడ్పీటీసీ, ఎంపీటీసీలు కలిసి పని చేస్తారు. ఎక్కువ సమయం ప్రజలతోనే ఉండటంతో వీరికి ప్రభుత్వం ప్రతి నెల కొంత గౌరవ వేతనంగా అందిస్తుంది. జడ్పీటీసీలకు ప్రతి నెల రూ.6వేలు, జడ్పీ ఛైర్‌పర్సన్‌కు రూ.40వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ఎంపీటీసీలకు ప్రతి నెల రూ.3వేలు, ఎంపీపీకి రూ.6వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారు. గతంలో జడ్పీ, మండల సమావేశాలు జరిగే సమావేశాల్లో ఖర్చులకు కొంత మొత్తం ఇచ్చే వారు. ఇటీవల దానిని పక్కన పెట్టేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జడ్పీటీసీలు 56 మంది, ఎంపీపీలు 56 మంది, ఎంపీటీసీలు 742మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రిజర్వేషన్లు వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నుంచి కూలి పనులు చేసుకునే వ్యక్తులు ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ అయ్యాక తెల్లచొక్క, మంచి బట్టలతో రోజు కూలీలకు వెళ్ళడం మానేశారు. నాయకులుగా రోజు ప్రజల్లో తిరుగుతున్నారు. కొందరు వ్యక్తులు ఆర్థికంగా, బలంగా ఉన్నప్పటికి అత్యధిక మంది పేదలు ఉన్నారు. వీరికి ప్రతి నెల ప్రభుత్వం నుంచి రూ.6వేలు కొంత చేయూతగా ఉంటుంది. ఇది కూడా రెండేళ్ల నుంచి అందకపోవడంతో పేద ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన జడ్పీ సమావేశంలోనూ తమ గౌరవ వేతనం గురించి ప్రస్తావించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రతిపక్ష పార్టీలు గౌరవించడం లేదని తెలుస్తోంది. స్థానికంగా జరిగే కార్యక్రమాలకు అహ్వానించడం లేదని తెలుస్తోంది. జడ్పీ ఛైర్‌పర్సన్‌లను పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఇదే విషయమై వైసీపీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీటీసీలకు, ఎంపీపీలకు రెండేళ్ల నుంచి గౌరవ వేతనం అందలేదు. ప్రభుత్వం దీని కోసం బడ్జెట్ కేటాయించిన తరువాత స్థానిక అధికారులు మూడు నెలలకు ఒక సారి బిల్లులు పెడతారు. ఒక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఇందుకు సంబంధించిన బిల్లులు ప్రభుత్వానికి వెళ్ళగా సీఎఫ్ఎంఎస్ వద్ద పెండింగ్ పడినట్లు తెలిసింది. 2024 సంబంధించి నాలుగు నెలలకు, 2023 సంబంధించి సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిన నిధులు మంజూరు చేయలేదు. మరో ఏడాదికి సంబంధించి అసలు బడ్జెట్ కేటాయింపులు జరగలేదని తెలిసింది. ఇవి చూడడానికి చిన్న విషయంలా కనిపించిన రాజకీయ నేతలకు డబ్బులకు ఏ ఇబ్బంది అని కొందరు చెప్పున్నా అనేక మంది పేద ప్రజాప్రతినిధులు గౌరవ వేతనం కోసం చూస్తారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం లేదని, వేతనం కోసం ఎదురు చూడాల్సి ఉంటుందని స్థానిక ప్రజా ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సింగరకొండ ఆలయ ముఖమండపానికి లక్ష విరాళం




**అద్దంకి , మే 8,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండప నిర్మాణం కొరకు మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన జాగర్లమూడి వేణుబాబు ధర్మపత్ని సౌజన్యలు రు.1,00,116లు ఆలయ ఎసి తిమ్మనాయుడుకు గురువారం అందజేశారు.

## మంత్రి పార్ధసారధికి మహా కుంభాభిషేకానికి ఆహ్వానం



**అద్దంకి , మే 8, ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండప ఆవిష్కరణ సందర్బంగా ఈనెల 19న నిర్వహించే మహా కుంభాభిషేకానికి బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కె. పార్ద సారధిని ఆహ్వానిస్తూ ఎసి తిమ్మనాయుడు గురువారం ఆహ్వానం పత్రాన్ని అందజేశారు. అదే విధంగా పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబ శివరావుకు కూడ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

## పుట్టంరాజు వారి పురస్కారానికి మస్తాన్ రెడ్డి ఎంపిక

### - ఈ నెల 18న పురస్కారం అందజేత



**అద్దంకి , మే 8, ప్రభాతవార్త**

పద్యసాహిత్యంలో విశిష్ట సేవలు అందించిన ప్రఖ్యాత కవి, పరిశోధకులు డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని 2025 సంవత్సరానికి గాను పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు ట్రస్టు అధ్యక్షులు, నిర్వాహకులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు. ఈ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం మే 18వ తేది 2025న పుట్టంరాజు కళాక్షేత్రంలో జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్తలు, కవులు, గౌరవ అతిధులుగా పాల్గొంటారని ఆయన వివరించారు. డాక్టర్ మస్తాన్‌రెడ్డి కోదండరామ నక్షత్రమాల, వీరాంజనేయ తారావళి, భారత పద్యశైలి, వంటి కృతులు తెలుగు పద్యసాహిత్యంలో నూతన దిశలు చేపించాయని పుట్టంరాజు వివరించారు. అదే విధంగా మస్తాన్ రెడ్డి ఆకాశ వాణి, దూరదర్శన్, వేదికలపై పద్యాలు, ప్రవచనాల ద్వారా శ్రోతలను విశేషంగా ఆలరించారని, ఆయన పేర్కొన్నారు. సరసవినోధినలో 300లకు పైగా సమస్యా పూరణ పద్యాలు సమర్పించారు. ఈయన నరసరావుపేటలోని శ్రీమతి కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. ఈయన ప్రభుత్వలనుండి రాష్ట్ర అధ్యాప పురస్కారం, పిహెచ్‌డి, ఎంఫిల్, స్ధాయి పరిశోధనలు ఈయన విశిష్టకు నిదర్శనాలు, అని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అన్నారు.

## కుందుర్రులో వరి గడ్డివామి దగ్ధం - 50 వేలు నష్టం



**అద్దంకి రూరల్ , మే 8, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలం కుందుర్రు గ్రామంలో గురువారం 7ఏకరాలోని వరి గడ్డి దగ్ధంమైయింది. మిరియాల ఏడుకొండలు అనే రైతుకు సంబంధించిన ఈ వరి గడ్డివామి దగ్దం కావడంతో 50వేలకు పైగా నష్టం వాటిల్లింది. అద్దంకి నుండి ఫైర్ సిబ్బంది సమాచారం అందుకొని హుటాహుటిన సంఘటన స్ధలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. అయినప్పటికీ వరిగడ్డి దగ్ధమైపోయింది.

## కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించిన ఈడి



**కొరిశపాడు , మే 8, ప్రభాతవార్త**

ప్రభుత్వం పేద మహిళలకు మెరుగైన జీవనోపాధి కోసం మేదరమెట్లలో ఉచితంగా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని బిసి కార్పోరేష్‌ఈడి ఎం. వెంకటేశ్వరరావు గురువారం నాడు సందర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారు మహిళలలు ఆర్ధికంగా బలపడటానికి ఈ ఉచిత టైలరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టైలరింగులో నైపుణ్యాన్ని సాధించుకొని తమ కుటుంబాలకు అసరంగా నిలబడాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ నిర్వాహకులు శిక్షణ పొందుతున్న మహిళలు వున్నారు.

## నేడు కంభంలో రిటైర్డ్ ఎస్సై షేక్ సిలార్ బాషా పార్ధీవ దేహానికి అంత్యక్రియలు



**కంభం రూరల్, మే 8 ,ప్రభాతవార్త**

కంభం పట్టణానికి చెందిన విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జనాబ్ షేక్ సిలార్ బాషా గురువారం ఉదయం అనారోగ్య కారణాల రిత్యా హైదరాబాదులోని ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ప్రస్తుతం కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్‌లోని ఫైర్ స్టేషన్ వద్దగల హజ్రత్ బిలాల్ మజీద్‌కు గౌరవాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. కాగా జనాబ్ షేక్ సిలార్ బాషా పార్ధీవదేహానికి నేడు (శుక్రవారం) కంభంలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఇరువురికి తీవ్ర గాయాలు





**బల్లికురవ, మే 8, ప్రభాతవార్త**

అద్దంకి నార్కట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపై మండలంలోని కొప్పెరపాడు వద్ద గురువారం ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుండి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై నున్న గంగయ్య, అయ్యప్పలు కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మవరం గ్రామానికి చెందిన వీరు ఇరువురు మండలంలోని నూరేపల్లి గ్రామానికి వచ్చి తిరిగి అద్దంకి వైపు వెళ్తున్నారు. ఈ సమయంలో వెనుక నుండి వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన వీరిని 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్య చికిత్స కోసం హైవే అంబులెన్స్ వాహనంలో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

## ఈదురు గాలులతో వర్షపు జల్లులు



**బల్లికురవ, మే 8, ప్రభాతవార్త**

మండలంలో గురువారం సాయంత్రం ఒక్క సారిగావాతావరణం చల్లబడింది. సాయంత్రం 6గంటల వరకు ప్రచండ భానుడు తన ప్రతాపాన్ని చూపుతూనే ఉన్నాడు. 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతూనే ఉంది. అప్పటికప్పుడు వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. ఈదురు గాలులతో కూడిన వర్షపు జల్లులు ఆరంభమయ్యాయి. అర్ధగంట పాటు వర్షం కురవటంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది. ఎండ వేడిమికి తల్లడిల్లిన ప్రజలకు కాస్తంత ఊరట లభించింది.

## గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా శేషశయనా రెడ్డి



**గిద్దలూరు, మే 8, ప్రభాతవార్త**

గిద్దలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరుగగా అధ్యక్షులుగా పాలుగుళ్ళ నాగశేష శయనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆవులమంద తిరుమల ప్రసాద్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. వారితోపాటు కోశాధికారిగా ముత్తుముల రంగారెడ్డి, ఉపకార్యదర్శిగా మోడి పిచ్చయ్య, లైబ్రేరియన్‌గా ఎమ్మెరైడర్ బాబు, స్పోర్ట్స్ మరియు కల్చరల్ కార్యదర్శిగా పాలుగుళ్ళ విజయ్ కుమార్ రెడ్డి, మహిళా కార్యదర్శిగా బుస్సా సంధ్యారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగగా ఉదయగిరి మల్లిఖార్జునరావుపై బొద్దు ప్రకాష్ ఘనవిజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బొద్దు ప్రకాష్‌కు 33ఓట్లు రాగా ఉదయగిరి మల్లిఖార్జునరావుకు 10ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా పిడతల రాజశేఖర్ రెడ్డి వ్యవహరించారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీకి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.


## 10వ తరగతి ఫలితాల్లో మెరిట్ విద్యార్ధులకు పురస్కారం




**కంభం రూరల్, మే 8, ప్రభాతవార్త**

గత మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ప్రకాశం జిల్లా కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల కాపు సామాజిక వర్గానికి చెందిన 9మంది మెరిట్ విద్యార్ధులను శ్రీ కృష్ణదేవరాయ బలిజ సేవాసంఘం వారు తమ సంఘ కార్యాలయంలో దుశ్శాలువ, మెమొంటోలతో సత్కరించారు. ఏబిసి మండలాలకు చెందిన కాత్వా యూనిట్ వారు ఒక్కో విద్యార్ధికి రూ.500ల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఇదే తరహాలో ఇంటర్మీడియట్ నందు కూడా మరిన్ని ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, సామాజిక వర్గానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు తోట కోటేశ్వరరావు, కార్యదర్శి రఘువీర్, గౌరవాధ్యక్షులు డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్, కాసుల పాండు, ఉపాధ్యక్షులు సూరె ప్రసాద్, కురంగి మల్లిఖార్జున, శిరిగిరి కొండలరావు, ఓసిహెచ్ నరసింహులు, మామిళ్ళ చంద్రశేఖర్, విద్యార్ధుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్‌పి సిఈఓ చిరంజీవిని కలిసిన బిజేపి నేత పివి కృష్ణారావు



**మార్కాపురం రూరల్, మే 8, ప్రభాతవార్త**

పట్టణంలోని పంచాయితీ రాజ్ గెస్ట్‌హౌస్ నందు గురువారం జడ్‌పి సిఈఓ చిరంజీవిని బిజేపి నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇంకా కొన్ని రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, పంచాయితీ రాజ్ నిధులతో గ్రామాలలో రోడ్లు వేసి పంచాయితీ అభివృద్ధికి తోడ్పడాలని జడ్‌పి సీఈఓకు విన్నవించు కున్నారు. ఈ కార్యక్రమంలో శాసనాల సరోజిని, బొంతల కృష్ణ, మద్దెల లక్ష్మీ, ఏఎంసి డైరెక్టర్ చాతరాజు పల్లి ప్రవీణ్, సతీష్‌లు పాల్గొన్నారు.

## "ఆపరేషన్ సింధూర్" విజయం దేశ భద్రతా రంగంలో ఒక గొప్ప మైలురాయి

### - గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు, మే 8 ,ప్రభాతవార్త**

"ఆపరేషన్ సింధూర్" విజయం దేశభద్రతా రంగంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిందని ఉగ్రవాదుల అణచివేతలో భారత సైన్యం ప్రదర్శించిన వ్యూహాత్మక ధైర్య సాహసాలు అత్యంత ప్రశంసనీయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ సింధూర్ విజయంపట్ల ఆయన మాట్లాడుతూ ఈ విజయంతో దేశ శత్రువులకు గట్టి బుద్ధి చెప్పగలిగామని, భారత భద్రతా దళాల శౌర్యం ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేసిందని అన్నారు. ఈ విజయములో ప్రధానమంత్రి నరేంద్రమోడీ దూరదృష్టి, రక్షణ శాఖ సమర్ధత మరియు భద్రతా వ్యవస్ధల సమన్వయం ప్రధాన కారణాలని తెలిపారు. దేశ భద్రతకు మార్గదర్శకులుగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేశ సైనిక రంగంలో మహిళల కీలక పాత్రను గర్వకారకంగా గుర్తించాలని, ఈ ఆపరేషన్ సింధూర్ వంటి కీలక చర్యలలో కల్నల్ సోఫియా ఖురేషి మరియు భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు తమ నిబద్ధత, క్రమశిక్షణ మరియు సమర్ద నేతృత్వం ద్వారా అత్యంత ప్రేరనీయమైన సేవలు అందించారని, వీరి ధైర్య సాహసాలు మరియు నైపుణ్యం భారత సైన్యంలో నూతన తరం మహిళలకు ప్రేరణకు ప్రతీకగా నిలుస్తున్నాయని కొనియాడారు. గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన అనేక మంది యువకులు భారత సైన్యంలో సేవలందిస్తూ దేశ రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి ధైర్యం, త్యాగస్వభావం మరియు దేశభక్తి అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ ఘన విజయాన్ని సాధించడంలో భాగస్వామ్యమైన ప్రతి సైనికుడికి, అధికారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, దేశరక్షణ కోసం ప్రాణాలర్పించేందుకు ఎల్లప్పుడూ సిద్దంగా ఉండే వీరులకు ఆయన వినమ్ర వందనాలు అర్పించారు.

## ఘనంగా ధ్యాన శివుడి నగరోత్సవం





**బల్లికురవ, మే 8, ప్రభాతవార్త**

మండలంలోని కొనిదేన గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బ్రహ్మగుండం, వద్ద ధ్యాన శివుని విగ్రహ ప్రతిష్ఠ పదో తేదీన జరగనుంది. ఈ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం వర్షపు జల్లులతో సైతం నగరోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మురికిపూడి, వేమవరం, గంగపాలెం, కొనిదేన గ్రామాలలో నగరోత్సవం కొనసాగింది. భక్తులు ఘనంగా స్వామివారికి హారతులు ఇచ్చి, వార్లు పోసి స్వాగతించారు.

## పాపినేని పల్లె పొలాల్లో పెద్దపులి సంచారం

### - బొల్లుపల్లెలో ఎద్దుపై దాడిచేసి తిన్న పెద్దపులి

### - భయాందోళనలో మండల ప్రజలు

**అర్ధవీడు, మే 8, ప్రభాతవార్త**

మండలంలోని పాపినేనిపల్లె పొలాల్లో గత బుధవారం రాత్రి పెద్దపులి సంచరించినట్లు గ్రామ రైతులు పులి కాలిముద్రల ఆనవాళ్ళను గుర్తించారు. పాపినేనిపల్లి గ్రామ సమీపంలోని బొల్లుపల్లె గ్రామంలో పెద్దపులి ఎద్దుపై దాడిచేసి చంపి తిన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పాపినేనిపల్లె గ్రామానికి చెందిన మండ్ల గురవయ్య పొలంలో పెద్దపులి సంచరించినట్లుగా పొలంలో పులియొక్క కాలి ముద్రల ఆనవాళ్ళుఉన్నట్లుగా గుర్తించారు. కాగా గత కొన్నిరోజులుగా మండలంలోని కొత్తూరు, వీరభద్రాపురం గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాలను అటవీశాఖ సిబ్బందిసైతం సందర్శించి పెద్దపులి కాలి ముద్రలను కూడా సేకరించారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలకు డిఆర్‌ఓ ప్రసాద్ రెడ్డి అటవీ ప్రాంతంవైపుకు వెళ్లవద్దని సూచించడం జరిగింది. అటవీశాఖ సిబ్బంది పెద్దపులి సంచరిస్తున్నట్లు, పశువులపై దాడిచేస్తుందని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ తాజాగా మండలంలోని పాపినేనిపొలాల్లో పెద్దపులి సంచరిచడం, బొల్లుపల్లె గ్రామంలో పెద్దపులి ఎద్దుపై దాడిచేసి చంపి తినడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు పెద్దపులి సంచారంపై నిఘా ఉంచి పులిని పట్టుకుని అటవీప్రాంతంలో వదిలివేసి తమకు రక్షణ కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## పొదిలి ఆర్టీసీ బస్టాండ్లో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి



**కొనకనమిట్ల, మే 8, ప్రభాతవార్త**

పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో దర్శి మండలం కట్టశింగన్నపాలెంకు చెందిన బండారు వెంకటేశ్వర్లు(70) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. కట్టసింగన్నపాలెం గ్రామం నుంచి ఒంగోలు వెళ్లేందుకు పొదిలి ఆర్టీసీ బస్టాండ్లో దిగగా గుండెల్లో మంటగా ఉందని బల్లా మీదే కూర్చొని కుప్పకూలడంతో పక్కనే ఉన్న భార్య, ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. వారు 108 కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది వచ్చి పరిశీలించారు. అప్పటికి ప్రాణం పోయినట్లు నిర్ధారించారు. దీంతో దిక్కుతోచని భార్య కన్నీరుమున్నీరైంది. గత కొన్ని రోజులుగా గుండెల్లో మంటగా ఉందని స్థానికంగా ఆసుపత్రిల్లో వైద్యం చేపించుకుంటున్నాడని, ఈ మధ్య ఎక్కువగా నొప్పి రావడంతో ఒంగోలు పెద్ద ఆసుపత్రికి పోదామని బయల్దేరామని ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కన్నీరు పెట్టుకుంది. ఈ సంఘటన చూస్తున్న ప్రయాణికులు బాధకు గురయ్యారు. మృతునికి ముగ్గురు కుమారులు ఉన్నట్లు సమాచారం. వారు కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నట్లు భార్య తెలిపింది. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి సమాచారాన్ని సేకరిస్తున్నారు.


## మోటుపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పనులు పరిశీలన



**వెలిగండ్ల, మే 8, ప్రభాతవార్త**

వెలిగండ్ల మండలంలోని మోటుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాస్ నాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగడానికి వీలు లేదని, మస్టర్ల నిర్వహణలో ఎటువంటి అవినీతి జరగకూడదని ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేయాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరంపంచాయతీలో మూగజీవాల కోసం నిర్మించిన నీటి తొట్లను పరిశీలించారు. ఎండలు సమీపిస్తున్న తరుణంలో మూగజీవాలకుతాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండాఈ నీటి తొట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ భాషా, ఏపీవో శ్రీనివాస్ నాయక్, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## కొరిశపాడు మండలంలోని అన్ని సచివాలయాలలో మన మిత్ర శాండీల ఏర్పాటు




**కొరిశపాడు , మే 8, ప్రభాతవార్త**

మండలంలోని అన్ని సచివాలయ కేంద్రాలలో మన మిత్ర శాండీలను ఏర్పాటు చేశారు అని కొరిశపాడు మండల ఎఒ శోభారాణి గరువారం తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన వాట్సప్‌లోవచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడానికి మన మిత్రను ప్రవేశపెట్టిందన్నారు. అందులో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండటానికి గ్రామాలలోని సచివాలయా లలో మన మిత్ర శాండీలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను వ్యయ ప్రయాసలకు వచ్చి మండల కేంద్రానికి వచ్చి అధికారుల చుట్టూ తిరగకుండా తమ ఫోన్ల ద్వారా వాట్సప్‌లో తెలియపరిస్తే నిర్ధిష్ట సమయంలో ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కనుక గ్రామస్తులు ఈ మనమిత్రాలు తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎఈ ప్రసాద్, మనోజు తదితరులు పాల్గొన్నారు.

## 13న ధ్వజస్తంభ నగరోత్సవం

### - ప్రజలు, భక్తులు విరివిగా పాల్గొన్నాలి - తిమ్మనాయుడు

**అద్దంకి , మే 8 ,ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం నందు మహాకుంభాభిషేకం ఈనెల 14 నుండి 19వరకు జరగనున్నది. ఈ నేపద్యంలో 19వ తేదిన ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం పూర్వపు దాతలమైన మేదరమెట్ల శంకరారెడ్డి కుమారులు ఎం. రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డిలు తమ స్వంత ఖర్చులతో పునః ప్రతిష్ట చేయనున్నట్లు ఎసి తిమ్మనాయుడు వెల్లడించారు. ఈ జీవ ధ్వజస్తంభం అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెం సహకార సంఘ కార్యాలయం నుండి ఈనెల 13వ తేది సాయంత్రం 4గంటలకు అద్దంకి పట్టణంలో నగరోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకొని సింగరకొండ దేవస్థానానికి చేరుకుంటుందని తిమ్మనాయుడు వివరించారు. సాయంత్రం 4గంటలకు నంబూరివారిపాలెం సహకార సంఘ కార్యాలయం నుండి ప్రారంభమైయ్యే ఊరేగింపు అంబేద్కర్ బొమ్మ, రేణింగవరం రోడ్డు, కాకానిపాలెం మండపం ప్రక్కగా, పోతురాజు గండి, ఆర్‌టిసి బస్టాండ్, పొట్టిశ్రీరాములు సెంటర్, ప్రభుత్వ వైద్యశాల, రోడ్డు నుండి భవానీ సెంటర్‌లో గుండా సింగరకొండ దేవస్థానానికి చేరుకుంటుదని తెలిపారు. ఈ జీవ ధ్వజస్తంభ ఊరేగింపు నందు ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని దిగ్విజయం చేయాలని ఆలయ ఎసి తిమ్మనాయుడు కోరారు.

# పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

## - మార్కాపురంలో జర్నలిస్టుల ర్యాలీ - సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత





**మార్కాపురం, మే 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ అవినీతి అక్రమాలను వెలికితీయడంతో పాటు ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే ప్రక్రియలో భాగస్వాములు అవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఏపీయు డబ్ల్యూజే నాయకులు అన్నారు. విజయవాడలో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజర్‌రెడ్డి నివాసం ఉంటున్న అపార్టుమెంటులో గురువారం విజయవాడ పోలీసులు తమ సిబ్బందితో వెళ్లి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిదురుసుగా ప్రవర్తించిన సంఘటనకు నిరసనగా మార్కాపురంలో గురువారం సాయంత్రం పాత్రికేయులు నిరసన ప్రదర్శన నిర్వహించి సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ నుండి కోర్టు సెంటర్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయంవరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమాజంలో పరువు, ప్రతిష్ఠలకు విఘాతం కలిగించే రీతిలో ప్రవర్తించడం శోచనీయమని అన్నారు. ఎలాంటి కేసులు లేకపోయినా కేవలం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం, సాక్షి మీడియాను అణగదొక్కే ప్రక్రియలో భాగంగా ఇలాంటి దాడులు చేయడం మంచి పద్దతి కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రజా వ్యతిరేక చర్యలను ఎవరు ప్రశ్నించరాదనే నిరంకుశ ధోరణితో కుట్రపూరితంగా ఈ దాడిని చేయించారని అన్నారు. ఇది కేవలం సాక్షి ఎడిటర్‌పై జరిగిన దాడి మాత్రమే కాదని, భవిష్యత్తులో మొత్తం మీడియాపై ఇవే దాడులు, ఆంక్షలు, బెదిరింపులు కొనసాగే పరిస్థితి ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియా పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాక్షి ప్రతినిధులు జీఎల్ నరసింహారావు, బీఆర్ యోగి, బి.మల్లిఖార్జున్, జిల్లా, రాష్ట్ర యూనియన్ నాయకులు మూలా అల్లురెడ్డి, పి.నరేంద్ర, చంద్రశేఖర్, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, ఆమ్ ఆద్మీపార్టీ, జిల్లా కన్వీనర్ సుదర్శన్, అంకయ్య, కరిముల్లా, శ్రీనివాసరెడ్డి, అన్నూ, శ్రీకాంత్, సురేష్, ఖలీల్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు లేకుండా రీ సర్వే నిర్వహించాలి

## - జేసీ గోపాలకృష్ణ





**తాళ్లూరు, మే 8, ప్రభాతవార్త**

రైతులంతా రీ సర్వేకు హాజరయ్యేలా తప్పనిసరిగా నోటీసులు జారీ చేసి, తప్పులు లేకుండా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని బెల్లంకొండవారి పాలెంలో జరుగుతున్న రీ సర్వేను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ, దేవాదాయ శాఖలకు సంబంధించిన భూముల విషయంలో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందజేసి నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తక్షణమే పరిష్కారం చేయాలన్నారు. ఎక్కడా చెడ్డపేరు లేకుండా సర్వేను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ముందుగా గుంటి గంగలో నిర్మాణంలో ఉన్న 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు జరిగిన పనులను అడిగి తెలుసుకున్నారు. పనులన్నీ పూర్తి స్థాయిలో నాణ్యతగా ఉండాలన్నారు. కాగా ఉప కేంద్రం శివరాంపురం రెవెన్యూ పరిదిలో ఉండగా అధికారులు సోమవరప్పాడు అని రికార్డ్‌లో నమోదు చేశారు, దానిని శివరాంపురంగా మార్చాలని గ్రామస్తులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే తూర్పు గంగవరంలో మల్లిఖార్జున రైస్ మిల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, విద్యుత్ శాఖ కనస్ట్రక్షన్ ఈఈ కృష్ణారెడ్డి, మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, ఆర్ఐ పి.చంద్రశేఖరరావు, వీఆర్వో టి.చిన్నకృష్ణ, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# రామకృష్ణను పరామర్శించిన ఎమ్మెల్యే బూచేపల్లి



**తాళ్లూరు, మే 8, ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ దర్శి నియోజకవర్గం సాంస్కృతి విభాగం అధ్యక్షులు జక్కుల రామకృష్ణ ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న రామకృష్ణను ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి గురువారం పరామర్శించారు. వైద్యశాలలో చికిత్స పొందిన ఆయన విశ్రాంతి తీసుకుంటున్నాడన్న విషయాన్ని తెలుసుకున్న బూచేపల్లి వారి ఇంటి వద్దకు వెళ్లి రామకృష్ణను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల నాగంబొట్లపాలెం సొసైటీ మాజీ చైర్ పర్సన్ యాడిక యలమందరెడ్డి భార్య సుబ్బారత్నం అనారోగ్యంతో మృతి చెందారు. పెద్ద కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యేడాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు తూము సుబ్బారెడ్డి, వెన్నపూస మహేష్‌రెడ్డి, సర్పంచ్ వలి, నాయకులు కుమ్మిత జయరామిరెడ్డి, కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



# జర్నలిస్టులపై పోలీసుల వేధింపులకు నిరసనగా సీఐకి వినతిపత్రం అందజేత



**యర్రగొండపాలెం,మే 8,ప్రభాతవార్త**

సాక్షి ఎడిటర్ ధనుంజయ్ రెడ్డిపై పోలీసు వేధింపులకు నిరసనగా యర్రగొండపాలెంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధాన కర్తలుగా పనిచేసే జర్నలిస్టులపై పోలీసు జులుం తగదని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య అన్నారు. గురువారం సాక్షి ఎడిటర్ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌పై విజయవాడ నగర సెంట్రల్ ఏసీపీ దామోదర్, మాచవరం సీఐ ప్రకాశ్‌లు తమ సిబ్బందితో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి సోదాలు చేసినందుకు నిరసనగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ర్యాలీగా వెళ్లి సీఐకి, ఎంఆర్ఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ...ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, అక్రమాలను వెలికితీసి ప్రజల ముందుంచడమే జర్నలిస్టుల వృత్తి అని ఆయన అన్నారు. ఈ ర్యాలీలో జర్నలిస్టు నాయకులు అందరూ పాలుపంచుకున్నారు. ఏపీడబ్ల్యూజే మాజీ జిల్లా అధ్యక్షులు షేక్ నూరుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ మహబూబ్ బాషా, జర్నలిస్టులు పి.అయూబ్ ఖాన్, ఎన్.వెంకోబరావు, ఎ.సత్యనారాయణరెడ్డి, ఆర్.శంకర్‌నాయక్, షేక్ రియాజ్, పి.వెంకటనారాయణ, ఎ.అనీల్ పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అమౌంట్ కొరకు

## రైతు వివరాలు నమోదు చేసుకోవాలి



**పొన్నలూరు, మే 8, ప్రభాతవార్త**

రైతు సేవ కేంద్రంలో పొన్నలూరు మండలం రెవెన్యూలో గల రైతులందరికి అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ అమౌంట్ కొరకు రైతుల పేర్లు తనిఖీ కొరకు వచ్చాయని రైతులందరూ వారి యొక్క ఆధార్ కార్డు, 1బి, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, జిరాక్స్‌లు రైతు సేవా కేంద్రంలో ఇవ్వాల్సి ందిగా, ఎవరైతే నమోదు చేసుకోరో వారికి అన్నదాత సుఖీభవ అమౌంట్ అకౌంట్లో రాదు అని, గురువారం వ్యవసాయ అధికారి పూర్ణచంద్రరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# తాటిచెట్టు ఎక్కి జారి కింద పడిన యువకుడు



**పొన్నలూరు, మే 8, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పొన్నలూరులో ఎస్సీ కాలనీ సమీపంలో గురువారం తాటికాయల కోసం గంధం రేవంత్ అనే యువకుడు తాటి చెట్టు ఎక్కి జారీ కింద పడి అపస్మారక స్థితికి పోయాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకుని వైద్యం నిమిత్తం కందుకూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

# ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ సురేష్‌బాబు

**సంతనూతలపాడు, మే 8, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం నాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు పరిశీలించారు. టార్గెట్ ప్రకారం ఉపాధి పనులకు కూలీలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రోజుకు రూ.307లు వేతనం తగ్గకుండా కూలీలకు పనులు కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ మండల ఏపీవో వాసంతి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు తదితరులు పాల్గొన్నారు.

# వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం



**దొనకొండ,మే 8,ప్రభాతవార్త**

స్థానిక వెలుగు కార్యాలయంలో... స్థానిక ఏపిఎం జి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో7,8, మే.2025,రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినది. దర్శి ఏరియా కోఆర్డినేటర్ వి వసుంధరవిగా దేవి ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ శిక్షణ కార్యక్రమానికి EMT లు పి ఈశ్వరమ్మ, సత్య సాయి జిల్లా, ము బీనా తిరుపతి జిల్లా ఈ రెండు రోజులు శిక్షణ ఇవ్వడం జరిగినది. NRLM ద్వారా లోకోస్‌లో భాగంగా గ్రూపులు, VOలు, ఎమ్మెస్ ఎలా నడుచుకోవాలి. గ్రూప్ లు,MS లు ఆర్థిక వ్యవహారాల్లో ఆన్లైన్ ట్రాన్సాక్షన్ ఏ రీతిగా డేటా ఎంట్రీ చేయాలో అనే అనే అంశంపై ట్రాన్సాక్షన్ జువీ !! లీదిలినీ( మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ క్లస్టర్ ). శిక్షణ ఇవ్వడం జరిగింది.గ్రూప్ లు ,వివో లు మరియు లీదిలినీ లు 31.3.2025.. కట్ ఆఫ్ ఎంట్రీ అంటే ఆనాటికీ.. ఈ సంఘంలో ఉన్నటువంటి ఆర్థిక లావాదేవీలు కి సంబంధించిన నిల్వలు లెక్కల తేల్చి కొని లోకో స్ యాప్ లో ట్రాన్సాక్షన్ ఎంట్రీ డేటా నమోదు ఎలా చెయ్యాలో ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది .ఈ ట్రైనింగ్ లో వివోఏలు మండల సమైక్య అకౌం టే ట్లు ఎలా చేయాలి? ఏ రీతిగా చేయాలి, లోకోస్ యాప్‌లో ఎలా డేటా ఎంట్రీ చేయాలి (PPT..,) ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది.. ఈ శిక్షణ తీసుకున్న వారు దొనకొండ మండలంలో సీసీలు ఎమ్మెస్ అకౌంటెంట్ జువీతి లు, దర్శి మండలంలో ఏపీఎం నజియా బేగం, ముగ్గురు సీసీలు నలుగురుVOA లు, ముళ్ళమూరు మండలంలో ఇద్దరు సీసీలు ఒక వివోఏ, కురిచేడు ఒక సి సి. శిక్షణ తీసుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో వివోఏలు సీసీలు, ఏపీఎంలు, హాజరయ్యారు.



# వైసీపీ నాయకుడు గంజి శంకర్‌రెడ్డిని పరామర్శించిన ఇన్‌ఛార్జీ దద్దాల

**కనిగిరి, మే8 , ప్రభాతవార్త**

కనిగిరి మండలం చాకిరాల పంచాయతీకి చెందిన వైసీపీ నాయకుడు గంజి శంకర్‌రెడ్డి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని ఆయనను పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్. ఈ సందర్భంగా ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సూరసాని మోహన్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, సైకం ఏడుకొండలు, ముల్లంగి శ్రీహరిరెడ్డి, గంజి వెంకటేశ్వరరెడ్డి, రామణ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



**కొనకనమిట్ల, మే 8, ప్రభాతవార్త**

మండలంలోని చినమనగుండంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ శిఖర,కలశ ప్రతిష్ఠోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి.యంత్రాభిషేకం, గర్తన్యాస, రత్నాన్యాస బీజన్యాసాలు పూజలు చేశారు. ఉదయం 9.44 గంటలకు మహాయంత్ర శిఖర కలశ ప్రతిష్ఠలు జరిగాయి. శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, మహా గణపతి, నందీశ్వర, సిద్దమూర్తి, సుబ్రహ్మణ్య స్వామి, జంట నాగేంద్ర స్వామి, అభయాంజనేయస్వామి, పోలేరమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠ వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతిష్ఠాచార్యులు పండిత ప్రసాద దైవజ్ఞనశర్మ ఆధ్వర్యంలో వేదపండితులచే ఈ ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 6 నుంచి ప్రారంభమయ్యాయి. మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తుల విగ్రహాలు ప్రతిష్ఠ అనంతరం గ్రామస్తులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఎత్తున నిర్వహించారు.




# ఏపీలో కొత్త రేషన్

**దొనకొండ,మే 8,ప్రభాతవార్త**

కార్డులు.. దరఖాస్తుకు నెల రోజులు గడువు..బుధవారం నుంచి రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరిస్తామన్న మంత్రి నాదెండ్ల మనోహర్, కొత్త కార్డులు, మార్పులుచేర్పులు, చిరునామా మార్చుకోవచ్చని వెల్లడికొత్త రేషన్ కార్డుల జారీ ఈకేవైసీ కోసం ఆలస్యం అయ్యిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం నుంచి (మే 7వ తేదీ) రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. కొత్త కార్డులు జారీ, రేషన్ కార్డులు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 3.28 లక్షల దరఖాస్తులు రేషన్ కార్డు మార్పు కోసం వచ్చాయని తెలిపారు.నెల పాటు కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చు: స్మార్ట్ రేషన్ కార్డు, క్యూ ఆర్ కోడ్‌తో జారీ చేస్తామన్నారు. కుటుంబసభ్యుల పేర్లు అన్నీ చక్కగా కనిపించేలా స్మార్ట్ కార్డు జారీ ఉంటుందని మంత్రి వెల్లడించారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా రేషన్ తీసుకున్న వివరాలు కనిపించేలా ఉంటుందన్నారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. ఒక నెల పాటు కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.వచ్చే నెల నుంచే స్మార్ట్ కార్డులు: గ్రామ వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. 4.24 కోట్ల మందికి స్మార్ట్ కార్డు జారీ అవుతుందని అన్నారు. జూన్ మాసం నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయన్నారు. ప్రస్తుతం 95 శాతం మేర ఈకేవైసీ పూర్తి అయ్యిందని, ఈకేవైసీ పూర్తి అయిన వాళ్లు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అన్నారు.వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు: వాట్సప్ గవర్నెన్స్ ద్వారాను ఈ నెల 12వ తేదీ తర్వాత దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రేపటికి పూర్తి వివరాలు అందుతాయని తెలిపారు. అకాల వర్షంతో రైతులకు పంట నష్ట పరిహారం అందరికీ అందజేస్తామన్నారు. ఇప్పటి వరకూ 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడంచారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు



**కనిగిరి, మే 8, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణానికి చెందిన విద్యుత్ లైన్‌ఇన్‌స్పెక్టర్ యేలం వెంకటయ్య కుమారుడు యాదగిరీష్, భానుశ్రీల వివాహ వేడుక గురువారం కనిగిరిలోని పవిత్ర ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం వైసీపీ పార్లమెంటు పరిశీలకులు కదిరి బాబురావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

# వెంకటరెడ్డిని పరామర్శించిన కదిరి బాబురావు



**కనిగిరి, మే 8, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు గురువారం కనిగిరిలోని కొత్తూరులో వెంకటరెడ్డి నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆరోగ్య పరిస్థితులు తెలుసుకొని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వింగ్ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని సుజాత, మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్, రాముమరెడ్డి, ముత్యాల ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# పుస్తక పఠనం ద్వారా తేలికగా విద్యాభివృద్ధి



**సంతనూతలపాడు, మే 8, ప్రభాతవార్త**

ప్రతి ఒక్క విద్యార్థి పుస్తక పఠనం చేస్తే తేలికగా విద్యాభివృద్ధి చెందునని పోలేరమ్మ ఆలయ అర్చకులు పి.శివరామకృష్ణ పేర్కొన్నారు. సంతనూతలపాడులోని గ్రంథాలయంలో గురువారం జరుగుతున్న విద్యార్థుల వేసవి శిక్షనా తరగతుల్లో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినీ, విద్యార్థులకు కథలు చెప్పించడం, వినిపించడం చేపట్టారు. గ్రంథాలయాల్లో గల పుస్తకాలను చదివితే ముఖ్యంగా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలరని అర్చకులు శివరామకృష్ణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రంథపాలకులు కే.సత్యనారాయణ అధ్యక్షత వహించారు.

## మాజీ సర్పంచ్ మానం గురవయ్యను పరామర్శించిన దారపనేని



**కనిగిరి, మే 8, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు మాజీ సర్పంచ్, తూర్పు కోడిగుడ్లపాడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మానం గురవయ్యను గురువారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరామర్శించారు. ఇటీవల కొంత అస్వస్థతకు గురైన గురవయ్య విజయవాడలోని కార్పొరేట్ వైద్యశాలలో మెరుగైన వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో స్వగ్రామానికి తిరిగి వచ్చారు. దారపనేని, మానం గురవయ్య స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై సమాచారం అడిగి తెలుసుకుని ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. మిరియం సుబ్బరాయుడు, దారపనేని నరసింహారావు, మానం వెంగళరావు, బొడ్డు రవి, నాగం నాగరాజు తదితరులు మానం గురవయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## పాపసాని వారి కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, మే 8, ప్రభాతవార్త**
కనిగిరి కనకపట్నంలోని పాపసాని సుబ్బారెడ్డి-విజయలక్ష్మి దంపతుల కుమార్తె సాయిశ్రీ విద్య వివాహ గురువారం సాంప్రదాయబద్ధంగా హర్షాతిరేకంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిధిగా హాజరైన కనిగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణయాదవ్ వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలానీ, చింతం శ్రీను, ఆవుల భాస్కర్‌రెడ్డి, మండాది కృష్ణారెడ్డి, గోపవరపు బొర్రారెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, గొబ్బిల్ల శ్రీను, శివరామరెడ్డి, దాసరి మురళీ, మిట్ట రమేష్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, దామిరెడ్డి నాగేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన టీడీపీ రాజకీయ శిక్షణ తరగతులు

### - పార్టీ ఆశయాలపై నేతలకు లోతైన అవగాహన



**కనిగిరి, మే 8, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయి. పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ శిక్షణ కార్యక్రమం ఒక నియోజకవర్గాన్ని కేంద్రంగా తీసుకొని నిర్వహించబడింది. ఈ శిక్షణలో పాల్గొన్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ నిర్మాణం, చరిత్ర, ఆశయాలు, ప్రజా పోరాటాలు, విజన్ 2047, లీడర్ షిప్ అండ్ గుడ్ గవర్నెన్స్, సోషల్ మీడియా ప్రాధాన్యత వంటి అంశాలపై లోతుగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, వేపాడ చిరంజీవిరావు తదితరులు పాల్గొని శిక్షణ సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. నియోజకవర్గాల వారీగా నాయకుల అభిప్రాయాలను తీసుకొని, రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు పార్టీ కార్యచరణ రూపొందిస్తోంది. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే దిశగా ఈ శిక్షణ తరగతులు కీలపాత్ర పోషించనున్నట్లు నేతలు అభిప్రాయపడ్డారు.

## పోరాట యోధుడు ముప్పవరపు వీరయ్య చౌదరి

### - ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్






**నాగులుప్పలపాడు, మే 8, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ కార్యకర్తగా పార్టీలో అంకిత భావంతో పని చేస్తూ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో నేను సైతం అంటూ పోరాట పటిమను కనపరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన నేత ముప్పవరపు వీరయ్య చౌదరి అకాల మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఒంగోలు శాసనసభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు అమ్మనబ్రోలు గ్రామంలోని ముప్పవరపు వీరయ్య చౌదరి దశదినకర్మకు దామచర్ల హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన సభకు మండల పార్టీ అధ్యక్షులు మనోజ్‌కుమార్ అధ్యక్షులు వహించారు. ముందుగా కుటుంబ సభ్యులను ఓదార్చి అనంతరం ఆయన మాట్లాడుతూ హత్యా రాజకీయాలకి తెలుగుదేశం పార్టీలో స్థానం లేదని, 20 సంవత్సరాలు తర్వాత ఒంగోలులో మళ్లీ హత్య రాజకీయాలు మొదలయ్యాయని ఇక మీదట జరగకూడదని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు తెలిపినట్లు దామచర్ల తెలిపారు. హత్య కేసు పూర్తి చేసి నిందితులను గుర్తించాలని పోలీసు శాఖ కోరారు. ఒకటి రెండు రోజుల్లో హత్య కేసులో పాత్రలు సూత్రదారాలు పోలీసులు పత్రికల ముందు ప్రవేశపెడతారని సభా ప్రాంతంలో తెలిపారు.

**అమ్మనబ్రోలులో జన జాతర :**
ముప్పవరపు వీరయ్య చౌదరి పెద్దకర్మలో మండల ప్రజలే కాక జిల్లాలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. దీంతో అమ్మనబ్రోలు జనజాతరగా మారింది. భారీ బందోబస్తుతో పోలీసులు ముందస్తు ప్రణాళికలతో జాగ్రత్తలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్యక్రమం జరిగింది. అదే విధంగా అమ్మనబ్రోలులో మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబును ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, బీఎన్ విజయ్‌కుమార్‌లు పరామర్శించారు. ముప్పవరపు వీరయ్య చౌదరి పెద్దకర్మలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, గొట్టిపాటి లక్ష్మీ, బాలాజీ, దామచర్ల సత్య, లంక దినకర్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎస్సై కమలాకర్



**ముండ్లమూరు, మే 8, ప్రభాతవార్త**
ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మీ యొక్క ఫోన్లకు తెలియని వారు ఫోన్ చేసి మీకు లాటరీలో డబ్బులు వచ్చాయని ఓటీపీ చెప్పమని అడిగి ఓటీపీ చెప్పగానే మీ ఖాతాలోని నగదును దోచేస్తారని అలాంటి మోసాలను నమ్మి తెలియని వారికి ఓటీపీలు చెప్పవద్దని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కమలాకర్ ప్రజలకు సూచించారు. మండలంలోని మారెళ్ళ గ్రామంలో గురువారం గ్రామస్తులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కారు నడిపేవారు సీట్ బెల్టు తప్పనిసరిగా వినియోగించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహ శుభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్



**దర్శి, మే 8, ప్రభాతవార్త**
దర్శి మండలం బట్టువారిపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు పూజల యోగయ్య- సుబ్బులు కుమారుని వివాహ శుభ కార్యక్రమానికి టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొని వరుడును ఆశీర్వదించారు. వారితో పాటు నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, బట్టువారిపల్లి గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆనాటి నారధుడి ప్రతిష్ఠ - నేడు ప్రసన్న స్వరూపుడైన మల్లవరం వెంకటేశ్వరుడు

### - విద్యుత్ దీప అలంకరణతో మల్లవరం దేవస్థానం - స్థల పురాణము- ప్రాముఖ్యత

### - వంశవారిపరంగా- స్వామివారికి ప్రత్యేక సేవలు - గరుడ ముద్దా ప్రసాదంతో అనేక మందికి సంతానం






**మద్దిపాడు, మే 8, ప్రభాతవార్త**
శరణు అన్నంతనీ ముసలిని చంపి గజేంద్రుని కాపాడిన కరుణానిధి ఎక్కడ వెతికితే అక్కడే ఉన్నందుకే స్తంభం నుంచి ఆవిర్భవించి హిరణ్యకస్కుడు అంతం అందించి ప్రహ్లాదుడి మాటను నిలబెట్టిన విశ్వాస పాత్రుడు అన్నా అని పిలవగానే ఉలవలనిచ్చి నిండు సభలో ద్రౌపది మన రక్షణ గావించిన ఆదిదేవుడు శ్రీ మహావిష్ణువు ఈ కలియుగంలో భక్తులు రక్షించేందుకు శ్రీ వెంకటేశ్వరునిగా అవతరించారు. అటువంటి కలియుగ ప్రత్యక్ష దేవుడు ఆర్తితో పిలిస్తే పలికే దేవుడు అందుకే ఆపద్బాంధవుడు ఆపదమొక్కులవాడు భక్తుల కొంగుబంగారం తెలుగువారి ఇలవేల్పు కలల పందిరి అయిన శ్రీ మల్లవరం వెంకటేశ్వరస్వామి ప్రధానక్షేత్రం తిరుమలైన తెలుగు నేల నలుచెరుగుల ప్రధానమైన కొలువుదీరి ఆరాధన అందుకుంటున్న ప్రసన్న స్వరూపుడు మల్లవరం వెంకటేశ్వరుడు.. భక్తులకు దివ్య అనుగ్రహాన్ని ప్రసాదిస్తున్నడు.. స్వామివారు సాక్షాత్తు నారద మహాముని కొలిచిన నారాయణుడని పురాణాలు ఘోషిస్తున్నాయి స్వామి రూపం ప్రసన్న హృదయం ప్రసన్నం చేతులు జోడించి మూల విరాట్ ముందు నిలబడగానే చింతలు చికాకులు తొలగిపోయిన భక్తజనులు మనసులు ప్రసన్న ఆనంద స్వరూపుడు మల్లవరం వెంకటేశ్వర స్వామి సమక్షంలో అనేకం ప్రసన్నమే ఎన్నో పురాణాలు ప్రస్తావిస్తున్నాయి. ప్రాచీన వైష్ణవ క్షేత్రం ఇది స్థల పురాణం ప్రకారం ఒక సారి భూలోకంలో విహరిస్తున్న శ్రీనివాసుడు విశ్రాంతి తీసుకోవాలని ఆలోచించి స్థానికంగా ఉన్న తమ్మవరం కొండ వద్దకు వెళ్లడంతో స్వామి నిన్ను భరించే శక్తి నాకు లేదంటూ క్షమించు అంటూ శరణ వేడుకోగా ఆ సంభాషణ విన్న మల్లవరం గిరి తనపై సేద తీరని సప్తగిరి శ్వరుడుని ఆహ్వానించిందట ఆ భక్తికి మెచ్చిన శ్రీనివాసులు ఓ వరం కోరుకోమన్నాడట నీ తేజే అంశ ఇక్కడే నెలకొల్పు తండ్రి వేడుకుందట స్వామి ప్రేరుతో అనుగ్రహించాడు. ఆ తర్వాత కొంత కాలానికి లోకసంచారం చేస్తున్న నారధుడు స్వామి తేజాన్ని దర్శించుకుని తరించిపోయారు. సామాన్య భక్తులకు కూడా స్వామి వారి దివ్య స్వరూపం కనిపించాలన్న సంకల్పంతో కొండమీద వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రతి రాత్రి ముక్కోటి దేవతలు దిగివచ్చి శ్రీనివాసుని పూజించుకుంటారని స్థల పురాణం.. గుండ్లకమ్మ నది గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు స్కంద పురాణంలో ప్రస్తావన ఉంది. కవిత్వంలో ఒకరైన ఎర్రప్రగడ ఉత్తర హరివంశ పీటికలో మల్లవరం క్షేత్ర వైభవాన్ని వర్ణించారు. అంచలంచలగా అభివృద్ధి, శ్రీకృష్ణదేవరాయులు మల్లవరం శ్రీనివాసులుని దర్శించుకుని దేవాలయ నిర్మాణం చేసినట్టు పెద్దలు చెబుతారు. అద్దంకి సీమను పాలించిన రెడ్డి రాజులు స్వామివారికి మాన్యాలు ఇచ్చారు. ఓ శాసన ప్రకారం కోమటి వేమారెడ్డి క్రీస్తు శకం 1277 లో స్వామి కైంకర్ అన నిమిత్తం మల్లవరం గ్రామాన్ని దానం చేశారు. వేమారెడ్డి భార్య అన్నమాంబకు కొమరయ్య వేమయ్య దొడ్డయ్య అన్నమయ్య మల్లయ్య ఐదుగురు పుత్రులు కాగా వారిలో సైన్యాధిపతి అయిన మల్లారెడ్డి పేరిట మల్లవరం దొడ్డరెడ్డి పేరిట దొడ్డవరం వేమారెడ్డి పేరిట వెల్లంపల్లి గ్రామాలు ఏర్పడ్డట్టు పెద్దలు చెప్తారు. ఒకప్పుడు చిన్నదిగా ఉన్న మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ చక్కటి రాజగోపురం కళ్యాణ మండపం గరుత్మంతుడు హనుమంతుడు పెద్ద విగ్రహాలు ఏర్పడ్డాయి. ఆలయం చుట్టూ పచ్చని పచ్చిక కనువిందు చేస్తుంది. సాహితీ సేవ ఎంతో మంది కవులు ప్రసన్న స్వరూపుడు శ్రీ మల్లవరం వెంకటేశ్వరస్వామి వారికి అక్షరార్చన చేశారు. అహోబిలం పేరుతో సంస్కృత వ్యాకరణ గ్రంధం రాసిన గాలి నరసయ్య దేవదేవుని సాహిత్య సేవలో తరించారు. 1845 లో ముక్తినూతలపాటి సీతారామయ్య కవీంద్రుడు మల్లవరం వెంకటేశ్వరస్వామిపై సూర్ణికలు రాశారు. వావిలాల రామ్మూర్తి కవి మల్లవరం వెంకటేశ్వరస్వామి పై శతకం రచించారు. ఆలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిపై వావిలాల జాలయ్య అనేక కీర్తనలు అల్లారు. ఎన్నో విశిష్టతలు.. శ్రీశైలంలో పాతాళ గంగకు అహోబిలం లక్ష్మీ లక్ష్మీనరసింహ స్వామి మల్లవరం వెంకటేశ్వరస్వామికి ఒకే సారి ఆలయాలకు రెడ్డి రాజులు మెట్లు నిర్మించినట్లు చరిత్ర వెల్లడిస్తుంది. పాతకాలంలో సూర్యకిరణాలు స్వామివారి పాదపద్మములో తాకుతాయి. 12 మంది ఆల్వాళ్ళు కొలువుదీరి ఉన్నారు. అందుకే ఈ క్షేత్రాన్ని రెండవ తిరుపతిగా పిలుస్తారు. విశేష వాహనాలు కళ్యాణ మహోత్సవం తెప్పోత్సవం చక్రస్నానం స్వామివారి బ్రహ్మోత్సవాలు తిరుపతిని తలపిస్తుంది. అమ్మవారు ఆలయం బయట ఉన్న విశ్వకేశన శ్రీ లక్ష్మీ పద్మావతి అమ్మవారి ఆలయంను 2008న నిర్మించారు. పద్మావతమ్మకు ప్రతి శుక్రవారం ఘనంగా అభిషేకాలు చేస్తారు. పౌర్ణమి రోజు అమ్మవారి వెండి కలశాన్ని లోని కంకణాలను ముంజేతికి కడతారు. దీని వల్ల సకల శుభాలు కలగజేస్తుందని నమ్మిక.. అమ్మవారి కుడి పాదం భక్తజనానికి దర్శనం నమ్మిక.. అమ్మవారి కుడి పాదం భక్తజనానికి దర్శనం ఇవ్వడం ప్రతీతి. మల్లవరం క్షేత్రం ఆధ్యాత్మికం. పర్యాటకం, భక్తులుకు కనువిందు చేస్తుంటాయి.

**ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం :**
మండల పరిధిలోని మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభించారు. అంకురాలరోహణము కార్యక్రమంలో భాగంగా ప్రధాన అర్చకులు నారాయణ వెంకటాచార్యులు, నారాయణ రాజశేఖరాచార్యులు, పొన్నం వంశస్థులు గుడికి దగ్గరలోనే మేళ తాళాల భజంత్రీలతో బంగారాన్ని తీసుకొని వచ్చారు. అనంతరం యాజ్ఞకం, ఆగమ ఎగ్జామినార్, దీవి వెంకటాచార్యులు, మరి కొందరు పురోహితులు తీసుకొని వచ్చినటువంటి పుట్ట బంగారంతో నాగదేవత అమ్మవారిని



రూపము దాల్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దాతలు అయినటువంటి ఒంగోలు నగరానికి చెందిన దండే శ్రీనివాసరావు, ధర్మపత్ని కవిత కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామిని మల్లెపూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పాటుగా అజస్ర దీపారాధన, దీక్షారాధన, మృత్యుం గ్రహణము కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం ఉదయం 10గంటలకు పుణ్యాహం, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు శుద్ధి, నిత్య హోమము, ధ్వజారోహణ సమయంలో చుట్టు పక్కల గ్రామాలలో సంతానం లేనటువంటి వారు మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే గరుడ ముద్దను అర్చక స్వాముల వారు స్తంభం వైపు విసిరేక్రమంలో ఆ ప్రసాదం అందుకున్నటువంటి దంపతులకు తప్పనిసరిగా సంతానం కలుగుతుందనే నమ్మకంతో ఆ ప్రసాదాన్ని అందుకుంటారు. గరుడ ముద్దు తిన్నటువంటి దంపతులకు సంతానం తప్పక కలుగుతుందని నమ్మకం కొన్ని సంవత్సరాల నుంచి వస్తున్నటువంటి ఆచార నమ్మకం అనిఆలయ ప్రధానఅర్చకులు నారాయణ వెంకటాచార్యులు తెలిపారు. అల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి గురువారం రాత్రి మల్లవరం గ్రామపురి వీధుల నందు శేష వాహనంపై విహరించనున్నారు. వెల్లంపల్లి ఆర్యవైశ్య సంఘం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వాహన సేవను నిర్వహిస్తారు. స్వామివారి సేవలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ వెంకటాచార్యులు, రాజశేఖర్ చార్యులు, దండే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు, పొన్నం వెంకటేశ్వర్లు, పొన్నం అయ్యప్ప, నారుపెద్ది వరహాల చౌదరి, మల్లవరం పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రోత్ సెంటర్లో వరసిద్ది వినాయక విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం





**మద్దిపాడు, మే 8, ప్రభాతవార్త**
మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ధ్వజ,యంత్ర, గుడి శేఖర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠ మహోత్సవకార్యక్రమానికి గ్రోత్ సెంటర్లోనే పారిశ్రామిక యజమానులు సహకారంతో నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవ కార్యక్రమం పిఠాపురం వాస్తవ్యులు వేద మూర్తులైన ఇంజమూరి అచ్యుతానంద శర్మ అవధానిచే గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాశనం, అఖండ దీపారాధన,గోపూజ గత మూడు రోజుల నుంచి నిర్వహించారు. సోమవారం నాడు గణపతి పూజా పుణ్యాహ వచనం, గర్త న్యాసం, నవరత్న న్యాసం నిర్వహించారు. మంగళవారం, బుధవారం నాడు వాహనం, అంగ హోమమలు యాగశాల, బలిహారము కార్యక్రమాలునిర్వహించారు. గురువారం నాడు యంత్ర, ధ్వజ, శిఖర, వరసిద్ధి వినాయక స్వామి దివ్యప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, గోదిష్టి, కుంభం పోయుట, అనంతరం విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, విగ్రహ దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, మహా న్యూస్ టీవీ చైర్మన్ మారెళ్ళ వంశీ,మండలపార్టీ అధ్యక్షులు మండవ జయంతిబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ నిర్వహణ కమిటీ తరుపున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మండవ రంగారావు, మండవ గోపిచంద్, పోకూరి శ్రీనివాసరావు, చింతల శ్రీనివాసరావు, చెరుకూరి వాసు, ముళ్ళూరి మురళి, రావి నరసింహారావు, పారా నరసింహారావు, తుమ్మల సుధాకర్, ముత్తనపల్లి రామలింగయ్య, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, రావి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రభలపై ప్రసంగించిన ఎమ్మెల్యే వైసీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి




**దర్శి, మే 8, ప్రభాతవార్త**
దర్శి మండలంలోని బొట్లపాలెం గ్రామంలో బ్రహ్మంగారి తిరునాళ్ళ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభపై ప్రసంగించిన ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పార్టీ కోసం ప్రకాశం జిల్లా వైసీపీ కార్యకర్తల కోసం ఎందాకైనా పోరాడతానని వారికి అండగా ఉంటానని ఎన్ని అడ్డంకులు వచ్చినా వైసీపీ పార్టీని వీడేది లేదని అన్నారు. ఈ సందర్భంగా బూచేపల్లిని వైసీపీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, బొట్లపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం




**దర్శి, మే 8, ప్రభాతవార్త**
శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం సందర్భం గా గత రాత్రి దొనకొండ మండలం అరవల్లి పాడు గ్రామం లో బ్రహ్మంగారి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై, కోలాట ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, వారితోప ఆటు మాజీ శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ మండల టీడీపీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి తదితర నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ తెలుగుదేశానికి అండదండగా ఉన్న ఆరవల్లిపాడు గ్రామ ప్రజల అభిమానాన్ని మర్చిపోను, మీ కుటుంబ బిడ్డగా, మీ బిడ్డగా, మీ తోగుట్టుగా నన్ను ముందుండి నడిపిస్తూ నాకు బలాన్ని చేకూర్చారు, మీ ఆదరాభిమానాన్ని నేను మర్చిపోను నీకు నేను ఎప్పుడూ అండగా ఉంటాను. దొనకొండను అభివృద్ధి ప్రాంతంగా మార్చేందుకు కట్టుబడి పని చేస్తాను, వలసలను నివారిస్తాను, ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తాను, అందులో భాగంగానే సోలార్ పార్కు ఈ ప్రాంతానికి త్యాగలిగాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మాత్యులు నారా లోకేష్ బాబు, ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతో పాలన సాగిస్తున్నారు.



రారష్ట అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యకర్తల బలమే నా బలగం కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు, కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరవల్లిపాడు గ్రామంలోని టీడీపీ నాయకులు, దొనకొండ మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## వీరయ్య చౌదరి సంస్మరణ సభలో పాల్గొన్న టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, మే 8, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన బాపట్ల పార్లమెంట్ అధికారి ప్రతినిధి, మాజీ మండల ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి సంస్మరణ సభకు హాజరై శ్రద్ధాంజలి ఘటించి, నివాళులర్పించిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఉన్నారు.

09-5Pg5exJ.qxd:09-5Pg5exJ.qxd 09/05/25 11:19 PM Page 1



# ఉగ్రస్థావరాలను మట్టుబెట్టాం



## క్షిపణి వ్యవస్థలను ధ్వంసంచేసాం

### అఖిలపక్ష సమావేశంలో నాయకులకు వివరించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ, మే 8:** పాకిస్తాన్‌లో ఉగ్ర స్థావరాలను ధ్వంసంచేసిన తర్వాత లాహోర్‌లోని క్షిపణి డిఫెన్స్ వ్యవస్థను సైతం ధ్వంసం చేసిన భారత రక్షణరంగ కార్యాచరణను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష సమావేశంలో విపక్షాలకు వివరించారు. గురువారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీల నాయకులకు ఆపరేషన్ సింధూర్ వివరాలను వెల్లడించారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై జరిగిన దాడులు, పివోకేలో జరిగిన దాడుల వివరాలను వివరించారు. సమావేశంలోనే 100 మందికిపైగా ఉగ్రవాదులను హతమార్చినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని, పాకిస్థాన్ మళ్లీ దాడులకు పూనుకుంటూ భారత్ పరంగా ఈసారి మరింత తీవ్రంగా ఉంటుందని వెల్లడించారు. పాకిస్థాన్ ముందురోజు సరిహద్దులవెంబడి చేసినకాల్పుల్లో అమాయకులైన 16 మంది చనిపోయారని కూడా రాజ్‌నాథ్ వివరించారు. దీనితో లాహోర్‌లో ఉన్న క్షిపణి వ్యవస్థల నిల్వకేంద్రాన్ని ధ్వంసంచేసామని వివరించారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌పై జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయ సాధనకోసమే ఈసమావేశం నిర్వహించామని, పార్టీల నాయకులందరూ కూడా ఒకే మాటపై ఉన్నారని వివరించారు. అంతేకాకుండా దేశపౌరుల రక్షణ, భద్రతపైనా కొందరునేతలు ఆందోళన వ్యక్తంచేసారని, ప్రత్యేకించి సరిహద్దుల్లో ఉన్న ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెపుతూనే జాతిమొత్తం ప్రభుత్వానికి అండగా నిలుస్తుందని, ఉగ్రవాదంపై పోరులో దేశం మొత్తం సమైక్యంగా నిలుస్తుందని చెప్పారని కేంద్ర మంత్రి వివరించారు. కేవలం ప్రభుత్వాల ఏర్పాటుకోసం మేం రాజకీయాలు చేయబోమని జాతినిర్మాణంకోసం కృషిచేస్తామని చెప్పారు. ఇదొక కొనసాగుతున్న కార్యాచరణ అని అందువల్ల సాంకేతిక వివరాలను అందించలేమని ఆపరేషన్ సింధూర్ ఇకపైనా కొనసాగుతుందని అన్నారు. సైనిక కార్యాచరణలో ఉన్నందువల్లనే సాయుధ దళాల అధికారులు ఈసమావేశంలో పాల్గొనలేకపోయారని మంత్రి వివరణ ఇచ్చారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గేలు సమావేశం తర్వాత మాట్లాడుతూ ప్రభుత్వానికి ఉగ్రవాద నిర్మూలన కార్యాచరణలో సంపూర్ణ మద్దతునిస్తామని చెప్పారు. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు నిస్తున్నామని కొన్ని అంశాలను లేవనెత్తాలని భావించినా ఇది సందర్భం కాదని వాటిజోలికి వెళ్లలేదన్నారు. మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేయడంలో సాయుధదళాలు విశేష కృషిచేసాయని ప్రశంసించారు. టిఆర్‌ఎఫ్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోకూడా టిఆర్‌ఎఫ్‌ను నిషేధిత సంస్థగా ప్రకటించాలని డిమాండ్‌చేయాలని సూచించారు. అఖిలపక్ష సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, జైశంకర్, జెపినడ్డా, నిర్మలా సీతారామన్‌లు ప్రభుత్వం తరపున హాజరయ్యారు. కాంగ్రెస్‌నుంచి రాహుల్‌గాంధీ, ఖర్గే, టిఎంసి నుంచి సందీప్ బందోపాధ్యాయ్, డిఎంకెనుంచి టిఆర్‌బాలు వంటిప్రముఖులు పాల్గొన్నారు. ఇతరత్రా సమాజ్‌వాదిపార్టీనుంచి రామ్‌గోపాల్ యాదవ్, ఆప్‌నుంచి సంజయ్‌సింగ్; శివసేన థాకరేనుంచి సంజయ్‌రౌత్, ఎన్సీపీ పవార్ విభాగంనుంచి సుప్రియా సూలే, బిజెడినుంచి సస్మిత్‌పాత్రా, సిపిఎంనుంచి జాన్ బ్రిట్టాస్‌లు పాల్గొన్నారు. అలాగే జెడియు నుంచి సంజయ్ ఝూ, కేంద్ర మంత్రి ఎల్జేపీ అధినేత చిరాగ్ పాశ్వాన్‌లు కూడా వచ్చారు.



## లాహోర్ పరిసరాల్లో భారత్ క్షిపణి దాడి

### భీతిల్లి పరుగులు తీసిన పాక్ ప్రజలు

**న్యూఢిల్లీ, మే 8:** సరిహద్దుల్లో ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ కాల్పులకు తెగబడుతున్న పాకిస్తాన్‌కు భారత్ రక్షణ దళాలు గట్టిగానే బుద్ధిచెప్పాయి. లాహోర్‌లోని క్షిపణి వ్యవస్థల కేంద్రాన్ని ధ్వంసంచేసి సత్తాచూపించాయి. జమ్ముకాశ్మీర్, పంజాబ్, గుజరాత్‌లలో దాడులకు ఉపక్రమించేందుకు పాకిస్తాన్ కుట్రలుచేస్తున్నట్లు సమాచారం పసిగట్టిన కేంద్రం ఉత్తర భారత్‌లోని 15 నగరాలు, దేశంలోని పశ్చిమ ప్రాంత నగరాల్లోను దాడులకు పన్నాగం చేస్తున్నట్లు తెలియడంతో వెంటనే అప్రమత్తం అయింది. పాకిస్తానీ ఎయిర్ డిఫెన్స్ రాడార్లు, క్షిపణి వ్యవస్థలే లక్ష్యంగా దాడులుచేసింది. లాహోర్‌తోపాటు మరికొన్ని ప్రాంతాల్లోని పాక్ రక్షణ వ్యవస్థలు టార్గెట్‌గా ధ్వంసంచేసింది. భారత్‌లో కీలకంగా ఉన్న శ్రీనగర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, లూథియానా, చండీఘర్ ఇతర ప్రాంతాల్లో పాకిస్థాన్ దాడులుచేయడంతో భారత్ ప్రతిగా లాహోర్ పరిసరాల్లో దాడులుచేసింది. అదే స్థాయిలో, అదే తీవ్రతతో భారత రక్షణ దళాలు దాడులుచేసినట్లు భారత ఆర్మీ ప్రకటించింది. భారత్ ఇజ్రాయిల్ సహకారంతో తయారయిన హార్పీడ్రోన్లను పాక్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేసేందుకు వినియోగించింది.

భారత్‌లోని రావల్పిండి క్రికెట్ స్టేడియంపైనా దాడిచేయడంతో మ్యాచ్‌ను కరాచికి మార్చివేసారు. అలాగే భారత నగరా లను టార్గెట్ చేసిన పాక్ ఎయిర్‌డిఫెన్స్‌లను ధ్వంసంచేసేందుకు రష్యా తయారీ ఎస్ 400 క్షిపణి వ్యవస్థలను వినియోగించింది. భారత క్షిపణి వ్యవస్థలను పాకిస్థాన్ రాడార్లు గుర్తించలేక పోయాయి. పెషావర్ జల్మి, కరాచికింగ్స్ మధ్య జరిగే మ్యాచ్‌ను అత్యవసరంగా మారిన దీనితో ఇపుడు పాకిస్థాన్‌లోని కీలక నగరాల్లో ప్రజలు భయపడిపోతున్నారు. రావల్పిండి క్రికెట్ స్టేడియంలో క్షిపణి దాడి జరగడంతో పిసిబి నిర్వహిస్తున్న మ్యాచ్‌ను కరాచి స్టేడియంకు మార్చివేసారు. ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్తాన్‌లో వణుకు బయలుదేరింది.

## నిఘా వ్యవస్థ పటిష్టతకు ఇస్రో 52 ఉపగ్రహాలు

**న్యూఢిల్లీ, మే 8:** నిఘా సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా భారత్ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే వచ్చే ఐదేళ్లలో ఇస్రో 52 నిఘా ఉపగ్రహాలను భూకక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్, ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్) ఛైర్మన్ పవన్ కుమార్ గోయెంకా పేర్కొన్నారు. ఢిల్లీలో బుధవారం జరిగిన గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ 2025 కార్యక్రమంలో ఈ మేరకు వెల్లడించారు. అంతరిక్ష ఆధారిత నిఘా వ్యవస్థ విషయంలో భారత్ ఇప్పటికే బలమైన సామర్థ్యాలు కలిగి ఉంది. అయితే దానిని నిరంతరం మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే రక్షణ రంగం నిఘా సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు రానున్న ఐదేళ్లలో 52 ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రైవేటు రంగాన్ని కూడా భాగస్వామ్యం చేస్తాం. భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టే 52 ఉపగ్రహాల్లో సగం ప్రైవేటు రంగం ద్వారా సమకూర్చుతుంది అని పవన్ కుమార్ తెలిపారు.

మిగిలిన ఉపగ్రహాలను ఇస్రో నిర్మిస్తుంది. ఈ ఉపగ్రహాలు శత్రువుల కదలికలను పసిగట్టేందుకు, సరిహద్దులను పర్యవేక్షించేందుకు, సైనిక కార్యకలాపాల సమయంలో సమన్వయాన్ని మెరుగుపర్చేందుకు త్రివిధ దళాలకు సాయపడతాయి. అయితే ఈ నిఘా సామర్థ్యాల పెంపు నిర్ణయాలు కేంద్ర హోంశాఖ, రక్షణశాఖ చేతుల్లోనే ఉంటాయి అని పవన్ కుమార్ గోయెంకా పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ఈ సామర్థ్యాలు అవసరం మరోవైపు, ఇస్రో తన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ) సాంకేతికతను ప్రైవేటు రంగానికి బదిలీ చేసే ప్రక్రియలో ఉందని పవన్ కుమార్ గోయెంకా ఉన్నారు. అదే తక్కువ సమయంలో భూ దిగువ కక్ష్యలోకి చిన్న ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ఎస్ఎస్ఎల్‌విని అభివృద్ధి చేశారు.

ఇవి 10 కిలోల నుంచి 500 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కి.మీ వరకు కక్ష్యకి ప్రవేశపెట్టగలవు. అత్యవసర సమయాల్లో రక్షణ బలగాలకు ఈ సామర్థం అవసరం అవుతుంది. ఎస్ఎస్ఎల్‌వీ సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి సమయం ఆసన్నమైందని, మరికొద్ది రోజుల్లోనే దీనిపై కూడా ప్రకటన వెలువడే అవకాశం ఉందని గోయెంకా తెలిపారు.

## ఆపరేషన్ సిందూర్‌కు గంగా హారతి



**రిషికేశ్, మే 8:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌పై భారత ఆర్మీ మెరుపు దాడులు జరపడంపై యావత్ దేశం గర్వంతో ఉప్పొంగిపోతోంది. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సేవలను కొనియాడుతోంది. అయితే రిషికేశ్‌లోని అధ్యాత్మిక కేంద్రం పరమార్థ నికేతన్ బుధవారం సాయంత్రం గంగా హారతిని 'ఆపరేషన్ సిందూర్'కు అంకితం చేసింది. రిషికేశ్‌లోని పరమార్థ నికేతన్‌లో జరిగిన గంగా హారతిని భారత దేశ దృఢ సంకల్పం, అసాధారణ సైనిక పరాక్రమం, వ్యూహాత్మక ధైర్యానికి అంకితం చేశారు. అలాగే భారత త్రివర్ణ పతాకాల ముందు దీపం వెలిగించి ఆపరేషన్ సిందూర్‌కు అంకితమిచ్చారు. ఈ కార్యక్రమంలో పరమార్థ నికేతన్ అధినేత స్వామి చిదానంద సరస్వతి, దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈ గంగా హారతి భారత సైన్యం తీసుకున్న చారిత్రాత్మక అడుగుకు అంకితమని పరమార్థ నికేతన్ అధినేత స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. దేశ సంకల్పం, బలం, తేజస్సుకు ఈ హారతి ఒక శ్లోకం లాంటిదని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదు, దేశ గుర్తింపు, సార్వభౌమాధికారం, ఆత్మగౌరవానికి చిహ్నంగా అభివర్ణించారు. భారతదేశ శాంతిని దాని బలహీనతగా భావించే శక్తులకు ఇదొక సందేశం. శత్రువు మన సహనాన్ని పరీక్షించకూడదు. భారత్ శాంతిని కోరుకుంటోంది. మాకు చర్చలు కావాలి. ఉగ్రవాదం కాదు. మన సహనాన్ని పరీక్షించినప్పుడల్లా, భారతదేశం అదే ఉత్సాహంతో స్పందిస్తుంది. ఆపరేషన్ సిందూర్ అనేది భారతసైన్యం తాలుక సాహసోపేతమైన ప్రతీకారం. పహల్గాంలో భారతీయులపై జరిగిన దాడి భారతదేశ ఆత్మపై జరిగిన దాడి. అది భారతమాత గుండెపై జరిగిన పాశవిక దాడి. పాక్ చేసిన దుశ్చర్యకు మన సైనికులు ప్రతీకారం తీర్చుకున్నారు. అందుకు గర్విస్తున్నాం. ఈ దాడి కేవలం ఆరంభం మాత్రమే. భారత్ ఎప్పుడూ ఎవరీ జోలికి పోదు. కానీ తమ జోలికొస్తే వదిలిపెట్టదు.

ఈ ఆపరేషన్ మన ధైర్య సైనికుల పరాక్రమం, వ్యూహం, దృఢ సంకల్పానికి నిదర్శనం అని స్వామి చిదానంద తెలిపారు. గంగా హారతి దృశ్యాలు దేశ రక్షణ కోసం యుద్ధం చేయాల్సి వస్తే అది కూడా ఒక తపస్సు లాంటిదేనని మన రుషులు చెప్పారని స్వామి చిదానంద సరస్వతి తెలిపారు. ఆపరేషన్ సిందూర్ అటువంటి యుద్ధ సాధనలలో ఒకటన్నారు. దీనిలో సమతుల్యత, శాంతి రెండూ ఉన్నాయని కొనియాడారు. భారతదేశం ఏ నేలపైనా యుద్ధాన్ని లేదా హక్కులను కోరుకోదని, కానీ తమ సార్వభౌమాధికారంపై దాడి జరిగితే కచ్చితంగా ప్రతిస్పందిస్తుందని పేర్కొన్నారు. భారత్ ఆత్మరక్షణకే ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. దేశ సంస్కృతి వసుధైక కుటుంబం లాంటిదని, కానీ భారత్ తన కుటుంబం కాపాడుకోవడానికి ఎంతవరకైనా వెళ్లగలదన్నారు



## జస్టిస్ ఎన్వీ రమణ ప్రజల న్యాయమూర్తి

### జస్టిస్ గవాయి ప్రశంసలు

**న్యూఢిల్లీ, మే 8:** భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను కాబోయే సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ 'ప్రజల ప్రధాన న్యాయమూర్తి'గా అభివర్ణించారు. సామాన్యులకు న్యాయాన్ని చేరువ చేయడంలో జస్టిస్ రమణ దార్శనికతను, ఆయన చేసిన విశేష కృషిని జస్టిస్ గవాయ్ కొనియాడారు. జస్టిస్ ఎన్వీ రమణ వివిధ సందర్భాల్లో చేసిన ప్రసంగాల సంకలనమైన నెరేటివ్స్ ఆఫ్ ద బెంచ్ ఏ జడ్జ్ స్పీక్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమం బుధవారం న్యూఢిల్లీలోని ఢిల్లీ హైకోర్టు ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయమూర్తులు సాధారణంగా ప్రజలతో మమేకం కారని, ఒంటరిగా ఉంటారనే అపోహను జస్టిస్ రమణ ఛేదించారని జస్టిస్ గవాయ్ అన్నారు. 'ప్రజల వద్దకు వెళ్లాలని, వారితో మమేకం కావాలని విశ్వసించిన వ్యక్తి జస్టిస్ రమణ. ఆయన నిజంగా ప్రజల భారత ప్రధాన న్యాయమూర్తి అని నేను భావిస్తున్నాను. బహుశా న్యాయమూర్తులు ప్రజల నుంచి వేరుగా ఉంటారన్న అడ్డుగోడను తొలగించిన తొలి సిజెఐలలో ఆయన ఒకరు' అని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

మే 13న ప్రస్తుత సిజెఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ అనంతరం, మే 14న సిజెఐగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ గవాయ్, తనకు, జస్టిస్ రమణకు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు మధ్య మూడు ఉమ్మడి అంశాలు ఉన్నాయని తెలిపారు. మేంముగ్గురం గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చాం. ముగ్గురం వ్యవసాయ కుటుంబాలకు చెందిన వాళ్లం. అలాగే, మేమంతా తొలితరం న్యాయవాదులం అని ఆయనవివరించారు. 2021లో జస్టిస్ రమణ సిజెఐగా ఉన్న సమయంలో ఒకేసారి తొమ్మిది మంది న్యాయమూర్తులు సుప్రీంకోర్టులో ప్రమాణ స్వీకారం చేయడం చరిత్రాత్మక ఘట్టమని గుర్తుచేశారు. ఆ రోజు ప్రమాణం చేసిన వారిలో ఒకరైన జస్టిస్ బివి నాగరత్న, భవిష్యత్తులో భారత తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఈ లక్షణాలన్నీ ఆయన తీర్పుల్లోనూ, ఈ పుస్తక రూపంలో మనముందున్న ప్రసంగాల్లోనూ ప్రతిఫలిస్తాయి అని జస్టిస్ గవాయ్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్ కూడా మాట్లాడుతూ జస్టిస్ రమణ నిత్యం సమాజ శ్రేయస్సు గురించే ఆలోచించేవారని కొనియాడారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ రమణను ప్రజా స్నేహితుడుగా అభివర్ణించారు. అనంతరం జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ కేవలం వివాదాలను పరిష్కరించే సంస్థ మాత్రమేకాదని, అది రాజ్యాంగ నైతికతకు ప్రతీక అని, సామాన్యుడికి మిగిలిన చివరి ఆశా కిరణాల్లో ఒకటని అన్నారు. తాను సిజెఐగా ఉన్న సమయంలో న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం, కోర్టు విచారణ ప్రక్రియలో భారతీయ భాషలను భాగం చేయడం, ప్రజలకు నాణ్యమైన న్యాయ సహాయం అందేలా చూడటం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ పుస్తకం న్యాయ సిద్ధాంతాలపై వ్యాఖ్యానం కాదని, విద్యార్థి నాయకుడిగా, కార్మిక సంఘ కార్యకర్తగా, పాత్రికేయుడిగా, న్యాయవాదిగా, న్యాయమూర్తిగా తాను పొందిన అనుభవాల నుంచి రూపుదిద్దుకున్న ఆలోచనల సమాహారమని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

## పంజాబ్ సరిహద్దు గ్రామాల్లో క్షిపణి శబ్దాలు

### పొలాల్లోను, ఇళ్లల్లోను పడినట్లు గ్రామస్తుల వెల్లడి



**చండీఘర్, మే 8:** సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణులు అర్ధరాత్రి 1.30 గంటలకు పంజాబ్‌ప్రాంతంలో పడటంతో ప్రజలు కొంత ఆందోళనకు గురయ్యారు. అమృత్‌సర్ బటాలా ప్రాంతంలోని జేతువాల్‌గ్రామంలో క్షిపణి ఆకారంలో ఉన్న డొల్ల సిలిండర్‌లను గుర్తించారు. పాకిస్థాన్‌తో సరిహద్దును పంచుకుంటుండటంతో పంజాబ్‌ను కేంద్రం హై అలర్ట్ రాష్ట్రంగా కేంద్రం ప్రకటించింది. పాకిస్థాన్, పీవోకేల్లోని ఉగ్రస్థావరాలను ధ్వంసంచేసిన తర్వాత తాజాగా లాహోర్‌లోని క్షిపణి వ్యవస్థ కేంద్రాన్ని కూడా ధ్వంసం చేయడంతో ఇపుడు పాక్ ఫోకస్ మొత్తం సరిహద్దు వెంబడి ఉన్న పంజాబ్, రాజస్థాన్, జమ్ముకాశ్మీర్‌లపైనే ఉన్నట్లు తెలుస్తోంది. క్షిపణితరహాలో ఉన్న ఈ సిలిండర్లు జేతువాల్‌గ్రామంలో కొన్ని చోట్ల పడి ఉన్నాయని గ్రామస్తులు ఫిర్యాదులుచేసారు. రాత్రి 1.30 గంటలు దాటిన తర్వాత ఈ పరికరాలు కనిపించాయని, అయితే ఎలాంటి ఆస్తినష్టం జరగలేదని వారు తెలిపారు. బల్‌దేవ్‌సింగ్, మఖాన్‌సింగ్ వ్యవసాయ పొలాల్లో పడి ఉన్నాయని, అయితే ఇప్పటివరకూ ఎలాంటి పేలుళ్లు సంభవించలేదని అధికారులు తెలిపారు. అయితే పోలీసులు, ఫోరెన్సిక్ విభాగం నిపుణులు ఈ క్షిపణి తరహా సిలిండర్లను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్మీ అధికారులకు కూడా వీటిపై సమాచారం ఇచ్చినట్లు సీనియర్‌పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. రాత్రి 1.30 గంటల ప్రాంతంలో అమృత్‌సర్ వాసులకు వరుసవెంబడి కాల్పులశబ్దాలు వినిపించాయని చెప్పారు. రాత్రి.1.30 గంటల తర్వాత మూడు పేలుళ్లజరిగాయని, పవిత్రనగరంలో ఈశబ్దాలతో ప్రజలు భయపడిపోయినట్లు అధికారులుతెలిపారు. అయితే జిల్లా యంత్రాంగం ఎలాంటి ఆందోళన వద్దని, భయం వలదని వెంటనే అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు వివరించింది. ఘగ్‌వాల్ గ్రామంనుంచి తెల్లటి సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణిని స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. అశోక్‌కుమార్ అనే ఇంటియజమాని ఆవరణలో పడి ఉన్నట్లు గుర్తించారు.

పేలుడు శబ్దంకూడా భారీగా వినిపించిందని, గ్రామస్తులంతా లేచి సోదాలు చేసారన్నారు. సమాచారం రావడంతో వెంటనే ఈ సిలిండర్ ఆకారంలో ఉన్న క్షిపణిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పుకార్లు, విషప్రచారాలను నమ్మవద్దంటూ ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు ప్రజలను చైతన్యపరుస్తున్నారు. బిఎస్ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు మొత్తం సరిహద్దురక్షణలో ఉన్నారని, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురయినా తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రజలకు భరోసా ఇచ్చారు. నేషనల్ హెల్‌మిషన్ డైరెక్టర్ ఈ సందర్భంగా రాష్ట్రంలోని అందరు వైద్య అధికారులకు శెలవులు రద్దుచేసారు. అత్యవసరవిధులకు సైతం సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీచేసారు. పంజాబ్‌లోని ఆరు సరిహద్దుజిల్లాలు ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్; ఫాజిల్కా, అమృత్‌షర్, గురుదాస్‌పూర్, తరన్‌తరన్‌జిల్లాల్లోని అన్ని స్కూళ్లను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.



## భారత్‌పై ప్రతీకార దాడులకు పాక్ సైన్యానికి పూర్తి స్వేచ్ఛ

### -ప్రధాని షెహబాజ్ షరీఫ్

**ఇస్లామాబాద్, మే 8:** భారత సైనిక దాడులకు స్పందనగా తమ దేశ సాయుధదళాలు ప్రతీకార దాడులుచేసే అధికారం ఉందని పాకిస్థాన్ జాతీయ భద్రతా మండలి ప్రకటించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన జాతీయ భద్రతా మండలి సమావేశంలో ఈనిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో పాక్ మంత్రులు, వివిధరాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని సర్వీసుల అధిపతులు సీనియర్ అధికారులు హాజరయ్యారు. భారత్‌నుంచి వస్తున్న దాడులను ప్రతిఘటించేందుకు త్రివిధ దళాలకు రక్షణ వ్యవస్థలకు పూర్తిస్వేచ్ఛఇస్తూ ప్రతిఘటించే అధికారం వారికి ఉందని ఎన్ఎస్ఎ వెల్లడించింది. భారత్ దాడులకు ధీటుగా ప్రతిఘటించేందుకు మూడు దళాలకు పూర్తి అధికారాలను కల్పిస్తున్నట్లు ఎన్ఎస్ఎ వెల్లడించింది.

## పాక్ మిలిటరీ వాహనంపై బలూచ్ లిబరేషన్ బాంబు దాడి

### 14 మంది సైనికుల మృతి

**ఇస్లామాబాద్, మే 8:** బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) వరుస దాడులతో పాకిస్థాన్ ఆర్మీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాక్ సైనిక వాహనంపై బిఎల్ఎ దాడి చేసింది. ఐఇడి బాంబులతో పాకిస్థాన్ ఆర్మీ వాహనాన్ని పేల్చివేసింది. మాచ్‌కుండ్ ప్రాంతంలో బిఎల్ఎ దళాలు ఐఇడి పేల్చాయి. ఈ దాడిలో 14 మంది పాక్ సైనికులు మృతి చెందారు. బలూచిస్థాన్‌లోని బిలాన్ పర్వత ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు దాడుల్లో 14 మంది పాక్ ఆర్మీ హతమయ్యారు. బిలాన్‌లోని మాచ్‌లోని షోర్కాండ్ ప్రాంతంలో పాకిస్థాన్ సైనిక కాన్వాయ్‌పై బిఎల్ఎ రిమోట్ కంట్రోల్ ఐఇడి దాడి చేసింది.

ఈ దాడిలో 12 మంది సైనికులు మరణించారు. మరణించిన సైనికుల్లో స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ తారిక్ ఇమ్రాన్, సుబేదార్ ఉమర్ షరూక్ ఉన్నారు. ఈ పేలుడు ధాటికి వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఇక మరోచోట బిఎల్ఎ నిర్వహించిన రెండో దాడిలో ఇద్దరు పాక్ జవాన్లు మృతి చెందారు. కచ్‌లోని కులాగ్ టిగ్రామ్ ప్రాంతంలో పాక్ సైనికులను లక్ష్యంగా చేసుకుని ఐఇడి పేలుడు బాంబులు అమర్చి ఇద్దరు సైనికులను హతమార్చారు. ఈ రెండు దాడులు తామే చేశామని బిఎల్ఎ ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. అంతేకాకుండా పాక్ ఆర్మీపై బిఎల్ఎ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. పాకిస్థాన్ ఆర్మీనికి కిరాయి ముఠాగా ఆ ప్రకటనలో తెలిపింది.

కాగా.. రెండు రోజుల క్రితం కూడా బలూచిస్థాన్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు ఆర్మీ ప్రాణాలు కోల్పోయారు. కచ్చి జిల్లాలోని మాచ్ ప్రాంతంలో పాక్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు ఐఇడితో పేల్చేశారు. ఈ పేలుళ్లలో ఏడుగురు పాక్ సైన్యం మృతి చెందారు. అయితే ఈ దాడికి పాల్పడింది బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందిన ఉగ్రవాదులుగా పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది.

మరోవైపు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో వరుస పేలుళ్లు జరిగాయి. లాహోర్ వాల్టన్ రోడ్‌లోని సైనిక విమానాశ్రయం వెలుపల మూడు పేలుళ్లు సంభవించాయి. పేలుళ్లను పాక్ అధికారులు ధ్రువీకరించారు. అయితే పేలుళ్ల నష్టంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఈ పేలుళ్లలతో మందస్తు చర్యల్లో భాగంగా లాహోర్ ఎయిర్‌పోర్టును మూసివేశారు. ఒక్కసారిగా పేలుళ్లు సంభవించడంతో జనం భయంతో అక్కడి నుంచి బయటకు పరుగులు తీశారు.

## దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఏడు లక్షల క్రిమినల్ అప్పీళ్లు

**న్యూఢిల్లీ, మే 8:** దేశంలో హైకోర్టు జడ్జీల నియామకాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్‌లోని హై కోర్టుల్లో 7 లక్షల క్రిమినల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించింది. ఈ క్రమంలో హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన పేర్లను త్వరగా సిఫారసు చేయాలని కేంద్రాన్ని కోరింది. దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అలహాబాద్ హైకోర్టులో గరిష్ఠంగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అలహాబాద్ హై కోర్టులో 79 మంది న్యాయమూర్తులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 11 మందే పనిచేస్తున్నారని స్పష్టం చేసింది. అలాగే 94 మంది ఉండాల్సిన బాంబే హైకోర్టు 66 మంది న్యాయమూర్తులతో పనిచేస్తోందని వెల్లడించింది. కలకత్తా హై కోర్టులో మొత్తం 72 మంది న్యాయమూర్తులు ఉండాలి. అక్కడ 44 మంది న్యాయమూర్తులతో హైకోర్టు పని చేస్తోంది. ఢిల్లీ హైకోర్టులో ప్రస్తుతం 41 మంది జడ్జీలు ఉన్నారు. అక్కడ సాధారణంగా 60 మంది న్యాయమూర్తులు ఉండాలి. హై కోర్టు న్యాయమూర్తుల కొరత వల్ల క్రిమినల్ అప్పీళ్లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను అరికట్టాల్సి ఉందని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కొలీజియం సిఫార్సులను త్వరగా క్లియర్ చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కోరింది. హైకోర్టు జడ్జీల నియామకానికి సంబంధించిన పెండింగ్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం త్వరగా క్లియర్ చేస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది. కాగా, కేంద్ర ప్రభుత్వం వద్ద 2023 నాటి నాలుగు సిఫార్సులు, 2024లో చేసిన 13 సిఫార్సులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే చర్యల్లో భాగంగా న్యాయమూర్తుల ఆస్తుల వివరాలను సుప్రీంకోర్టు ఇటీవలే ప్రకటించింది. న్యాయమూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్ సైట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. వెబ్ సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనే కాకుండా హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియ, హైకోర్టు కొలీజియానికి అప్పగించిన బాధ్యతల వివరాలు సహా ఇతర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

9-5P6fHMNWJQEfffff.qxd:9-5P6fHMNWJQE.qxd 09/05/25 12:27 AM Page 1



# మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి రుణ సదుపాయం

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మహిళా సంఘాలకు గత యేడాది లక్ష్యానికి మించి రుణ సదుపాయం కల్పించామని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సెర్ప్ వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా ఆర్థిక సాధికారతకు ఆలంబనగా నిలుస్తున్న నిలుస్తున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ వార్షిక కార్యాచరణను ఆవిష్కరిం చుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత యేడాదితో పోలిస్తే అదనంగా గత ఏడాది రూ.5 వేల కోట్ల రుణాలు ఇప్పించామని ఇది మహిళా సంఘాల చరిత్రలో ఒక రికార్డు సృష్టించామన్నారు. గత ఏడాది యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేసుకున్నట్లు గానే ఈ సంవత్సరం కూడా ఈ యాక్షన్ ప్లాన్ విజయవతం చేయాలన్నారు.అంతే కాకుండా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లు సిద్దంగా ఉండాలన్నారు. రుణాలను తిరిగి చెల్లించడంలో మహిళా స్వయం సహాయక బృందాలు తమ నిబద్దతను చాటుకున్నాయన్నారు. పెద్ద,పెద్ద పారిశ్రామిక వేత్తలు, సూటు,బూటు వేసుకున్న వ్యక్తులు బ్యాంకులుకు కన్నాలు వేస్తుంటే స్వయం సహాయక సంఘాలు మాత్రం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నాయన్నారు.అయినా మహిళా స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు భయపడుతున్నారన్నారు. మహిళా సంఘాల తరపును మేము బ్యాంకులకు గ్యారెంటీ ఇస్తున్నట్లు ప్రకటించారు.మహిళా సంఘాలు తీసుకునే ప్రతిపై చెల్లిస్తామని ఆమె బ్యాంకర్లకు భరోసా ఇచ్చారు. మహిళా స్వయం సహాయక బృందాలు స్వయం ఉపాధి స్థాయి నుంచి సంపద సృష్టించే స్థాయికి ఎదిగాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాల్లో కోటి మంది సభ్యులను చేర్చే లక్ష్యంగా ,అందరిని కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేయక ముందు బ్యాంకలన్నీ పట్టణాలకే పరిమితమైట్లు ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.బ్యాంకులను జాతీయకరణ చేయడంతో బ్యాంకులన్నీ పల్లెలకు తరలి వెళ్ళాయని అక్కడి పేదలకు లోన్లు కూడా ఇస్తున్నాయన్నారు. అందుకే మహిళా శక్తి పథకానికి ఇందిరమ్మ పేరుపెట్టుకున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలకు బ్యాంకర్లు ఇచ్చే లోన్లు దేశ ప్రగతికి ఉపకరిస్తాయని, అందుకే బ్యాంకర్లు తమ సహకారాన్ని మరింత విస్తరించాలన్నారు.

బ్యాంకు లోన్లకు దూరంగా ఉన్న వర్గాలను గుర్తించి లోన్లు ఇప్పించే విధంగా అధికారులు కృషి చేయలన్నారు.ఈ ఆర్ధిక సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకుబోయే మొత్తం రుణాలను తిరిగి చెల్లిస్తామని బ్యాంకర్లకు ఆమె హామీ ఇచ్చారు.ఈ ఏడాది మహిళా సంఘాలకు లోన్లు ఇవ్వడంలో టార్గెట్ రీచ్ అయిన బ్యాంకర్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌డి కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మూసీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నర్సింహారెడ్డి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నరసింహారెడ్డి పర్యటించారు. గురువారం ఈ రెండు రిజర్వాయర్ల పరిసర ప్రాంతాలను ఉన్నతాధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ల స్టోరేజ్ సామర్థం, అందులోకి వచ్చే ఇన్, ఔట్ ఫ్లోకు సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ ఎండికి వివరించారు. అనంతరం మూసిలోకి మంచినీటిని విడుదల చేయడం, దానికి సంబంధించి ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో ఎండి అధికారులతో సమగ్రంగా చర్చించారు. మూసి, ఈసా నదుల పొడవునా బాపూఘాట్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివరాలను ఆరా తీసారు. ఈ పర్యటనలో ఎంఆర్‌డిసిఎల్ జాయింట్ ఎండి గౌతమి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ దత్తుపంత్, మెయిన్ హార్ట్, జలమండలి సూపరింటెండెంట్ ఇంజినీర్ బ్రిజేశ్ పాల్గొన్నారు.

## విద్యను సమాజ ఉన్నతికి వినియోగించాలి

### ఐఐఎం కాశీపూర్ స్నాతకోత్సవంలో రిలయన్స్ సలహాదారు అలోక్‌అగర్వాల్




**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** విద్యను కేవలం వ్యక్తిగత కెరియర్ కోసం మాత్రమే కాకుండా ప్రజల జీవనవిధానం మెరుగు పరచడంతోపాటు సమాజ ఉన్నతికి వినియోగించాలని రిలయెన్స్ సీనియర్ సలహాదారు అలోక్ అగర్వాల్ పిలుపు నిచ్చారు. ఐఐఎం కాశీపూర్ 12వ స్నాత కోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై లింగవివక్ష, ఆర్థిక అంతరాలు లేని సమాజం నిర్మాణంకు ప్రస్తుతం రోజు రోజుకు కొత్తను సంతరించుకొంటున్న సాంకేతిక అంశాలను ఉపయోగిం చుకోవాలని ఆయన సూచించారు. కృత్రిమ మేథా, ఉపగ్రహాలు అద్భుతమైన వేగంతో ఆవిష్క రణలు జరుపు కొంటున్నామని అన్నారు. తొలి రోజుల్లో టెలెక్స్ మిషన్, కంప్యూ టర్ బ్యాంకు ఆఫ్ అమెరికా వద్ద చూసినప్పుడు ఎంతోగొప్పగా ఉండేదని ఇప్పుడు ప్రతి వ్యక్తి చేతిలో ఒక ఐస్‌క్రీమ్‌లా మారి పోయిందని ఆయన అన్నారు. మహిళలు అత్యధికంగా ప్రతిభ చూపుతున్నారని ఎంబిబిఎ ఇఎంబిఎలో ఐదు బంగారు, నాలుగు వెండి, ఒక కాంస్య పతకాలు లభించాయని ఆయన తెలిపారు.24 మంది విద్యార్థులు అసాధారణ ప్రతిభను ప్రదర్శించారని ప్రతిష్టాత్మక డైరెక్టర్ మెరిట్ జాబితా కింద వారికి సర్టిఫికెట్ ఇచ్చిసత్కరిస్తున్నామని తెలిపారు. 12వ స్నాతకోత్స వంలో 598 మందికి పట్టాలు అందించామని తెలిపారు. 33శాతంకుపైగా మహిళలు ఉన్నారంటే లింగవివక్ష లేని సమాజ నిర్మాణం భారతదేశంలో నానాటికి నిర్మితమవుతుందని అన్నారు. కాశీపూర్ ఐఐఎం డైరెక్టర్ సోమనాథ్ చక్రవర్తి తదితరులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

## తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

### 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు నియామక పత్రాలు

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (హెచ్‌డబ్ల్యూఒ)లంటే తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని.. విద్యార్థుల్లో కాన్ఫి డెన్స్‌ను అభివృద్ధి చేస్తూ వారికి భవిష్యత్ మార్గదర్శకులుగా ఉండాలని బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బిసి సంక్షేమ శాఖలో నూతనంగా నియామకైన 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌కి సచివాలయంలో గురువారం నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాలమాయాదేవి, బిసి గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు, కార్పొరేషన్ చైర్మన్‌లు నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయికుమార్, జైపాల్, జ్ఞానేశ్వర్, కాల్వ సుజాత, వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌గా నూతనంగా నియామక పత్రాలు పొందుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. మీరంతా బిసి సంక్షేమ శాఖ కుటుంబంలో చేరుతున్నారని.. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఇది ఆశ్రమమని అన్నారు. ఉపాధ్యాయ, డాక్టర్, జర్నలిజం, రాజకీయాలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ వృత్తిలో ఒక గౌరవాన్ని సాధించుకుంటామన్నారు. రాష్ట్రంలో 703 హాస్టల్స్ ఉంటే వాటిలోని ఖాళీల భర్తీ పూర్తి చేశామన్నారు. డిసెంబర్ 7, 2023న ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. విద్యార్థులకి మెస్ చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని.. బలహీన వర్గాల శాఖ కుటుంబ గౌరవాన్ని పెంపొందించాలన్నారు. పెద్దలకే పరిమితం అయిన సన్న బియ్యం సామాన్యుడి వరకు ప్రభుత్వం అందిస్తుందని.. బలహీన వర్గాల శాఖ మంత్రిగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా కుల సర్వే చేశామన్నారు. వెల్ఫేర్ హాస్టల్ అన్నిటి కంటే మార్గదర్శకత్వంగా ఉండాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో చాలా ఏళ్ల తరువాత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ నియామకాలు జరిగాయని బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీధర్ అన్నారు. హాస్టల్‌లో చదువుకునే పిల్లలు బాగా చదవాలన్నా.. మంచి క్రమశిక్షణ రావాలన్నా హాస్టల్ వార్డెన్‌లే చూసుకుంటారని అన్నారు. మీ దగ్గర చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నత శిఖరాలకు వెళతారో అదే మీ సక్సెస్ అని అన్నారు.

# తెలంగాణ మిర్చి రైతులకు మోడీ ప్రభుత్వం అండ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ.. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం వర్తింపచేస్తామన్న కేంద్రం

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం(ఎంఐఎస్)లోని ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్‌ను అమలు చేయడం ద్వారా తెలంగాణ మిర్చి రైతులకు లబ్ధిచేకూరనుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పంట పండించేందుకయ్యే ఖర్చుకన్నా తక్కువ మొత్తానికి మార్కెట్లో విక్రయించాల్సిన పరిస్థితి వచ్చినపుడు కనీసం పండించేందుకు అయిన ఖర్చును అయినా అందిస్తూ మిర్చి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ఉండటానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఎంఐఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకాన్ని తెలంగాణలో అమలు చేయడానికి సుముఖంగా ఉన్నామని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ శాఖకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలోని మిర్చి రైతులకు ఎలాంటి నష్టం చేకూరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఖమ్మం, మహబూబాబాద్, జోగుళాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రైతులు ఎక్కువగా మిర్చి పంట పండిస్తారని, వారికి బహిరంగ మార్కెట్‌లో సాగుధర కన్నా తక్కువ ధర వస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని ఆ లేఖలో కోరారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ స్పందిస్తూ 2024-25 లో ఈ పథకం కింద తెలంగాణలో ఉత్పత్తి అయిన మిర్చి పంటలో 1,72,135 మెట్రిక్ టన్నుల పంటకు (తెలంగాణలో ఉత్పత్తి అయ్యే మొత్తం 6,88,540 మెట్రిక్ టన్నుల మిర్చి పంటలో 25 శాతం) ఈ పథకాన్ని వర్తింపజేస్తామని వెల్లడించింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద మార్కెట్ ధరకు, సాగు ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని రైతులకు చెల్లిస్తామని వెల్లడించింది. మిర్చి పంటకు ఎంఐఎస్ ధరను క్వింటాల్‌కు రూ.10,374గా నిర్ధారించింది. ఎంఐఎస్‌కు, మార్కెట్ ధరకు మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలుత రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మిర్చి రైతులకు జరుగుతున్న నష్టంపై దృష్టి సారించాలన్నారు. ఈ ఖర్చులో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ వివరించింది. పంటల ధరల హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు రైతులకు కనీస ధర రావాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆయ సురక్షన్ అభియాన్ (పిఎం ఆశ) పథకాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా మిర్చి సహ హార్టికల్చర్ ఉత్పత్తుల కోసం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను తీసుకొచ్చిందన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థుల నైపుణ్య శిక్షణకు వినూత్న కార్యక్రమం

### జెఎన్‌టియు - టిసిఎస్ ఐయాన్ ఒప్పందం

### మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద ఐదు నెలల శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గురువారం సచివాల యంలో మంత్రి సమక్షంలో హైదరాబాద్ జెఎన్ టియు - టిసిఎస్ ఐయాన్ సంస్థల మధ్య అవగా హన ఒప్పందం కుదిరింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పి యువతను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రారంభించామని శ్రీధర్ బాబు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం కష్టం అన్నారు. దీనిని అర్థం చేసుకున్నందునే శిక్షణ పైన దృష్టి సారించామన్నారు చదువు పూర్తి చేసే సమయానికి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అంశంలో నైపుణ్యం పెంచగలిగితే ఉద్యోగాలు ఇవ్వడం కోసం కంపెనీలు వాటికవే పరుగెత్తుకుంటూ వస్తాయి. టిసిఎస్ ఐయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలల 20 వారాలకు వంద మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ట్రెయినింగ్ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో ఎంప్యానెల్ అయిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మొదట మంథనిలోని జెఎన్‌టియు కళాశాల విద్యార్థులకు ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం అన్నారు.

గత ఏడాది దేశంలో యువత ఉపాధి కల్పన 2023లో 44.3శాతం, 42.6శాతానికి పడిపోయిందన్నారు. తెలం గాణలో ఈ పరిస్థితి లేకుండా చూసేందుకే నైపుణ్య శిక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత యువతను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ సంసిద్ధత కార్యక్రమాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టిసిఎస్ ఐయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి, స్కిల్ ఎడ్యుకేషన్ బిజినెస్ హెడ్ స్మృతి ముల్యే, జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొ. టి కిషన్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల బీమా..చెక్కు అందజేత

**మంగళగి,మే 8,ప్రభాతవార్త:** గత మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకానికి చెందిన టీడీపీ కార్యకర్త కోటేశ్వరరావు కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కును గురువారం గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి లు పార్టీ నేతలతో కలిసి అందజేశారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు హామీ హామీ ఇచ్చారు. బీమా చెక్కును మంజూరు చేయించిన నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కు, సీఎం చంద్రబాబు నాయుడు కు మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కన్నుమూత

**హైదరాబాద్ (ఉప్పల్), మే 8, ప్రభాతవార్త:** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి(80) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం మృతి చెందినట్లు మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి సోదరుడు ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి హబ్సిగూడలోని ఆయన నివాసానికి తరలించారు. బండారి రాజిరెడ్డి మృతి పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి కెటిఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పలువురు పార్టీల నేతలు, కాలనీ సంఘాల అధ్యక్షులు నివాళులు అర్పించారు. గత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నుంచి పోటీ చేసి తొలిసారిగా ఉప్పల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిటిడి బోర్డు మెంబర్‌గా, కైలాసగిరి భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఆలయం చైర్మన్‌గా ఆయన పనిచేశారు. బండారి రాజిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం కీసరలోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో జరుగుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.



బండారి రాజిరెడ్డి (ఫైల్)

## బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి

# తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌దే

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత సిఎం రేవంత్‌రెడ్డిపై ఉందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి, భారత సైన్యానికి సహ కరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో కూడా అక్రమ వలసదారులను యుద్ధ ప్రాతి పదికన గుర్తించి తిప్పిపంపే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మరోవైపు దేశ సమగ్రతపై దాడి జరిగిన నేపథ్యంలో భారత సైన్యం మహిళా సైనికులు అత్యంత సాహసోపేతంగా మాతృమూర్తులను సింధూరాన్ని తుడిచివేసిన ఉగ్రవాదులపై దాడి చేసి బుదులు తీర్చుకుంటే ఇక్కడున్న కొంతమంది కుహనా మేధావులు ఆపరేషన్ సిందూర్‌ను హేళన చేసేలా సామాజిక మాధ్య మాల్లో పోస్టులు చేయడం దురదృష్టకరం అన్నారు. ఒక యూని వర్సిటీలో బాధ్యతగల స్థానంలో ఉన్న సూరెపల్లి సుజాత సామాజిక మాధ్య మాల్లో దేశం పట్ల, ఆపరేషన్ సింధూర్ పట్ల హేళనగా పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. సుజాతపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వైభవోపేతంగా ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవాలు

**పొన్నూరు, మే 8,ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ సహస్రలింగేశ్వరం స్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ దశావతారముల దేవాలయంలో గురువారం ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ధ్వజ స్థంభం శిథిలావస్థకు చేరడంతో దాతలు తాడేపల్లి సత్యమూర్తి దంపతులు ముందుకు వచ్చి ధ్వజస్థంభం ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన పూజాధికార్యక్రమాలు మూడు రోజుల నుంచి జరిగాయి. చివరి రోజు అయిన గురువారం ధ్వజస్థంభాన్ని నిర్ణయించిన సుమూహూర్తానికి అర్చకస్వాములు ప్రతిష్ఠించారు. అనంతరం స్వామివారికి శాంతి కళ్యాణం నిర్వహించారు. ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని తిలకించేందుకు పొన్నూరు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.



# వలసదారులపై కఠిన చర్యలు ఏవి?

### ఒవైసి సోదరుల పార్టీని నొప్పించకూడదనే భయమా?

### ఏదైనా రాజకీయ లెక్కలా?: బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** దేశంలో గత యూపిఏ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారుల విషయంలో కనికరంతో, దయ చూపింది. దీంతో ఉగ్రవాద ఘటనల ద్వారా మూల్యం చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దేశంలో విదేశీ వలసదారులు అక్రమంగా నివసించడంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పష్టమైన గైడ్‌లైన్లు ఇచ్చింది. అక్రమ వలసదారులను, వీసా గడువు ముగిసినా ఇక్కడే నివసిస్తున్న విదేశీ యులను, పాకిస్థాన్ జాతీయులను తక్షణమే గుర్తించి, వారిని స్వదేశాలకు పంపించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది. కానీ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదు. తెలంగాణలో అక్రమ వలసదారులు ఎంతమంది ఉన్నారో అనే విషయంపై నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాద చర్యలకు సహకరిస్తున్న లోకల్ స్లీపర్ సెల్స్ రహస్యంగా రాష్ట్రంలో పనిచేస్తున్నాయని ఐబి, ఎన్ఐఏ హెచ్చరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు సీరియస్‌గా స్పందించడం లేదు? కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ వలసదారుల విషయంలో ఇంతవరకు నివేదిక ఇవ్వలేదన్నారు. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో పాతబస్తీ ప్రాంతంలో వేలాది మంది అక్రమ వలస దారులు నివసిస్తున్నారు. వీరంతా నకిలీ ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు సృష్టించుని, వివిధ సంస్థల సహకారంతో రాష్ట్రంలో, దేశంలో సమస్యలు సృష్టించాలని కుట్రలు చేస్తున్నట్లుగా అనేకసార్లు హెచ్చరించింది. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోలేదు. ఇప్పటికే దేశంలో జరిగిన కొన్ని ఉగ్ర దాడుల ఘటనల్లో హైదరాబాద్‌తో సంబంధం ఉన్నట్లు బయట పడిందన్నారు. ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమ వలసదారులను గుర్తించడం, అరెస్ట్ చేయడం వంటి చర్యలు చేపట్టడంలో ఎందుకు విఫలమవుతుందని ప్రశ్నించారు. ఓవైసీ సోదరుల పార్టీని నొప్పించకూడదనే భయమా? ఏదైనా రాజకీయ లెక్కలా? అంటూ ప్రశ్నించారు.

**అక్రమ వలసదారులను పంపించేందుకు సిఎంకు భయమెందుకు? ఆకుల విజయ**

తెలంగాణలో అక్రమంగా నివాసముంటున్న వలసదారులను పంపించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు భయపడుతున్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ ప్రశ్నించారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో సమావేశంలో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అక్రమ వలస దారులను గుర్తించి, వారిని తిరిగి వెనక్కి పంపి వేయాలని అన్ని రాష్ట్రాలకు సూచించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సూచిం చారు. తెలంగాణ రాష్ట్రంలో అక్రమ వలసదారులు ఎంతమంది ఉన్నారు? ఎంతమందిని బయటకు పంపారు? అనే వివరాల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రతి భారత పౌరుడు దేశభక్తిని చాటుకోవాలని, దేశగడ్డమీద పుట్టిన ప్రతి ఒక్కరు దేశం పేరును కాపాడాలి. దేశం గురించి గర్వంగా చెప్పుకోవాలన్నారు.

## మూడు కేసుల్లో 14 కిలోల గంజాయి పట్టివేత

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** భువనేశ్వర్ నుంచి ముంబాయి వయా సికింద్రాబాద్ మీదుగా వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణ అవుతుందనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్,సిడి,సిఐలు, వెంకటేశ్వర్లు, నాగరాజు సిబ్బంది కలిసి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఖాజి పేట్ నుంచి సికింద్రాబాద్ వరకు తనిఖీలు నిర్వహిస్తు వచ్చారు.అనుమానం వచ్చిన బ్యాగ్‌లో తనిఖీలు నిర్వహించగా మూడు గంజాయి ప్యాకెట్లు లభించాయి.కాని గంజాయిని తీసుకు వెళ్తున్న వ్యక్తి మాత్రం తప్పించుకున్నట్లు సీఐలు తెలిపారు. పట్టుకున్న గంజాయిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేశారు.వైఎంసీఏ నారాయణగూడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆటోల్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ బీ టీమ్ ఎస్సై బాలరాజు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు ఆటోల్లో 2.5 కేజీల గంజాయి పట్టుబడింది. విక్కి పటేల్ అనే వ్యక్తి ధూల్‌పేట్‌లో ఒక వ్యక్తి వద్ద 2.5 కేజీల గంజాయిని కొనుగోలు చేసి తీసుకొని వచ్చి నారాయణగూడ వైఎంసీ ప్రాంతంలో తీసుకవచ్చిన గంజాయిలో సమంత్ అనే మరో ఆటో డ్రైవర్‌కు ఇస్తున్న ఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది దాడిచేసి పట్టుకున్నారు. ఈ కేసుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకొని, రెండు ఆటోలను మూడు సెల్ ఫోన్‌లను సీజ్ చేసి నారాయణ గూడ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. దూల్‌పేట రహింపుర ప్రాంతంలో ప్రాంతంలోని ఒక గృహంలో గంజాయి అమ్మకాలు జరుపుతుండగా హెచ్ టిఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది నిందితులను పట్టుకున్నారు. గంజాయి అమ్ముకాలుతున్న వారి వద్ద 1.518 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, ధర్మసింగ్, మహేష్‌సింగ్, మనోజ్‌సింగ్‌లను అరెస్టు చేసి దూల్‌పేట్ స్టేషన్‌లో అప్పగించారు. ధూల్‌పేట్‌లో కమలాబాయి అనే మహిళకు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జ్యోతి మూడు నెలల జెలు శిక్ష విధించారు.

## ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో వ్యాయామశాల ప్రారంభం

**నరసరావుపేట, మే 8 ప్రభాతవార్త :** ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్దుల కొరకు ప్రత్యేకంగా నూతన వ్యాయామశాలను ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి షేక్ కరీం మోహిద్దీన్, డైరెక్టర్ మస్తాన్ షరీఫ్‌లతో పాటు కార్యక్రమానికి విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాంబాబు హాజరై జిమ్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్దులకు చదువుతో పాటు శారీరక ఆరోగ్యం ఎంతో ముఖ్యమన్నారు.అధునిక వ్యాయామ పరికారాలు ఏర్పాటు చేయటం పట్ల కళాశాల యాజమాన్యంకు అభినందనలు తెలిపారు. విద్యార్దులు తమకు కేటాయించిన సమయాలలో జిమ్‌ను వినియెగించుకోవాలని వారు సూచించారు. కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి, ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు,అధ్యాపకులు, విద్యార్దులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అన్నవరం సత్యదేవునికి పట్టువస్త్రాలు



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మే 8, ప్రభాతవార్త** అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న కళ్యాణోత్సవాలకు శ్రీ స్వామివారి తోబుట్టువు బెజవాడ దుర్గమ్మ తరపున గురువారం పట్టువస్త్రాలను అందించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆలయ ప్రధానార్చకులు లింగంబొట్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల బృందం, అర్చకస్వాములు, శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి చేరుకుని అక్కడ శ్రీ స్వామివారికి అందించే పట్టువస్త్రాలను ఆలయాధికారులకు అందించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, సన్నాయి నాదాల నడుమ పట్టువస్త్రాలను పూర్ణకుంభంతోస్వాగతం పలికి శ్రీ సత్యనారాయణ స్వామివార్ల దేవస్థానం బృందం పట్టువస్త్రాలను అందుకుని శ్రీ స్వామివారి వద్ద వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలను తీసుకుని వచ్చిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం బృందంకు శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామివార్ల దర్శనంతో పాటు ప్రసాదాలు, మెమొంటో, శేషవస్త్రం సమర్పించి వేదాశీర్వచనాలందించారు. దుర్గమ్మ ఆలయానికి భక్తుల విరాళాలు: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష 11 వేలను విరాళంగా గురువారం విజయవాడకు చెందిన టి హనుమంతరావు వారి కుటుంబసభ్యులతో కలిసి ఆలయాధికారులకు అందించారు. అలాగే దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న స్వర్ణతాపడం పనులకు గుంటూరుకు చెందిన బి కోట్య నాయక్ రు.1లక్ష 116ల విరాళాన్ని గురువారం ఆలయాధికారులకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు దుర్గమ్మవారి దర్శనం కలిగించిన అధికారులు, దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# కోనకు పల్లకీలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుడు



**రాపూరు (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త** : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారు బ్రహ్మోత్సవాలకు పెళ్ళి కొడుకుగా ముస్తాబై ఉభయ నాంచారులతో కలిసి గురువారం గోనుపల్లి గ్రామం నుండి పెంచలకోనకు పల్లకీలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గోనుపల్లి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాలకు ఉభయ దేవేరులతో పల్లకిలో కోనకు బయలుదేరిన స్వామి వారికి గోనుపల్లి గ్రామస్తులు వారి నివాసాల ముందు బాగాన పందిళ్ళు ఏర్పాటు చేసి స్వాగతం పలికి మొక్కులు చెల్లించారు. స్వామి వారు గ్రామ గిరిజన కాలనీ వద్దకు చేరుకోగానే గిరిజనులు వారి సాంప్రదాయం ప్రకారం ఇంటి అల్లుడైన పెంచల స్వామికి గిరిజన సాంప్రదాయం ప్రకారం పుట్టతేనే, ఇంజేటి గడ్డలు, ఇతర దుంపలు, అరినార మొలతాడు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు.

అక్కడి నుండి బయలు దేరిన స్వామి వారు గొల్లబోయిన స్వామి వారి ఆలయం వద్దకు చేరుకోగానే గొల్లబోయిన స్వామి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి తోలి దర్శనం గొల్లబోయిన స్వామి వారికి ఇచ్చారు. అక్కడి నుండి సుమారు 6 కిలోమీటర్ల మేర స్వామి వారిని బోయిలు గోవింద నామస్మరణలతో పల్లకీలో మోసుకుంటూ కోనకు చేరుకున్నారు. కోనలోని స్వామి వారి ముఖద్వారం వద్దకు స్వామి వారు చెరుకున్నంతనే అర్చక స్వాములు అక్కడికి చేరుకోని స్వామి వారికి పూజలు నిర్వహించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, గోనుపల్లి సర్పంచ్ గోతాటి నారాయణమ్మ, సేవా కమిటీ సభ్యులు రంగినేని వెంకటరమణయ్య, పీర్ల సోమయ్య, బొట్టా హజరత్ నాయుడు, తోట క్రిష్ణయ్య, శ్రీశైలం భార్గవ రామ్, కిన్నేర నరసింహా రావు,పెమ్మసాని సుగుణమ్మ, మోమిడి నరసింహులు, బోగులు బాస్కర రెడ్డి, బోతల శివ నాగేశ్వర రావు, దాసరి బాస్కర నాయుడు, యం.నవక్రిష్ణ చౌదరి, ఈతముక్కల యోగేశ్వర రావు తదితరులు వున్నారు. స్వామి వెంట కాలినడకన వేలాదిమంది భక్తులు కోనకు బ్రహ్మోత్సవాలకు కాలినడకన పల్లకీలో కోనకు బయలుదేరిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఎంట ఈ పర్యయం గతంలో ఎన్నడూ లేని విధంగా వేలాధి మంది భక్తులు గోవింద నామస్మరణలు చేసుకుంటూ కాలినడకన కోనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం,చెక్క భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



## పెనుశిల నృసింహుని సేవలో తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి సుధ


రాపూరు (నెల్లూరు), మే 8, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామిని గురువారం తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జెపి సుధ తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కోనకు వచ్చిన న్యాయమూర్తికి ఆలయ అధికారులు ఆధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి వారికి, శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారికి, శ్రీ అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆస్థాన మండపంలో వేదపండితులు ఆమెకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు ఆందజేసి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గుండ్లూరు శశి స్వామి, పలువురు దేవస్థానం సిబ్బంది వున్నారు.

# టమోటా సాగు భారమై యువరైతు బలవన్మరణం

**చౌడేపల్లి, మే 8 ప్రభాతవార్త** టమోటా సాగు యువరైతు ఉసురు తీసింది...గతంలో చేసిన అప్పులు ప్రస్తుతం సాగుచేసిన రుణం తోడు కావడం వెరసి మోపడు అప్పులు పెనుభారం కావడంతో యువరైతు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన గురువారం చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ శివపురం అగ్రహారంకు చెందిన లోకేష్(26) వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నాడు. తండ్రి కుమారకొర మహారాష్ట్ర పూణెవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఒక్కగానొక్క కుమారుడైన లోకేష్ చిన్నతనం నుంచి కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ఈక్రమంలో తనకున్న ఎకరా పొలంలో ఇటీవల టమోటా సాగు చేసాడు. గత 10రోజులుగా టమోటాకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చేదెలా అంటూ ప్రతిరోజు ఇంట్లో తెలిపేవాడు. టమోటా పంట దిగుబడి ఆశాజనకంగా వున్నప్పటికీ ఇటీవల మరింత ధర తగ్గిపోవడంతో యువరైతు మనస్తాపానికి గురై తన సెల్‌ఫోన్‌లో బుధవారం రాత్రి " ఐయామ్ వెరీ సారీ "అని స్టేటస్‌లో పెట్టి కనిపించకుండా పోయాడు. ఉదయాన్నే కేలేరుకింద తన పొలానికి పక్కనే వున్న చింతచెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు తల్లి హేమావతికి తెలియజేసారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. భర్త చనిపో యిన తర్వాత ఉన్న ఒక్క బిడ్డను చూసుకొని జీవిస్తున్న తల్లికి లోకేష్ మరణం జీర్ణించుకోలేక పోతోంది.

# ఆర్డీటికి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ పునరుద్ధరణ చేయండి

## - సిఎంను కలిసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో** కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్డీటీ) సంస్థకు ఎఫ్‌సిఆర్ఎ కింద విదేశాలనుంచి అందే సహాయానికి సంబంధించి రెన్యూవల్ పునరుద్ధరణ చేసేందుకు తగుచర్యలు తీసుకోవాలని సిపిఐ చంద్రబాబునాయుడును గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ కలిసిన సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా సీఎంకు వివరిస్తూ.. 1969లో విన్సెంట్ ఫెర్రర్ దంపతులచే రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటి) ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో స్థాపించబడింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించడానికి, సమాన అవకాశాలు, సంపదను అందరికీ అందించడానికి ఈ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. సంస్థను ఏర్పాటు చేసిన తర్వాత కరువు పీడిత ప్రాంతాల్లో ఫుడ్ ఫర్ వర్క్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. తద్వారా వేలాదిగా బావులు తవ్వటం, లక్షలాది గృహాల నిర్మాణం, కుష్టు వ్యాధి కేంద్రం స్థాపన వంటి పనులు చేపట్టిందన్నారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభించి కూలీలను రైతులుగా మార్చడంలో సహాయ పడిందన్నారు. గ్రామీణ సమాజాల్లో పేదరికం, బాధలు, అన్యాయాలను తొలగించి, స్థిరమైన అభివృద్ధి ద్వారా సమానత్వ సామాజిక సాధికారతకు, మహిళలు, పిల్లలు, వైకల్యం ఉన్న వ్యక్తులు, గిరిజన వర్గాల అభివృద్ధి కోసం ఆర్డీటి సంస్థ ప్రత్యేక కృషి సారించింది.

విద్య, వైద్య, గృహ నిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక-క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను మెరుగు పర్చడానికి మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్ స్కూళ్లు ఏర్పాటు చేయడమే కాకుండా స్కాలర్‌షిప్లను అందిస్తోందన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్‌లో రెండు సెకండరీ ఆసుపత్రులు, ఒక ప్రైమరీ హెల్త్‌కేర్ సెంటర్ స్థాపించిందన్నారు. రోజువారీ 3వేల మంది పేదవారు ఈ ఆసుపత్రుల సేవలను వినియోగిస్తున్నారన్నారు.

# జిఆర్ఎంబి సొంత నిర్ణయాలు మినిట్స్‌గా రికార్డులు చేయడం తగదు

## ఇఎన్‌సి అనిల్‌కుమార్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** గోదావరి యాజమాన్య బోర్డు సమావేశాల సమయ నిర్ధారణ నుంచి మొదలు కొని సమా వేశంలో జరిగే చర్చ సందర్భంగా వెలు వడిన అభిప్రాయాలు పరిగణలోకి తీసు కోకుండా సొంతనిర్ణయాలతో రికార్డు చేస్తున్నారని తెలంగాణ నీటిపారుదలశాఖ ఇఎన్‌సి జి అనిల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జిఆర్ఎంబి సమావేశాలు ఏర్పాటు చేసే ముందు సభ్యరాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకితీసుకొని మీటింగ్ షెడ్యూల్ నిర్ణయించాలని సూచించారు. జిఆర్ఎంబి, వివిధ ముఖ్యమైన సమావేశాలు సభ్య దేశాలకు పంపిణీ చేయాలని గోప్యంగా పెట్టడం తగదని అంటూ గోదావరి యాజమాన్య బోర్డు చైర్మన్‌కు తన నిరసన వ్యక్తంచేస్తూ ఘాటుగా లేఖను రాశారు. జిఆర్ఎంబి కార్యదర్శి వ్యవహారంలో ఇరు రాష్ట్రాలు చేసిన ఫిర్యాదులను కూడా మినిట్స్‌లో వారికి అనుకూలంగా రాసు కున్నారని ఆయన చేసిన ఆర్థిక అవకతవకలకు కూడా చోటు లేకుండా చేశారని దుయ్యబడుతూ లేఖను రాశారు. స్టాఫ్ నియామకాలపై తెలంగాణప్రభుత్వం కోరుతున్న సవరణల విషయంలో కూడా బోర్డు ఉదాసీనతపై కూడా ఆయన తప్పుపట్టారు. జిఆర్ఎంబి సీడ్ మనీ ఇవ్వడంతోపాటు ప్రాజెక్టులు అప్పగిస్తామని ఎక్కడ అనలేదని దానిని తప్పుగా రికార్డులుచేశారన్నారు.

# మహిళా సంఘాలకు లక్ష్యానికి మంచి రుణ సదుపాయం

## పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మహిళా సంఘాలకు గత ఏడాది లక్ష్యానికి మించి రుణ సదుపాయం కల్పించామని, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ప్రజాభవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సెర్ప్ వార్షిక ప్రణాళికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా ఆర్థిక సాధికారతకు ఆలంబనగా నిలుస్తున్న నిలుస్తున్న సెర్ప్ బ్యాంక్ లింకేజీ వార్షిక కార్యాచరణను ఆవిష్కరించ చుకోవడం సంతోషంగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే అదనంగా గత ఏడాది రూ.5 వేల కోట్ల రుణాలు ఇప్పించామని ఇది మహిళా సంఘాల చరిత్రలో ఒక రికార్డు సృష్టించామన్నారు. గత ఏడాది యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేసుకున్నట్లు గానే ఈ సంవత్సరం కూడా ఈ యాక్షన్ ప్లాన్ విజయవంతం చేయాలన్నారు.అంతే కాకుండా యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగా మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉండాలన్నారు. రుణాలను తిరిగి చెల్లించడంలో మహిళా స్వయం సహాయక బృందాలు తమ నిబద్ధతను చాటుకున్నాయన్నారు. పెద్ద,పెద్ద పారిశ్రామిక వేత్తలు, సూటు,బూటు వేసుకున్న వ్యక్తులు బ్యాంకులకు కన్నాలు వేస్తుంటే స్వయం సహాయక సంఘాలు మాత్రం తీసుకున్న రుణాలను తిరిగి చెల్లిస్తున్నాయన్నారు.అయినా మహిళా స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు భయపడుతున్నారన్నారు. మహిళా సంఘాల తరఫున మేము బ్యాంకులకు గ్యారెంటీ ఇస్తున్నట్లు ప్రకటించారు.మహిళా సంఘాలు తీసుకునే ప్రతిపై చెల్లిస్తామని ఆమె బ్యాంకర్లకు భరోసా ఇచ్చారు. మహిళా స్వయం సహాయక బృందాలు స్వయం ఉపాధి స్థాయి నుంచి సంపద సృష్టించే స్థాయికి ఎదిగాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి మహిళా సంఘాల్లో కోటి మంది సభ్యులను చేర్చే లక్ష్యంగా ,అందరిని కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయకరణ చేయక ముందు బ్యాంకులన్నీ పట్టణాలకే పరిమితమైట్లు ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.బ్యాంకులను జాతీయకరణ చేయడంతో బ్యాంకులన్నీ పల్లెలకు తరలి వెళ్ళాయని అక్కడి పేదలకు లోన్లు కూడా ఇస్తున్నాయన్నారు. అందుకే మహిళా శక్తి పథకానికి ఇందిరమ్మ పేరుపెట్టుకున్నట్లు తెలిపారు. మాకు సంఘాలకు బ్యాంకర్లు ఇచ్చే లోన్లు దేశ ప్రగతికి ఉపకరిస్తాయని, అందుకే బ్యాంకర్లు తమ సహకారాన్ని మరింత విస్తరించాలన్నారు.

బ్యాంకు లోన్లకు దూరంగా ఉన్న వర్గాలను గుర్తించి లోన్లు ఇప్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు తీసుకోబోయే మొత్తం రుణాలను తిరిగి చెల్లిస్తామని బ్యాంకర్లకు ఆమె హామీ ఇచ్చారు.ఈ ఏడాది మహిళా సంఘాలకు లోన్లు ఇవ్వడంలో టార్గెట్ రీచ్ అయిన బ్యాంకర్లను మంత్రి సీతక్క ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డి కార్యదర్శి లోకేష్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యాదేవరాజన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూసీ పరీవాహక ప్రాంతాలను పరిశీలించిన ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నర్సింహారెడ్డి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:**మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను ఎంఆర్‌డిసిఎల్ ఎండి ఇవి నరసింహారెడ్డి పర్యటించారు. గురువారం ఈ రెండు రిజర్వాయర్ల పరిసర ప్రాంతాలను ఉన్నతాధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ల స్టోరేజ్ సామర్థ్యం, అందులోకి వచ్చే ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోకు సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ ఎండికి వివరించారు. అనంతరం మూసీలో మంచినీటిని విడుదల చేయడం, దానికి సంబంధించి ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో ఎండి అధికారులతో సమగ్రంగా చర్చించారు. మూసీ, ఈసా నదుల పరివాహ ప్రాంతాల వద్ద పర్యటించారు. బాపుఘాట్ వరకు విస్తరించి ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివరాలను ఆరా తీసారు. ఈ పర్యటనలో ఎంఆర్‌డిసిఎల్ జాయింట్ ఎండి గౌతమి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, చీఫ్ ఇంజినీర్ దత్తుపంత్, మెయిన్ హార్స్, జలమండలి సూపరింటెండెంట్ ఇంజినీర్ వినోద్ పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి కన్నుమూత

**హైదరాబాద్ (ఉప్పల్), మే 8, ప్రభాతవార్త:** ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి(80) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం మృతి చెందినట్లు మాజీ ఎమ్మెల్యే రాజిరెడ్డి సోదరుడు ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని ఆసుపత్రి నుంచి హబ్సిగూడలోని ఆయన నివాసానికి తరలించారు. బండారి రాజిరెడ్డి మృతి పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి కెటిఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పలువురు పార్టీల నేతలు, కాలనీ సంఘాల అధ్యక్షులు నివాళులు అర్పించారు. గత కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నుంచి పోటీ చేసి తొలిసారిగా ఉప్పల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. టిటిడి బోర్డు మెంబర్‌గా, శైలానగిరి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం చైర్మన్‌గా ఆయన పనిచేశారు. బండారి రాజిరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం కీసరలోని ఆయన వ్యవసాయం క్షేత్రంలో జరు గుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.



# తెలంగాణ మిర్చి రైతులకు మోడీ ప్రభుత్వం అండ

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ.. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ పథకం వర్తింపచేస్తామన్న కేంద్రం

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం(ఎంఐఎస్)లోని ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్‌ను అమలు చేయడం ద్వారా తెలంగాణ మిర్చి రైతులకు లబ్ధిచేకూర నుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. పంట పండించేందుకయ్యే ఖర్చుకన్నా తక్కువ మొత్తానికి మార్కెట్లో విక్ర యించాల్సిన పరిస్థితి వచ్చినప్పుడు కనీసం పండించేందుకు అయిన ఖర్చును అయినా అంది స్తూ మిర్చి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ఉండటానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. ఎంఐఎస్ మార్గ దర్శకాలను అనుసరించి ఈ పథకాన్ని తెలం గాణలో అమలు చేయడానికి సుముఖంగా ఉన్నా మని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని తెలం గాణ వ్యవసాయ శాఖకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలోని మిర్చి రైతులకు ఎలాంటి నష్టం చేకూరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. ఖమ్మం, మహబూబాబాద్, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నారాయణపేట, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రైతులు ఎక్కువగా మిర్చి పంట పండిస్తారని, వారికి బహిరంగ మార్కెట్‌లో సాగుధర కన్నా తక్కువ ధర వస్తుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకోవాలని ఆ లేఖలో కోరారు. దీనిపై కేంద్ర వ్యవసాయ శాఖ స్పందిస్తూ 2024-25 లో ఈ పథకం కింద తెలంగాణలో ఉత్పత్తి అయిన మిర్చి పంటలో 1,72,135 మెట్రిక్ టన్నుల పంటకు (తెలంగాణలో ఉత్పత్తి అయ్యే మొత్తం 6,88,540 మెట్రిక్ టన్నుల మిర్చి పంటలో 25 శాతం) ఈ పథకాన్ని వర్తింపజేస్తామని వెల్లడిం చింది. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద మార్కెట్ ధరకు, సాగు ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని రైతులకు చెల్లిస్తామని వెల్లడించింది. మిర్చి పంటకు ఎంఐఎస్ ధరను క్వింటాల్‌కు రూ.10,374గా నిర్ధారించింది. ఎంఐఎస్‌కు, మార్కెట్ ధరకు మధ్య వ్యత్యాసాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మిర్చి రైతులకు జరుగుతున్న నష్టంపై దృష్టి సారించాలన్నారు. ఈ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం భరించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రీయింబర్స్ చేస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ వివరించింది. పంటల ధరల హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు రైతులకు కనీస ధర రావాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆయ సురక్షణ్ అభియాన్ (పిఎం ఆశ) పథకాన్ని తీసుకొచ్చింది. అందులో భాగంగా మిర్చి సహా హార్టికల్చర్ ఉత్పత్తుల కోసం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీంను తీసుకొచ్చిందన్నారు.

# తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

## 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు నియామక పత్రాలు

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ (హెచ్‌డబ్ల్యూఓ)లంటే తల్లిదండ్రుల్లా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలని. విద్యార్థుల్లో కాన్ఫిడెన్స్‌ను అభివృద్ధి చేస్తూ వారికి భవిష్యత్ మార్గదర్శకులుగా ఉండాలని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బీసీ సంక్షేమ శాఖలో నూతనంగా నియామకమైన 132 మంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌కి సచివాలయంలో గురువారం నియామక పత్రాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాలమాయాదేవి, బీసీ గురుకుల సొసైటీ సెక్రటరీ సైదులు, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్ గౌడ్, మెట్టు సాయికుమార్, జైపాల్, జనార్దన్, కాల్వ సుజాత, వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్‌గా నూతనంగా నియామక పత్రాలు పొందుతున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. మీరంతా బీసీ సంక్షేమ శాఖ కుటుంబంలో చేరుతున్నారని.. పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి ఇది ఆత్మకమని అన్నారు. ఉపాధ్యాయులు, డాక్టర్, జర్నలిజం, రాజకీయాలు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వృత్తిలో ఒక గౌరవాన్ని సాధించుకుంటామన్నారు. రాష్ట్రంలో 703 హాస్టల్స్ ఉంటే వాటిలోని ఖాళీల భర్తీ పూర్తి చేశామన్నారు. డిసెంబర్ 7, 2023న ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. విద్యార్థులకి మెస్ ఛార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచామని.. బలహీన వర్గాల శాఖ కుటుంబ గౌరవాన్ని పెంపొం దించాలన్నారు. పేదలకే పరిమితం అయిన సన్న బియ్యం సామాన్యుడి వరకు ప్రభుత్వం అందిస్తుందని.. బలహీన వర్గాల శాఖ మంత్రిగా తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్‌గా కుల సర్వే చేశామన్నారు.

# తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌దే

## బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తీవ్రవాదరహిత తెలంగాణగా మార్చాల్సిన బాధ్యత సిఎం రేవంత్‌రెడ్డిపై ఉందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని, భారత సైన్యానికి సహ కరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో కూడా అక్రమ వలసదారులను యుద్ధ ప్రాతి పదికన గుర్తించి తిప్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మరోవైపు దేశ సమగ్రతపై దాడి జరిగిన నేపథ్యంలో భారత సైన్యం మహిళా సైనికులు అత్యంత సాహసోపేతంగా మాతృమూర్తులను సింధూరాన్ని తుడిచివేసిన ఉగ్రవాదులపై దాడి చేసి బుదులు తీర్చుకుంటే ఇక్కడున్న కొంతమంది కుహనా మేధావులు ఆపరేషన్ సింధూర్‌ను హేళన చేసేలా సామాజిక మాధ్య మాల్లో పోస్టులు చేయడం దురదృష్టకరం అన్నారు. ఒక యాని వర్సిటీలో బాధ్యతగల స్థానంలో ఉన్న సూరెపల్లి సుజాత సామాజిక మాధ్యమాల్లో దేశ వ్యతి, ఆపరేషన్ సింధూర్ పట్ల హేళనగా పోస్టులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. సుజాతపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్య శిక్షణకు వినూత్న కార్యక్రమం

## జెఎన్‌టియు - టిసిఎస్ అయాన్ ఒప్పందం

### మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ సర్వీస్ ప్రోగ్రాం కింద ఐదు నెలల శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సన్నద్ధులుగా తీర్చిదిద్దేందుకు ముందుకొచ్చిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సచివాలయంలో మంత్రి సమక్షంలో హైదరాబాద్ జెఎన్‌టియు - టిసిఎస్ అయాన్ సంస్థల మధ్య అవగా హన ఒప్పందం కుదిరింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పి యువతను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రారంభించామని శ్రీధర్ బాబు తెలిపారు. సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం కష్టం అన్నారు. దీనిని అర్థం చేసుకుని స్పందించే శిక్షణ పైన దృష్టి సారించామన్నారు. ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే ఇక్కడ యానికి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అంశంలో నైపు ణ్యం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. టిసిఎస్ అయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలలకు 20 వారాలకు వంద మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ట్రెయినింగ్ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో ఎంప్యానెల్ అయిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మొదట మంథనిలోని జెఎన్‌టియు కళాశాల విద్యార్థులకు ప్లేస్ మెంట్ సర్వీస్ ప్రోగ్రాం కింద నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం అన్నారు.

09-05pg10exHMNWJQE.qxd:09-05pg10exHMNWJQE.qxd 09/05/25 1:59 AM Page 1





# టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్‌లో జడేజా

## సెకండ్ ప్లేస్‌లో బంగ్లా క్రికెటర్ మిరాజ్



**న్యూఢిల్లీ:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏకంగా 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అయితే బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్ రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్ ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జోయ్ రూట్ ఈసారి కూడా టాప్ 20లో చోటు దక్కించుకోలేకపోయారు. అయితే జింబాబ్వే లెఫ్ట్ హ్యాండర్ సీన్ విలియమ్స్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 19వ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన షద్మాన్ ఇస్లామ్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకుని 60వ స్థానానికి దూసుకెళ్లాడు. మిరాజ్ టెస్టు బౌలర్స్ విభాగంలో కూడా రెండు స్థానాలు మెరుపర్చుకుని 24వ స్థానానికి వెళ్లాడు.

# మహిళల ఫుట్‌బాల్ వరల్డ్ కప్

## జూన్ 24 నుండి జూలై 25 వరకు



**న్యూఢిల్లీ:** లాటిన్ అమెరికాలో జరిగే మొదటి ఎడిషన్ అయిన 2027 మహిళల ప్రపంచ కప్‌లో మ్యాచ్‌లను నిర్వహించడానికి ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బ్రెజిల్‌లోని ఎనిమిది వేదికలలో మరకానా స్టేడియం ఒకటి అని సాకర్ అంతర్జాతీయ పాలక సంస్థ ఫిఫా గురువారం తేదీలను ప్రకటించింది. దక్షిణ అమెరికాలో తొలిసారిగా జరుగుతున్న మహిళల ప్రపంచ కప్‌లో వివిధ దేశాల జట్లు పాల్గొంటాయి. జూన్ 24 నుండి జూలై 25, 2027 మధ్య జరిగే ఈ టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొంటాయి. రియో డి జెనీరోలోని ఐకానిక్ వేదికతో పాటు, పోటీలోని 64 మ్యాచ్‌లు బెలో హారిజాంటే (మినీరావ్ స్టేడియం), బ్రెసిలియా (నేషనల్ స్టేడియం), ఫోర్టలేజా (కాస్టెలావో అరేనా), పోర్టో అలెగ్రే (బైరారియో స్టేడియం), రెసిఫ్ (పెర్నాంబుకో అరేనా), సాల్వాబుకో అరేనాలో జరుగుతాయి. (ఇటాక్వెరా అరేనా)లో జరగనున్నాయి.ఫిఫా మహిళల ప్రపంచ కప్ 2027 ఒక చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుంది, ఈ టోర్నమెంట్ మొదటిసారి దక్షిణ అమెరికాకు వెళుతుంది" అని ఫిఫా ప్రధాన కార్యదర్శి మాటియాస్ గ్రాఫ్‌స్ట్రోమ్ అన్నారు. "మహిళల క్రీడ అసాధారణ వేగంతో అభివృద్ధి చెందుతూనే ఉంది మరియు టోర్నమెంట్‌ను బ్రెజిల్‌కు తీసుకురావడం ఖండం అంతటా మరియు అంతకు మించి కొత్త తరానికి స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. కాగా ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహించిన 2023 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న స్పెయిన్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఉంది.

## వరల్డ్ కప్ ఆర్చరీలో భారత్‌కు

# రెండు పతకాలు ఖరారు

### 9, 12 స్థానాల్లో ధీరజ్, దీపిక

**న్యూఢిల్లీ:** వరల్డ్ కప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖరారయ్యాయి. షాంఘైలో జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఫలితంగా భారత్ ఖాతాలో కనీసం రెండు స్వర్ణాలు లేదా రెండు రజతాలు చేరనున్నాయి. తెలంగాణకు చెందిన తనిపర్తి చికిత, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్రకు చెందిన మధురలతో కూడిన భారత్ మహిళల కాంపౌండ్ జట్టు, ప్రవీణ్ దేవ్‌తలే, రిషబ్ యాదవ్, అభిషేక్ వర్మలతో కూడిన భారత్ పురుషుల కాంపౌండ్ జట్టు టైటిల్



పోరుకు అర్హత సాధించాయి. శనివారం భారత్, మెక్సికో జట్లు రెండు స్వర్ణాల కోసం హోరాహోరీగా పోటీ పడనున్నాయి. క్వార్టర్ ఫైనల్లో భారత్ మహిళల జట్టు 232-229 పాయింట్ల తేడాతో అడెల్ జెక్సెన్‌బినోవా, విక్టోరియా లియాన్, రొక్సానా యునోసోవాలతో కూడిన కజకిస్తాన్ జట్టును ఓడిం చింది. సెమీ ఫైనల్లో భారత్ జట్టు 232-230 పాయింట్లతో ఎల్లా గిబ్సన్, ఇసబెల్లా కార్పెంటర్, లేలా అనిసన్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై గెలుపుసాధించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ పురుషుల జట్టు 239-232 పాయింట్ల తేడాతో అజయ్ స్కాట్, ఆడమ్ కార్పెంటర్,ల్యూక్ డేవిస్‌లతో కూడిన బ్రిటన్ జట్టుపై నెగ్గింది. సెమీ ఫైనల్లో భారతబృందం 232-231 పాయింట్ల తేడాతో మథియాస్ ఫుల్లర్టన్, మారిటన్ డామ్స్‌బో, నిక్లాస్ బ్రెడాల్‌తో కూడి డెన్మార్క్ జట్టును ఓడించింది. ఇక రికర్వ్ విభాగం పురుషుల క్వాలిఫయింగ్‌లో భారత్ ఆర్చర్లు అంతగా ఆకట్టుకోలేకపోయారు. ఓవరాల్‌గా 1995 పాయింట్లు స్కోరు చేసి 7వ స్థానంలో నిలిచిన భారత్‌కు తొలి రౌండ్‌లో బై లభించింది. కాగా మహిళల క్వాలిఫయింగ్‌లో భారత్ స్టార్ దీపిక కుమారి 655 పాయింట్లు సాధించి 12వ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే 652 పాయింట్లలో అంకిత 17వ, 642 పాయింట్లతో అన్షిక 29వ, 637 పాయింట్లతో సిమ్రన్‌జిత్ కౌర్ 39వ స్థానంలో నిలిచారు. మొత్తంగా 1949 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో నిలిచి తొలి రౌండ్‌లో బై దక్కింది.



## టెర్రర్ అటాక్ ఎఫెక్ట్:

# ఆసియా కప్ క్యాన్సిల్?

### భారత్‌పాక్ మ్యాచ్‌లు రద్దు!

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి వల్ల భారత్ పాకిస్థాన్ మధ్య క్రికెట్ సంబంధాలపై ఎఫెక్ట్ పడనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జరగాల్సిన 2025 ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ పాల్గొనడంపై గందరగోళం నెలకొంది. ఒకవేళ భారత్ లేకపోతే టోర్నీకి ఆదరణే ఉండదు. స్పాన్సర్లు కూడా ఆసక్తి కనబర్చరు. అందుకే ప్రస్తుత పరిస్థితుల కారణంగా టోర్నీ వాయిదా పడే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ఆసియా కప్ సెప్టెంబర్‌లో జరగనుంది. ఈసారి టోర్నీకి ఆతిథ్య హక్కులు భారత్ వద్దే ఉన్నాయి. కానీ, టోర్నీని యూఏఈ లేదా శ్రీలంక వేదికగా నిర్వహించే ఛాన్స్ ఉంది. షెడ్యూల్ కూడా ప్రకటించాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల కారణంగా ఆసియా కప్ వాయిదా పడే అవకాశం ఉంది. భారత్ పాకిస్థాన్ మధ్య ఇప్పుడు సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీ నిర్వహించే అవకాశాలు చాలా తక్కువని భారత్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. కాగా గతంలో ఎప్పుడూ లేనట్లుగా ఈసారి ఈ టోర్నమెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించాలని నిర్ణయించారు.

టోర్నీలో 8 జట్లు టీ20 ఫార్మాట్‌లో తలపడేలా ప్లాన్ చేశారు. కొత్తగా ఒమన్, హాంగ్ కాంగ్ ఆసియా కప్‌లో ఆడనున్నాయి. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, ఒమన్, హాంగ్‌కాంగ్ జట్లు పోటీ పడనున్నాయి. 8 జట్లను రెండు గ్రూపులుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహించేలా ప్లాన్ చేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల వల్ల టోర్నీ నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది. ఇక బంగ్లా టూర్ కూడా క్యాన్సిల్ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. భారత సీనియర్ పురుషుల జట్టు ఆగస్టులో బంగ్లాదేశ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ టూర్‌లో బంగ్లాతో మూడు వన్డే, మూడు టీ20లు ఆడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్ పర్యటనకు కూడా భారత్ వెళ్లే అవకాశం తక్కువేనని తెలుస్తోంది. ఐసీసీ క్యాలెండర్ ఇయర్‌లో బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడేందుకు వీలు ఉంది. కానీ, ఇది కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. భారత్‌కు సంబంధించిన రాష్ట్రాలపై ఆ దేశ నేత చేసిన కామెంట్స్ దీనికి కారణం అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇరు దేశాల మధ్య భద్రతా కారణాల వల్ల గతంలోనే భారత్ పాక్ ద్వైపాక్షి క సిరీస్‌లు రద్దయ్యాయి. ఈ రెండు జట్లు ప్రస్తుతం ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. అయితే ఈ విషయంలోనూ ఐసీసీ దృష్టిపెట్టాలని రీసెంట్‌గా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. మరోవైపు పాక్‌తో పూర్తిగా క్రికెట్ సంబంధాలు తెంచుకోవాలనే డిమాండ్ తెరముందుకొచ్చింది.

# టీమిండియా కెప్టెన్సీకి గట్టి పోటీ

## రేసులో బుమ్రా, గిల్, కోహ్లీ

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 మధ్యలో రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో భారత టెస్ట్ జట్టు కెప్టెన్సీ ఖాళీ అయింది. ఆ పోస్టు ఎవరికి దక్కుతుందో అని అందరిలో ఆసక్తి నెలకొంది. మరోపక్క టీమిండియా కెప్టెన్సీకి గట్టి పోటీ ఎదురైంది. కెప్టెన్సీ రేసులో పలువురు పోటీ పడుతున్నారు. ప్రధానంగా జస్ప్రీత్ బుమ్రా, శుభమన్ గిల్, విరాట్ కోహ్లీకి మధ్య పోటీ ఎదురైంది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ, న్యూజిలాండ్‌తో స్వదేశంలో మూడు టెస్టుల్లో ఓడిపోవడంతో రోహిత్ కెప్టెన్సీకి ప్రమాదం వచ్చింది. ఐపీఎల్ తర్వాత భారత జట్టు



ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. సో ఈ సిరీస్ కంటే ముందు జట్టును ఎంపిక చేసే క్రమంలో రోహిత్ కెప్టెన్సీపై సెలెక్టర్లు అతని మాట్లాడినట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ వదిలేయాలని సెలెక్టర్లు కోరడంతో, కెప్టెన్సీతో పాటు ఇక టీమ్‌లో ఉండటం కూడా కష్టమే అని భావించిన రోహిత్ ఏకంగా టెస్ట్ ఫార్మాట్‌కే రిటైర్మెంట్ ప్రకటించాడు. మరి రోహిత్ తర్వాత రాబోయే ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో భారత జట్టును నడిపించే అవకాశం జస్ప్రీత్ బుమ్రా లేదా శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీలలో ఒకరిని ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. ఈ ముగ్గురిలో ఒకరు జట్టుకు నాయకత్వం వహించవచ్చు. ఎక్కువగా అయితే బుమ్రాకే అవకాశం ఉంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో అతని కెప్టెన్సీలో టీమిండియా ఒక మ్యాచ్ కూడా గెలిచిన విషయం తెలిసిందే. గాయాల పాలు కాకుండా ఉంటే టెస్ట్ ఫార్మాట్‌లో బుమ్రా టీమిండియా కెప్టెన్ అయ్యే ఛాన్స్ ఎక్కువగా కనిపిస్తోంది. మరి టెస్ట్ క్రికెట్‌లో కెప్టెన్‌గా అదిరిపోయే రికార్డ్ ఉన్న విరాట్ కోహ్లీని కూడా సెలెక్టర్లు మరోసారి సంప్రదించనున్నట్లు వెల్లడవుదోంది.

**వాణిజ్యం**

# దలాల్ స్ట్రీట్‌కు ఉద్రిక్తతల ఎఫెక్ట్..



**ముంబై, మే 8:** భారత్ పాక్ మధ్య నెలకొన్న ఉద్రి క్తతలు దలాల్ స్ట్రీట్‌ను తాకాయి. ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన భారత సైనిక చర్యను జీర్ణించుకోలేని పాక్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణిదాడులకు యత్నిం చింది. దీంతో ఆ దేశంలో మోహ రించిన గగనతల రక్షణ వ్యవస్థల ను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడుల్లో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడిం చాయి. ఈ వార్తల నేపథ్యంలో ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. చివరి గంటలో అమ్మ కాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్400 పాయింట్ల కు పైగా నష్టపోగా, నిఫ్టీ24,300 దిగువకు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఉదయం 80,912.34 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. తర్వాత స్వల్ప శ్రేణిలో లాభనష్టాల మధ్య చలించింది. చివరి గంటలో అమ్మకాల ఒత్తిడిని సెన్సెక్స్ 411.97 పాయింట్ల నష్టంతో 80,334.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్ల నష్టంతో 24,273.80 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.72గా ఉంది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.95 శాతం పతనం అవ్వగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.43 శాతం మేర క్షీణించింది. ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, టాటాస్టీల్ షేర్లు ప్రధానంగానష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు లాభ పడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 61.95 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,348 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

**అరగంట పాటు నిలిచిన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్**

భారత్ దెబ్బకు పాక్ స్టాక్ మార్కెట్ కుదేలవుతోంది. ఆపరేషన్‌సిందూర్‌తో బుధవారం భారీగా పతనమైన పాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్.. అరగంట పాటు నిలిచి పోయింది. కరాచీ సమీపంలో భారత సైనిక బలగా లు విరుచుకుపడ్డాయన్న సమాచారంతో వ్యాపించ డంతో ఈ పరిస్థితి నెలకొంది. ట్రేడింగ్ నిలిపివేతకు ముందు కేఎస్‌ఈ 100 సూచీ దాదాపు 6,948 పాయింట్ల నష్టంతో 103,060 వద్ద నిలిచింది.

# గూగుల్‌లో మరోసారి ఉద్యోగాల కోత..

**ముంబై, మే 8:** కృత్రిమ మేధ అభివృద్ధిపై దృష్టిపెట్టిన టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి కంపెనీలో పునర్వ్యవస్థీకరణ చర్యలు చేపట్టింది. ఈక్రమంలోనే మళ్లీ లేఆఫ్‌లు ప్రకటించింది. సేల్స్, పార్ట్‌నర్‌షిప్ విభాగాలను పర్య వేక్షించే తమ గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్‌లో 200 మంది ఉద్యోగులను తొలగించినట్లు తెలుస్తోంది. కస్టమర్లకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు ఈ చిన్న చిన్న సర్దుబాట్లు తప్పడం లేదని లేఆఫ్‌ల గురించి గూగుల్ వెల్లడించినట్లు తెలిపింది. నెల రోజుల వ్యవధిలో ఈ సంస్థ ఉద్యోగు లను తొలగించడం ఇది రెండోసారి కావడం గమ నార్హం. ఏప్రిల్‌లోనే తమ ప్లాట్‌ఫామ్, డివైజ్ యూనిట్లలో పనిచేసే వందల మంది ఉద్యోగులను కంపెనీ తొలగించింది.ఆండ్రాయిడ్ సాఫ్ట్‌వేర్, పిక్సెల్ ఫోన్లు, క్రోమ్ బ్రౌజర్లలో పనిచేసే ఉద్యోగులపై ఈ వేటు పడింది.కంపెనీ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా గత రెండేళ్లలో గూగుల్ అనేకమందిని విధుల నుంచి తప్పించింది. గతేడాది డిసెంబరులో మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఇక, ఈ ఏడాది ఫిబ్రవరిలో హెచ్‌ఆర్ విభాగం, క్లౌడ్ ఆర్గనైజేషన్‌లో కొంత మందిని తొలగించింది. ఖర్చు తగ్గింపులో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. గూగుల్‌లో 20 శాతం మంది మరింత సమర్థంగా పని చేయాలని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ 2022లో వెల్లడించారు. ఆ మరుసటి ఏడాదే 12వేల మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. ఓపెన్‌ఏఐ వంటి సంస్థలు సెర్చ్ంజిన్‌ను తీసుకొస్తుండడంతో గూగుల్‌కు గట్టి పోటీ తప్పదని విశ్లేషకులు భావిస్తున్న వేళ ఈ తొలగింపులు చేపట్టడం గమనార్హం. ఇక, అమెరికాలో విదేశీ నిపుణులపై ట్రంప్ కఠిన నిబంధనలు అమలుచేస్తున్న సమయంలో ఈ లేఆఫ్ వార్తలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



# 116.37 కోట్లకు పెరిగిన వైర్‌లెస్ కస్టమర్లు


**ముంబై, మే 8:** టెలికం సేవల వినియోగదారుల్లో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య మార్చిలో పెరిగి మొత్తం 116.37 కోట్లకు చేరుకుంది. ఇది ఫిబ్రవరిలో 116.33 కోట్లుగా ఉంది. ఈ మేరకు టెలికం రెగ్యులేటర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) వివరాలు వెల్లడిం చారు. ముఖ్యంగా గ్రామీణ సబ్‌స్క్రిప్షన్లు పెరగ్గా, పట్టణ సబ్‌స్క్రి ప్షన్లు స్వల్పంగా తగ్గాయని తెలిపింది.రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు భారత టెలికం పరిశ్రమలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ చందాదారుల చేరికల్లో అగ్రగామిగా నిలిచాయి. భౌగోళికంగా ఢిల్లీ సర్వీస్ సెంటర్ అత్యధిక టెలి-సాంద్రతను కలిగి ఉంది. అంటే యూనిట్ ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో మొబైల్ చందాదా రులను కలిగి ఉండడం. బీహార్ అతి తక్కువ టెలి-సాంద్రతను నమోదు చేసింది. పెరుగుతున్న సబ్‌స్క్రైబర్ల సంఖ్య దేశంలో కొనసాగుతున్న డిజిటల్ పరివర్తనను హైలైట్ చేస్తుంది.

యూజర్ డెమోగ్రాఫిక్స్, నెట్‌వర్క్ డిమాండ్లకు సంబంధించి టెలికం ఆపరేటర్లు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది చూడాల్సి ఉంది. వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెరగడం చాలా అంశాలను ప్రభావితం చేస్తుంది. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో మెరుగైన కనెక్టివిటీకి అవకాశం అందిస్తుంది. ఆన్‌లైన్ బ్యాంకింగ్, విద్య, ఆరోగ్య సంరక్షణ, ప్రభుత్వ సేవలు ఎక్కువ మంది పొందేందుకు వీలవుతుంది. ఇ-కామర్స్, ఫిన్ టెక్, డిజిటల్ ఎంటర్‌టైన్ మెంట్ రంగాలు వృద్ధి చెందుతాయి. మొబైల్ వినియోగదారూలకు సేవలందించే వ్యాపారాలు, ముఖ్యంగా మొబైల్ అప్లికేషన్లు, స్ట్రీమింగ్ సేవలు, డిజిటల్ సర్వీసులు పెరుగుతాయి.

# మెటా నుంచి కొత్త ఎఐ యాప్

**ముంబై, మే 8:** రోజు రోజుకూ అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత పెరుగుతోంది. వ్యాపారం, వైద్యం, విద్య, వినోదం సహా అనేక రంగాల్లో ఎఐ పరిష్కారాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఎవరి నోటా విన్న ఎఐ మాటే వినిపిస్తోంది. ఇక వినియోగ దారుల మన్నన పొందేందుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్ వంటి టెక్ దిగ్గజాలు ఎప్పటికప్పుడు కొత్త ఎఐ టూల్స్‌ను పరిచయం చేస్తున్నాయి. రంగాల గురించి అద్భు తంగా సమాచారం అందిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, ఫేస్‌బుక్‌లో ప్రతిరోజూ చాలా మంది మెటా ఎఐని వినియోగిస్తున్నారు. ఈ యూజర్లకు మెరుగైన ఫీచర్లను

తాజాగా మెటా కూడా ఎక్కడా తగ్గకుండా, తన సేవలన్ని మరింత మెరుగుపరుస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా మెటా ఎఐ యాప్‌ను లాంచ్ చేసింది. చాట్‌బాట్ రంగంలో చాట్ జిపిటికి గట్టి పోటీ ఇవ్వడానికి మెటా ఎఐ యాప్‌ను తీసుకొచ్చింది. యూజర్ల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఒఎస్ వినియోగదారులకు ఉచితంగా అందు బాటులో ఉంది. ఇక లామా 4 లాంగ్వేజ్ మోడల్‌తో రూపొందించిన ఈ యాప్, కేవలం ప్రశ్నలకు సమాధానం ఇవ్వడమే కాకుండా, చాట్, రచనలు, హ్యూమర్, సహాయక సమాచారం ఇలా నేక అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేకంగా అప్లికేషన్‌ను పరిచయం చేస్తున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. అలాగే ఈ యాప్‌లో డిస్కవర్ ఫీడ్ అనే ప్రత్యేక ఫీచర్ ఉంది. ఇక్కడ యూజర్లు తమ ఎఐ ప్రాంప్ట్‌లు, చిత్రాలు, చాట్‌బాట్ రిప్లైలను షేర్ చేయొచ్చు. ఇతరులు వాటిని లైక్ చేయొచ్చు, కామెంట్ లేదా రీమిక్స్ చేయొచ్చు. అయితే ఈ యాప్ ప్రస్తుతం అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే మిగతా యూజర్లకు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు సంస్థ తెలిపింది.








Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps